ఆంధ్ర సచిత్ర వార పత్రిక



40, పైసలు


6-12-68



పాండ్స్ ఫేస్ పౌడర్‌తో వనితల ముఖము గంటల కొలది మనోహరమైన వర్ఛస్సుతో వుంటుంది

అందు వలననే చాలమంది స్త్రీలు ఏ యితర పౌడర్ కంటే పాండ్స్ ఫేస్ పౌడర్‌నే వాడుతున్నారు

పాండ్స్ ఫేస్ పౌడర్, దాని ప్రత్యేక ఫార్ములా వలన యితర ఫేస్ పౌడర్‌ల కన్నా చాలాసేపు చర్మము మీద నిలిచి వుంటుంది. అతి మెత్తటి పాండ్స్ ఫేస్ పౌడర్ చర్మము మీద సునాయాసంగా సరిసమానంగా అంటి మీ ముఖమునకు మెరుగులు దిద్దుతుంది.



పాండ్స్ ఫేస్ పౌడర్ చక్కని రంగులలో లభిస్తుంది. నేచురల్, రాషెల్, గోల్డెన్ రాషెల్, పీచ్, సన్ ట్యాన్, బ్రాంజ్, హనీ గ్లో మరియు తెలుపు అది అనువైన మూడు సైజులలో లభిస్తుంది — చిన్నది, మధ్య సైజు, పెద్దది.

పాండ్స్ ఫేస్ పౌడర్—ప్రపంచమంతటా అందకత్తెలు వాడే ఫేస్ పౌడర్!

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమిత బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపించబడినది)



దగ్గు, జలుబులు నీర్సమును కలిగిస్తాయి, యితర వ్యాధులకు దారి తీస్తాయి


వాటర్‌బరీస్ కాంపౌండ్

ఎట్టి లేబిల


ఉపశమనముతో సహా రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది!

దగ్గు, జలుబులతో నీర్సముగా ఉండి రోగనిరోధక శక్తిని కోల్పోతారు. అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశముంది. అందువలన క్రమంగా వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి. వాటర్‌బరీస్ కాంపౌండ్‌లో గల ఓషధులు ఆకలిని వృద్ధి చేస్తాయి, కోల్పోయిన శక్తిని తిరిగి చేకూరుస్తాయి, ఇతర వ్యాధులు కలగకుండా రోగనిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర్చబడిన 'క్రియొసోట్' మరియు 'గయొకోల్' దగ్గు, జలుబుల నుండి ఉపశమనమును కలిగిస్తాయి.

బలము మరియు ఆరోగ్యమునకు
వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి!



వార్నర్-హిందూస్తాన్ లిమిటెడ్



ఉత్తరాలు

ఆటలు

భారత హాకీ జట్టు బాగా ఆడకపోవడం వల్లనే ఆస్ట్రేలియాపై గెలుపు సాధించలేకపోయిందని ఎవరూ అనలేదు. అనరు కదా! ఫస్ట్ రవుండ్‌లో మన జట్టువారు తమ స్థాయిని న్యూజిలాండ్ జట్టు స్థాయి కంటె ఎక్కువగా ఊహించుకొని ఆడినందు వల్ల ఓటమిని ఎదుర్కొనవలసి వచ్చిందని చెప్పటానికి అభ్యంతరం లేకపోయినా, సెమీ ఫైనల్సు సంగతి వేరు అనాలి. సెమీఫైనల్సులో వారి ఆటని నిందించి, వారు తిరిగి వచ్చినప్పుడు నిరసనాభావంతో చూడడం మనల్ని మనం కించపరచుకోవటమే! మన జట్టువారు గెలవడం వారి బాధ్యత అన్నట్లు మనం భావిస్తున్నాం. 'వుయ్ ఆర్ ది ప్రైడ్ ఆఫ్ నేషన్' అనే భావన సముద్రాలు దాటి వెళ్ళిన క్రీడాకారులకు ఉండడం సహజం. ఆ సంగతి ఆటగాళ్ళు స్టిక్‌ను కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి త్రిప్పేటప్పుడున్నూ జ్ఞాపకం చెయ్య నవసరంలేదు.

వారికి సానుభూతి చూపకుండా, పరిస్థితులు తెలుసుకోకుండా 'క్రమశిక్షణారాహిత్యం, సాక్షికంగా ఆలోచించడమే మన బృందం ఓటమికి కారణం' అనడం అనుచితం. బహుశా మన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి గారికి తమ పార్టీ గొడవలు జ్ఞప్తికి వచ్చి అలా 'కామెంటు' చేసి ఉంటారు. ఆ విధంగా వ్యాఖ్యానించే ముందు విషయం 'పొలిటిక్సు' కాదని ఆలోచించి ఉండాల్సింది. జర్నలిస్టులు అడిగిని ఈ విషయంపై 'కామెంట్' చెయ్యమని ఆటగాళ్ళింది కాదు. పోని అడిగినందుకు గాను ఆటగాంధ్ర గురించి తాను పూర్తిగా ఎరిగి ఉన్నట్లు వ్యాఖ్యానించడం సబబు కాదు. క్రీడా రంగంలో అనుభవం గడించిన వారు, ప్రస్తుత ఆటగాంద్రను బాగా ఎరిగినవారున్నూ అయిన అధికారులు ఇతరదేశాల ఆటస్థాయి పెరిగిందన్నారే గాని, ఓడిపోవడానికి ముఖ్యకారణం మన జట్టువారని నిందించలేదు. అందువల్ల కె. ఎస్. నరసింహన్ గారనుకున్నట్లు ప్రధాని మాటలకు మనం ప్రాముఖ్యత నివ్వ నవసరంలేదు. గెలవటం అన్న ధ్యేయాన్ని వెనుక్కునెట్టి, ఆటస్థాయిని పెంచడమే ప్రముఖ లక్ష్యంగా నిర్విరామ కృషి జరుగుతూ ఉంటే చూసి సంతోషించడమే హాకీ క్రీడాభిమాని ప్రస్తుత కోర్కె.

డి. సాయినాధ (హైదరాబాద్)

సీరియల్స్

ఈ వారం పత్రికలో 'సుజాత' ముగింపు చాలా బాధాకరంగా ఉంది. అయినా ముగింపు చాలా బాగుంది. ఈవారం (22—11—68) వెలువడిన కధలలో యర్రంశెట్టి శాయిగారి గొలుసు కధ "నీలాంటి ఒకరు" బాగుంది వారికి నా అభినందనలు. రెండో భాగం కొరకు ఎదురు చూస్తుంటా.

శ్రీమతి వి. జయలక్ష్మి (కర్నూలు)

సుజాత సీరియల్ అయిపోయింది అని చూడగానే ఆశ్చర్యం వేసింది. హఠాత్తుగా ముగించారు విజయలక్ష్మిగారు. కథ ఇంక చాలా వుస్తుందనుకున్నాము. ముగింపు బాగోలేదు. (శ్రీధర్ మనస్సు మార్చుకొన్నాడు కాబట్టి సుజాత కొంచెం బాధ పడినా తరువాత సంతోషంగా వుండి, పాపను తీసుకొచ్చి పెంచుకొన్నట్లుగా వ్రాస్తే బాగుండేది. సుజాత చనిపోవటంపం బాగాలేదు. వి. జ్యోతి (వణుకూరు)

* * *

మీ ఆంధ్రసచిత్ర వారపత్రికలో ఈ వారం వరకు ధారావాహికంగా ప్రచురింపబడిన ఉన్నవ విజయలక్ష్మి గారి 'సుజాత' ఈ మధ్య వెలువడిన సీరియల్స్‌లో అత్యుత్తమంగా వున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాను. సుజాత ముగింపులో ఒక ప్రత్యేకత వుంది. అన్ని నవలలలో వలెనే శ్రీధర్ క్షమాభిక్షను ఆధారం చేసుకొని జీవితాన్ని గడిపితే పాత చింతకాయ పచ్చడి వలె ఉండేది. కాని సుజాత మరణంతో సీరియల్ అనుకోని విధంగా ముగిసింది. అయాచితంగా జరిగిన ఒక సంఘటన ఆధారంగా అల్లబడిన ఈ నవలలో భర్త క్షమించినప్పటికీ మోసం చేశాననే వ్యథతో కుమిలి కృంగి కృశించి మరణించిన సుజాత పాత్ర పాఠకుల మనస్సులలో నిలిచిపోతుంది.

ఎస్. ప్రవీణారాణి (కొవ్వూరు)


ఉత్తరాలు

కథలు

జీవితంలోని విషాదాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని, చివరకు ఏమం ప్రతాగాక కన్న పిల్లల కోసం పతమతమయ్యే మాతృ హృదయపు వేదన చక్కని శైలిలో, వేగంగా స్పందించే హృదయంతో చివరదాకా పాఠకుణ్ణి చదివించిన 'మూర్యోదయం' రచయిత్రి పి. సత్యవతిగారు ఎంతైనా అభినందనీయులు.

తాళ్లూరు నాగేశ్వరరావుగారి 'మమత—భ్రమలో' కూడా చాలా బాగుంది. ఈ కథలో పశువుల మీది ప్రేమతో కమలం వదులుకోలేని ఒక పాలేరు సజీవ రూప కల్పన పాఠకుణ్ణి కర్షిస్తుంది. కోటేశు పాత్ర పాఠకుడి హృదయంలో శాశ్వత ముద్ర వేసుకుంటుంది.

కొట్టకోట యాదగిరిరావు, (సైదాబాద్).



ఆంధ్రవిశ్వవిద్యాలయ నూతన ఉపాధ్యక్షులు శ్రీ బంకేపల్లి మల్లయ్య.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 6—12—'68
కీలకనామ సంII మార్గశిర మాసం బహుళ పాడ్యమి

సంపుటము : 61 సంచిక : 15

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మ్రదాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
'శ్రీరామకథ'లో గీతాంజలి


ఇదిగో మీ పథకాలకి సహాయం
42 కోట్లు
ఆంధ్ర
కాని, వడ్డీతో సహా మొత్తం చెల్లించాలి
69 కోట్లు
ఆంధ్ర
భుట్టో
లాంగుర్లు
తూర్పుపాకిస్తాన
విదేశీ ఈగలు
పాకిస్తాన్ ఈగల మీద యుద్ధం పకటించింది!
మెక్‌నమారా పర్యటన
వర్షానికే సుస్వాగతం!
ప్రణాళికల పంటభూమి
OOMMEN

తగ్గిపోతున్న విదేశ సహాయం

భారతదేశానికి వచ్చే విదేశ సహాయం మొత్తం క్రమంగా క్షీణిస్తూ వస్తోంది: అని ప్రత్యేక కార్యదర్శులలో ఒకరు (ఆర్థిక వ్యవహారాలు) అయిన శ్రీ ఐ.జి. పటేల్ విలేఖరులతో చెప్పారు. భారత దేశానికి ఏటా సహాయం చేసే 'కన్సార్టియమ్' దేశాలవారు పోయిన సంవత్సరం కేటాయించిన మొత్తాన్నే కేటాయిస్తున్నారు. ఈ ఏడు సుమారు 32.5 కోట్ల డాలర్లు వచ్చాయి. ఇంకా 15,20 కోట్లు (ఎక్కువభాగం అమెరికా సంయుక్త రాష్ట్రాల వద్దనుంచి) రావచ్చుట. ఇదంతా పాత బాకీలని తీర్చటానికే ఎక్కువ ఉపయోగ పడుతుంది!

1967–68 లో భారత దేశానికి 55 కోట్ల డాలర్లు మాత్రమే లభించింది. 1966–67లో 90 కోట్ల డాలర్లు వచ్చాయి. దీనినిబట్టి విదేశ సహాయం ఎంత తగ్గిపోతున్నదో గ్రహించవచ్చు. ఈ తగ్గింపులో అధికభాగం అమెరికా సహాయంలో తగ్గింపే. అమెరికా సహాయం తగ్గటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి మనదేశానికి సంబంధించినది, రెండవది వారి దేశానికి సంబంధించినది. మార్చి, 1969 కి కొత్త అధ్యక్షుడు నిక్సన్ అధికారంలోకి వస్తారు. అప్పటికి అమెరికా ఆంతరంగిక పరిస్థితుల రూపం స్పష్టం అవుతుంది.

వియత్నామ్ యుద్ధంఖర్చులు తగ్గితే?

ఇక్కడ కొన్ని విషయాలని గమనించాలి. వియత్నామ్‌లో శాంతి పెరిగిన కొద్దీ అమెరికాలో డబ్బు మిగలటం ఎక్కువ అవుతుంది. వియత్నామ్ యుద్ధంమీద అమెరికా సాలుకి 500 కోట్ల డాలర్లదాకా (సుమారు 3750 కోట్ల రూపాయలు) ఖర్చు పెడుతున్నది! ఈ ఖర్చు తగ్గితే అమెరికాలోపలే ఆర్థికాభివృద్ధికి కావలసినది పోగా విదేశ సహాయానికి ఎంతో మిగలవచ్చు. ఇది విదేశ సహాయం కావచ్చు. అంతేకాక, కొత్త ప్రభుత్వం రిపబ్లికన్ల చేతుల్లో ఉంటే కాంగ్రెసు (శాసనసభలు) డెమోక్రాట్ల అధికారం కింద ఉంటాయి. దీనిని సవినియోగం చేసుకునే ప్రయత్నాలు శ్రీమతి గాంధీ ప్రభుత్వం చేస్తుందా లేదా అని చూడాలి.

ఏమి అభిప్రాయం?

అధ్యక్షుడు జాన్సన్ విదేశ సహాయం తగ్గకుండా ఉండాలని ప్రయత్నం చేశారు. ఆయన ప్రయత్నాలు నెగ్గలేదు. అంటే భారతదేశాన్ని చూస్తే అమెరికన్ శాసన సభ్యులకి అంత సదభిప్రాయం లేదన్న మాట. వాషింగ్టన్‌లో విదేశ ప్రభుత్వాలు 'లాబీ' చెయ్యవచ్చు. ఈ విధంగా అమెరికా శాసన సభ్యులలో పలుకుబడికల వర్గాల వారిని మంచి చేసుకునే బాధ్యత భారతదేశానికి ఉంది.

ఈ సందర్భంలో ఒక ముఖ్యమయిన సంగతిని గమనించాలి. రిపబ్లికన్లు డెమోక్రాట్లు — రెండు పార్టీలవారూ ప్రయివేటు రంగాన్నే ఆమోదిస్తారు.

ఉదాహరణకి పాశ్చాత్య దేశాలలో మూనె (పెట్రోలు) కంపెనీలు కేవలం ఆ వ్యాపారం చేసే వారికి సంబంధించినవి మాత్రమే కావు. వాటితో వర్గాలవారు సంబంధాలు పెట్టుకుంటారు. వీరిలో ఆర్థిక సంస్థల వారు ప్రముఖులు. మూనె కంపెనీలవారికి పెద్ద లాబీలు ఉంటాయి.

సద్వినియోగం

నిక్సన్ నిర్మించే ప్రభుత్వం విదేశ సహాయాన్ని అతి జాగ్రత్తగా పంచుతుందని చెప్పవచ్చు. ఎవరు సహాయాన్ని అతిగా సద్వినియోగం చేసుకుంటారో వారికే ఎక్కువ సహాయం ఇస్తారేమో! ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రంగా ఉన్నప్పుడు అమెరికా కమ్యూనిజం భయంతో బాగా విదేశసహాయం చేసేది; నేడు పరిస్థితులు మారాయి. ఒక దేశం తనకి వచ్చే విదేశ సహాయాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నదో చూసి మరి సహాయం చెయ్యవచ్చు అమెరికన్లు. మూనె సంస్థల ప్రతినిధులు ఈ సందర్భంలో తమ పలుకుబడిని ఉపయోగించవచ్చు.

కాంబే ఖాతం కథ

కాంబే ఖాతంలో మూనె బాగా దొరుకుతుందని అందరూ అంగీకరిస్తున్నారు. అక్కడ గనుక సరయిన వినియోగంఉంటే భారతదేశానికి పాలినా కొన్నికోట్ల డాలర్లు మిగలవచ్చు. అంతేకాక, ముడిమూనె దిగుమతులే ఆగిపోవచ్చు.

కెన్నెకో అనే అమెరికన్ కంపెనీ చక్కటి ప్రతిపాదనలు చేసింది. రష్యా లాబీ ఈ ప్రతిపాదనలు ఫలించకుండా చూశారు. అయితే రష్యన్లకి సముద్రంలో మూనె తీసే సామర్థ్యం లేదని వారే చెప్పుకున్నారు.

శ్రీ ఫక్రుద్దీన్ విధానాలు

శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ పరిశ్రమాభివృద్ధి మంత్రి అయినప్పటి నుంచీ ప్రయివేటు రంగం పెరగకుండా చూస్తున్నారు. ఇందువల్ల దేశంయొక్క ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటున్నది.

మనదేశంలో కొందరు భారతదేశం క్రమంగా అమెరికా సామ్రాజ్యంలో ఒక భాగం అయిపోతున్నదనే ప్రచారం చెయ్యటంతో, మేధావులు కూడ ఇదేవరస పాడటంతో, అమెరికా శాసనసభలలో భారతదేశం పట్ల వ్యతిరేకత ఏర్పడింది. పాకిస్తాన్ ఈ పరిస్థితిని బాగా సద్వినియోగం చేసుకుంటున్నది.

ప్రధాన మంత్రి, ఉపప్రధాన మంత్రి జపాన్‌కి వెళ్ళపోతున్నారు. దీనికి నాందీగా ప్లానింగ్ కమిషన్‌వారు భారత — జపాన్ రవుండ్‌టేబిల్ సమావేశం ఏర్పరచి పెద్ద హడావుడి చేశారు. అసలు నిజం ఏమిటంటే జపాన్‌దేశపు పారిశ్రామికవేత్తలు మనదేశం ఆర్థిక పరిస్థితిపట్ల, విధానాల పట్ల అసంతృప్తి చూపుతున్నారు. రెండవ ప్రపంచయుద్ధంలో పూర్తిగా చితికిపోయిన జపాన్ నేటి ప్రపంచ పారిశ్రామిక దేశాలలో అగ్రస్థానం వహిస్తున్నదంటే దానికి కారణాలు ఓపిక, కృషి, సరయిన ఆర్థిక విధానాలు— ఇవే. జపాన్ వ్యాపారస్థులకి భారతదేశంలో ఉన్న, పెరుగుతున్న నిర్బంధాలు, ప్రభుత్వరంగం విస్తరణ మొదలయినవి నచ్చటం లేదు. భారతదేశంలో ప్రవేశపెడుతున్న పేటంటు బిల్లు కూడా జపాన్‌కి నచ్చటం లేదు.

రాబర్ట్ మెక్నమారా

శ్రీ రాబర్ట్ మెక్నమారా భారతదేశానికి అపరిచితులు కారు. జాన్సన్ ప్రభుత్వంలో ఆయనకి మంచి పదవి ఉండేది. ఆయన మన దేశం వచ్చినప్పుడు మనకి లభించే విదేశ సహాయం గురించి కొన్ని చర్చలు జరుగుతాయి. 'ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజన్సీ' వారు సాయం చెయ్యటం లేదని శ్రీ మొరార్జీదేశాయి విచారంగా చెప్పారు. అమెరికా బలపరచకపోతే, అంటే అమెరికన్ కాంగ్రెస్ సభలో బలపరచకపోతే ఇ. డి. ఏ. సహాయం రాదు.

మంత్రులయాత్రల ఫలితాలు

మన దేశానికి విదేశాలలో మంచిపేరు రావటానికి సరదా యాత్రలుచేసే మంత్రులు ఎంతదాకా తోడ్పడుతున్నారనే ప్రశ్న మనకి మనం వేసుకోవాలి. ఇదీ చాలా ముఖ్యం.

ప్రపంచ బాంకువారు వ్యవసాయం బాగా అభివృద్ధి చేసుకోనమని భారత దేశానికి చెప్తూనే ఉన్నారు–మూడు సంవత్సరాలుగా. ప్రస్తుతం దేశంలో ఉన్న, త్వరలో రాబోతున్న ప్రపంచబాంకు వ్యవసాయం నిపుణుల బృందాలు రెండు; వీటిలో ఒకటి మన వ్యవసాయాభివృద్ధికి అప్పు నిగురించి విచారణ లేక పరిశీలన జరుపుతుంది. రెండవది నీటిపారుదల అభివృద్ధికి కావలసిన పెట్టుబడిని పరిశీలిస్తుంది. శ్రీ మెక్నమారా స్వయంగా సిహారు వెడతారు.

ఈ నిపుణుల బృందాలుకాక బెవాన్‌నెడ్ అనే వ్యక్తి నాయకత్వం కింద భారతదేశానికీ, ప్రపంచ బాంకుకీ మధ్య జరిగిన ఏర్పాట్ల వివరాలని తున్నాంగా. పరిశీలించే బృందం ఒకటి మనదేశంలో ఉంది.

టెలి– కమ్యూనికేషన్లకి సంబంధించిన జట్టు ఒకటి భారతదేశానికి 5.5 కోట్ల డాలర్ల అప్పు ఇచ్చే ప్రతిపాదనని పరిశీలిస్తోంది.

టెండర్ల నిబంధన


ప్రపంచబాంకు నిబంధన ఒకటిఉంది; ఇతర దేశాలకి సహాయం చేసినప్పుడు సరఫరా అయ్యే వస్తువులకి ప్రపంచం మొత్తం మీద టెండర్లకోసం ప్రకటనలు చెయ్యాలని. సాయంపొందే దేశం కూడా టెండర్లు పాడితే తక్కువ టెండరుకన్నా ఆ దేశపు టెండరు 10 శాతం మించి ఉండరాదు. దీనిని 27 శాతం చెయ్యాలని భారతదేశం ప్రయత్నం. ఈ ప్రయత్నం ఎంతదాకా నెగ్గుతుందో చూడాలి.

ఎరువుల ఉత్పత్తి

ప్రభుత్వరంగంలో ఉండే రయిలు రవాణా, వార్తాప్రసారం, రేవుల అభివృద్ధి మొదలయిన వాటికి ప్రపంచబాంకు సాయం చేసింది. ఎరువుల ఉత్పత్తికికూడా ప్రభుత్వరంగం సహాయం బాంకు ఇస్తుందా? పోనీ ప్రభుత్వరంగంలో ఇక్కడ ఎరువు ఫాక్టరీలు పెడితే విదేశాలలో పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారా? మదరాసులో ఎరువుల ఫాక్టరీలో విదేశపు ప్రయివేటు పెట్టుబడిదారులకి వాటాలు ఇస్తున్నారు. త్వరలో ఎరువుల కర్మాగారాల మంచి చెడులని పరిశీలించే ప్రబిటిషు నిపుణుల బృందం ఒకటి రామన్నది. ఈబృందం ప్రయివేటు, ప్రభుత్వరంగాలు రెండిటినీ పరిశీలిస్తుంది.

పాత రుణాలు తీర్చడం, కొత్త రుణాల షరతులని సడలించటం — వీటన్నిటినీ చర్చించాలి ప్రపంచబాంకు అధికారులతో. మూడవ పంచవర్ష ప్రణాళికకి కావలసిన పెట్టుబడి చాలా అమెరికా ప్రోద్బలంతో ప్రపంచ బాంకువారే ఇచ్చారు. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి మరణించిన తర్వాత అమెరికా సహాయం అంత ప్రోత్సాహకరంగా లేదు. దీనికి కారణం ఏమిటి? భారత దేశం సమస్యలన్నీ ప్రపంచ బాంకువారికి తెలుసు. మనపట్ల వారు ఎంతో శ్రద్ధాసక్తులు చూపుతున్నారు. వీటిని మనం వినియోగించుకోలేక పోతున్నామంటే అర్థం ఏమిటి?





మొన్నటి మూర్ఖులా మామూలుగా సమావేశం జర్గేసరికి అక్కడకు సింహాచలం వచ్చాడు.

'ఏమిటి సింహాచలం! ఈమధ్యను నువ్వెక్కడా కన్పించలేదు' అంటూ చంద్రరావు అతన్ని పలకరించాడు.

'కాశీయాత్రకు వెళ్లి నిన్ననే వచ్చానండి' అంటూ సింహాచలం సమాధానం యిచ్చాడు.

'నీకు హిందీ రాదుకదా! అందువేత నీకు అక్కడ యిబ్బంది యేమైనా కలిగిందా?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'నాకేం యిబ్బంది కలగలేదు కాని నా హిందీ వినడంవలన వాళ్లకే యిబ్బంది కలిగింది' అని, నవ్వుతూ సింహాచలం అక్కడనుంచి వెళ్లిపోయాడు.

'భాష అనేది చాలా సున్నితమైనది. అర్థం తెలియకుండా భాషను వాడితే అనర్థాలకు దారి తీస్తుంది' అన్నాడు చూడామణి.

'ఇప్పుడేం జరిగింది?' అని ప్రశ్నించాడు చిదంబరం.

'ఇప్పుడేం జరగలేదు కాని యిదివరకు జరిగిన సంఘటనలు జ్ఞాపకం వచ్చాయి'

'ఏమిటా సంఘటనలు' అని చంద్రరావు ప్రశ్నించగా చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఒకచోట పాండవోద్యోగ విజయాలు' నాటకం జరుగుతుంది. శ్రీ కృష్ణుడు పాండవుల రాయబారిగా ధృతరాష్ట్రుని సభకు వచ్చాడు. కృష్ణుడు సభలో పాడవలసిన పద్యాలు చాలా ఉన్నాయి వాటిని వరుసగా కృష్ణుడు పాడడం ప్రారంభించి 'జెండాపై కపిరాజు' అనే పద్యంవద్దకు వచ్చాడు.

'జెండాపై కపిరాజు ముందు సితవాజి శ్రేణియుం గూర్చి నే దండంబుంగొని తోలుస్యందనము మీదన్'

అంటూ పదరు పద్యాన్ని కృష్ణవేషధారి పాడాడు. ముందువరసనుంచి ఒకప్రేక్షకుడు 'ఒన్సుమోర్' అని కేకవేశాడు.

'కృష్ణవేషధారి మళ్లీ మామూలుగా పద్యాన్ని పాడాడు. అప్పుడు ఆ ప్రేక్షకుడు కోపం పట్టలేక స్టేజిమీదకు ఆకస్మికంగా వచ్చి కృష్ణవేషధారిని యిలాగ చివాట్లు పెట్టాడు'

'నే, దండంబుంగొని తోలు స్యందనము మీదన్' అంటే నేను కొరడా పుచ్చుకొని తోలేటటువంటి రథంమీద అని అర్థం ఉంది. కాని తోలుస్యందనం అని నువ్వు రెండు పదాలు కలిపి 'తోలుతో చేయబడిన రథం' అనే అర్థం వచ్చే లాగున చదువుతున్నావు,' అసలు పద విభాగమే తెలియనివాడివి పరమాత్మ వేషం వెయ్యడమా?'

'అప్పటికిగాని కృష్ణవేషధారికి తాను చేసిన తప్పు తెలియలేదు.'

'ఇంకొక సంఘటన యేమిటంటే' అంటూ చూడామణి మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

'ఒక విష్ణ్వాలయంలో ఒక అర్చకుడు ఉండేవాడు. అతడు ప్రతి శనివారం సహస్రనామాలతో విష్ణుమూర్తిని పూజచేసేవాడు. సహస్రనామాల్లో 'దైత్యేంద్ర వినాశనాయనమః' అనే నామం ఉంది. రాక్షసరాజును చంపినవాని కొరకు నమస్కారం అని దానియొక్క అర్థం.

'ఆ నామం పెద్దది కావడంవలన సహస్ర

నామాల పుస్తకాల రెండు వరుసలల్లో అచ్చు వేయబడింది. మొదటి వరుసలో 'రాక్షసేంద్ర' ఉంది రెండవ వరుసలో 'వినాశనాయనమః' ఉంది. ఆ అర్చకుడు దాన్ని రెండు విడినామాలుగా భావించాడు, అందుచేత 'రాక్షసేంద్రాయనమః' 'వినాశనాయనమః' అని చదువుతుండేవాడు. అంటే 'రాక్షసరాజు కొరకు నమస్కారం' 'వినాశనము చేయువానికి నమస్కారం' అని అర్థం వస్తుంది.

'పదాలకు అర్థం తెలుస్తున్నవారెవరైనా ఈ నామావళిని వింటే యెంత బాధపడతారో, మనం ఊహించవచ్చును' అంటూ చూడామణి తన భావము వెల్లడించాడు.

'పదాలకు అర్థం తెలియకపోవడంవలన ఒక్కోసారి మంచికూడా జరుగుతుంది.' అన్నాడు చిదంబరం

'మంచి యెలాగ జరుగుతుంది?' అని చంద్రావు ప్రశ్నించగా చిదంబరం చెప్పడం ప్రారంభించాడు.

1962 వ సంవత్సరంలో చైనా మనదేశపు సరిహద్దుల్ని అతిక్రమించింది. చైనా సైన్యం ముందుకు వస్తోంది.

ఆ సమయంలో రష్యా ప్రధాని అయిన కృశ్చేవ్ మనదేశపు అధ్యక్షుడు అయిన డాక్టర్ రాధాకృష్ణన్‌కు ఫోనుచేసి యిలాగ అన్నాడు.

'రాధాకృష్ణన్‌గారూ! ఆయుధాల విషయంలో మీరు యేమీ బెంగపెట్టుకో నవసరంలేదు. మీకు ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు యేం కావాలన్నా చెప్పండి వెంటనే పంపిస్తాము.'

'మనం యెలాగా అమెరికానుంచి ఆయుధాలు తీసికొంటున్నాము. ఈ పరిస్థితిలో రష్యానుంచి కూడా ఆయుధాలను తీసికోవడం బాగా ఉండదు' అని అధ్యక్షుడు రాధాకృష్ణన్ తనలో అనుకొని కృశ్చేవ్‌తో యిలాగ అన్నాడు.

'మీరు ఆయుధాలు యిస్తామన్నందుకు మేము చాలా కృతజ్ఞులం మాకు ప్రస్తుతం యే ఆయుధాలూ అవసరంలేదు. మా చేతిలో 'ధర్మ' ఉంది. అది అన్నిటికంటే శక్తివంతమైన ఆయుధం దానితో మేము ప్రపంచాన్నే జయించగలం.'

ఈ మాటలను వినగానే కృశ్చేవ్‌కు భయం కలిగింది. ధర్మ అనేపేరు అతను యెప్పుడూ వినలేదు. అదీగాకుండా ఆటంబాంబులు హైడ్రోజను బాంబులకంటె 'ధర్మ' శక్తివంతమైనదని రాధాకృష్ణన్ చెబుతున్నారు. వెంటనే సైనికాధికారులను రప్పించి వారిని 'ధర్మ' అనే ఆయుధం గురించి అడిగాడు కృశ్చేవ్. తాము యెప్పుడూ ఆ పేరునే వినలేదని వాళ్లందరూ యేకగ్రీవంగా అన్నారు

కృశ్చేవ్ వెంటనే అమెరికా అధ్యక్షుడైన కెన్నెడీకి ఫోనుచేసి జరిగిన సంగతినంతా చెప్పాడు. తరువాత ధర్మ'గురించి మీకేమైనా తెలుసా ?' అని ప్రశ్నించాడు.

'ధర్మ' గురించి ప్రస్తుతం నాకు యేమీ తెలియదు. దానితో ప్రపంచాన్నే జయించవచ్చునని అధ్యక్షులు రాధాకృష్ణన్ చెబుతున్నారు. కాబట్టి ఆ విషయం మా సైనికాధికారులతో చర్చిస్తాను' అని కెన్నెడీ సమాధానం యిచ్చాడు.

వెంటనే సైనికాధికారులను సమావేశపరచి జరిగిన సంభాషణనంతా వారికి వివరించాడు అధ్యక్షుడు కెన్నెడీ.

'ధర్మో మాక్సియస్' గురించి మాకు తెలుసును గాని 'ధర్మ' గురించి మాకు యేమీ తెలియదు

(64 వ పేజీ చూడండి)

భర్తంటే



కె. రామలక్ష్మి

నేరక పోయి బస్సులో మహాబలిపురం బయలుదేరాము. సెలవురోజు కావడంతో బస్సంతా కాలేజీ అమ్మాయిలతో నిండి ఉంది. ఏ ఒకటో అరకో తప్పించి ఏదే ఉద్దేశ్యం కూడా లేనట్టుంది — కబుర్లు చెప్పుకుందుకే బయలుదేరినట్టుంది. దారి పొడుగునా వసపోసిన పిట్టల్లాగా మాట్లాడు తూనే ఉన్నారు. భర్తలంటే ఏమిటి ? అంటూ చాలా తీవ్రంగా చర్చిస్తున్న ఆ కన్నెపిల్లల ఊహలు చాలా గమ్మత్తుగా ఉండి వాళ్ళ కళ్ళపడకుండా నా స్వంత షార్టుహాండులో రాసాను చదివి చూడండి.

'అది కాదే భర్తెందుకు? అన్నం బట్ట యిచ్చి పోషించితే చాలని నేననుకోను' అందొకమ్మాయి తీవ్రంగా. 'మరెందు కేమిటి?' అందొక చూకీదార్!

'బాధగా ఉన్నప్పుడు వడి ఏడ్వడానికో భుజం' అంది బాపు వేయించిన ఓ తల కాయి...చాలా ఉత్సాహంగా బంతి ఆటలో బంతిలాగా ఈ 'భర్త ఎందుకు?' చేతులు మారుతూ చెకచెక గోల్ కొట్టడం... బాగుంది.

'భర్తంటే నాపాలిటి ఆకలియాత్ర...' అంది.

'భర్తంటే నా హృదయపుటానందం విషాదం కూడా' అందొకమ్మాయి.

అదెలా; అంది ఓ కన్నెపిల్ల.

'తీపీ చేదూ కల్పి తిన్నట్టే—'

వారి నిర్వచనాలు యువతరపు టూహలకి ఓ రూపాన్నిస్తున్నాయా అనిపించింది...

శ్రద్ధ కనపరచాలి ... 'అంటే వర్షం వచ్చేలా ఉంది గొడుగుపట్టుకెళ్ళు' అనాలి.

తమ జాతివాళ్ళతో ఎంతో హాయిగా ఊరెగిరేలా నవ్వే వ్యక్తి నా దగ్గిర మూగ పోకూడదు...

కొత్తచీర కట్టే చూడాలి బాగుం దనాలి. అందంగా ఉన్నావనాలి— అంతేకాని 'ఖరీదెంతేమిటి? నా ముఖం.'

క్షమార్పణలు చెప్పుకుందుకు ఎన్నినా వంకలు సృష్టించినా — నా మనస్సు నొప్పించకూడదు.

పొగడ్తను మించిన ఆయుధం మరి లేదని గ్రహించాలి.

పనిపాటల్లో సహాయం చేయాలి. పుస్త కాలు చదువుతానంటూ పేపర్లు దొంతర పెట్టి మధ్యాహ్నం అంతా రెస్టుకి పోవడడం నేను సహించను.

చిన్న చిన్న రిపేర్లు చేసిపెట్టాలి. నాకెంతో గర్వకారణం అది. మావారే రేడియో రిపేరు చేశారు అంటాను...

పనికి లేటూ భోజనానికి తొందరా ? రామ! రామ!

నే జోకు వేస్తే ముఖంమాడ్చుకుని అవే తాను చెప్తూ పగలబడి నవ్వేయడం నే సహించను అక్కడికి నా జోకు తన స్వంతం అయినట్టు...

ఎదురుమాడనప్పుడు దయమాపడం ! హాయి !

నే మాట్లాడినప్పుడు నానోరు నొక్కించి అది తన లాజిక్కు గొప్పతనం అంటే భరించను.

సాధించరు — కాని తప్పులెన్ని కుప్పలు పెడతారు.

'అన్ని తనే చేసానంటారు — శ్రమ మటుకు నీది! బాధ కదూ ?

ఓర్పు నీవు ప్రదర్శించాలి. అక్కడికి ఆడదానిలోనే అది ఉండాలన్నట్టు. మగ వాడికి ఓర్పేమిటి నా ముఖం ? ఓర్పు గురించి మాట్లాడను?

మహాత్యాగి! కావలిస్తే షర్టు బొత్తాలు కుట్టమనకుండా గుండుసూది పెట్టుకుని కాలక్షేపం చేస్తారు! ఎంత గొప్పగా చెప్పు కుంటారో ఆ సంగతి?

విశ్రాంతి కావాలంటారు? ఎప్పుడు? క్రికెట్ కమెంటరీ వినడానికి, రాత్రిపూట పాప ఏడ్చినప్పుడూ! ఇంకా పోతే ఏ హైదాబాదో బెంగుళూరో అయితే రాత్రి పాపానికి పగటి ప్రాయశ్చితం (హాంగోవర్?) అనుభవిస్తున్నప్పుడో విశ్రాంతోయ్! శాంతోయ్ అంటారు...

పుట్టిన రోజు వెళ్ళాక కొత్త చీర కొనే రకాలు.

ఓదార్పా! అయ్యోరామ—వన్ వే ట్రాఫిక్. నీనుంచి ఆయనగారికే కాని అటు నుంచి యిటు రాదు—తెలుసుకో.

నేర్పా? అదే ఉంటే కోటికో దేవ తనుకో. పూజించొచ్చు.

సరైన సమయంలో చెప్తే అర్థం చేసుకోవచ్చు మన్ని. అవి చాలా అరుదులే...

అలసినప్పుడు నవ్వించి, బాధగా చిందర వందరగా ఉన్నప్పుడు ఎంత బాగున్నా వోయ్ అనీ వంట బాగులేనప్పుడు అమోఘం అనీ... ఇవే వారి సుగుణాలు. బాబోయ్.

నిత్యనూతనులు వాళ్ళు. పిల్లాడికి రైలు కొని గంటలతరబడి తామే ఆడుకుంటారు! మైగాడ్.

ఉత్సాహం ఉంటుందనుకో. అది లేకుంటే కషాయంగా ఉంటుంది జీవితం. ముఖ్యంగా అందుకే మగాడికి ఉత్సాహం ఉండాలోయ్...

'ఇన్ని సంగతులెలా తెలిసాయి మీకు?' అన్నాను వెనక సీటులోంచి.

సిగ్గుతో ముఖాలు ఎర్రబడ్డా గొల్లున నవ్వేశారు అంతా కలిసి.

'చూస్తాం కదూ చుట్టూ మనుషు లని;' అంది ధైర్యం చేసి ఓ అమ్మాయి.

'అయితే ఇటువంటి భర్త లెక్కడైనా దొరుకుతారా? దొరికినా పెళ్ళి వాళ్ళని మార్చదా?' అడిగాను.

పెళ్ళి చేసుకున్నాక సంగతి అప్పుడు.

కాని భర్త అంటే ఇదేం వరద ఓ బాబు.

'మీ హోము పైన్నుంచో పిల్లల పెంప కమే గాని ఈ భర్తల గుణ నిర్వచనాలు చెప్తారని తెలియదే నాకు!' అన్నాను నవ్వుతూ...

'ఎలా తెలిసింది మీకు?'

'ఆ అమ్మాయి కష్టపడి చదువు తోందిగా' అన్నాను ఓ వార సీటులో పుస్తకం పెట్టుకుని కూర్చున్న ఓ విద్యార్థినివి చూపి...

'ఆ పిల్లా. పాపంతి. వంట వచ్చిన మగ వాణ్ణి పెళ్ళాడాలని కోర్కె.' అంది మాకీ

దారో ... ... మాట్లాడతేం. అవి ఊరుకున్నాయో ... మహాబలిపురంలో ఆగింది. ... అంతా దిగారు. పుస్తకం అమ్మాయి పుస్తకం చేతో పట్టుకునే దిగింది— పాపం చదువుల సరస్వతి. ●

శ్రీ వాణీ సాహిత్య క్రాస్‌వర్డ్ పజిల్ నెం. 17

Licensed by the District Collector Warangal. L. No.1 Dt. 8—10—67


(ఈ పజిల్ తాలూకు కీ సొల్యూషన్ జిల్లా కలెక్టర్‌గారి కార్యాలయములో సీలు చేయబడినది)

రూ. 800 లు

పోటీచేసి గెలుపొందండి!

మొదటి బహుమతి రు. **400** రైట్ ఆన్సర్
రెండవ బహుమతి రు. **250** ఒక తప్పు ఆన్సర్
3వ బహుమతి రు. **150** రెండు తప్పుల ఆన్సర్

నిఘంటువు: శబ్దార్థ చంద్రిక



ముగింపు తేదీ: **17—12—1968**

నెం. 17 ఆధారములు

అడ్డము:– 1. భారతదేశ స్వాతంత్ర్య సమరానికై ఆజాద్‌హింద్ ఫౌజును నెలకొల్పి తాత్కాలిక ప్రభుత్వాన్ని తొలుదొల్త ప్రకటించిన అమరవీరుడు. 5. ప్రభుత్వానికి కొందరు చెల్లించే పన్ను. 6. తమ తమ కర్మల ననుసరించి యిది నడుస్తూ వుంటుందట. 8. ఇదిచేసి జీవించేవారిని దుర్మార్గు లనవచ్చును. 10. త్రిమూర్తులలో లయకారకుడు. 11. పూజా సమయమందు దేవునికి దీన్ని సమర్పించు మందుట పరిపాటి. 14. వ్యాయామము. 15. బంగారముతో చేయబడిన యీ మొలత్రాడు పూర్వము ధరించెడివారు. 16. తిథులలో నొకటి. 19. మంచి వాగ్ధాటి కలవాడు. 20. వన్య మృగములు సంచరించు ప్రదేశము. 22 ముఖార వింద మున కిది పురికొంత యందము నిచ్చును.

నిలువు – 2. ప్రాణాయామము చేయు నపుడు పూరించిన వాయువును ఈ నాడియందు కుంభకము చేయుదురు. 2. అర్జునుని భార్య. 3. సజ్జనుడు నిత్యమూ ఇంతో అంతో దీని సముపార్జనకై పాటు పడుతూ వుంటాడు. 4. విజను దేవుడెరుగు నీరు త్రినినెరుగు నంటారు. 6. మధ్యతరగతి కుటుంబీకుల ఆదాయంలో నేడు ఖర్చుపోగా యిది సున్నా అవుతున్నదంటే ఆశ్చర్యంలేదు. 7. నిండు జవ్వనుల యొయ్యారంపు గమనాన్ని దీని నడకతో పోలుస్తూ వుంటారు కవులు. 9. హృదయము. 12. త్రిమూర్తులలో సృష్టి కారకుడు. 13. స్వప్నంలో చేసే సంభాషణము యిలా అంటాము. 17. ఆధ్యాత్మిక దృష్టి గలవారు యీ జగత్తు నంతటినీ యిలా భావిస్తారు 18. కదలీ వృక్షము. 20. భారతదేశమందలి పుణ్యక్షేత్రములలో నొకటి. 21. దీనిలో పడినవాడు లేచుట కష్టము.

కూపను ఒక్కంటికి ఒక్క రూపాయి మాత్రమే

నిబంధనలు:– 1. కూపనులు తుడుపులు, కొట్టివేతలులేకుండా తెల్లకాగితముపై చదరము గళ్ళరూపములో గీసి చక్కగా సిరాతో వ్రాసి పంప వచ్చును. లేదా 30 పైసల పోస్టేజి పంపినచో అచ్చు కూపనులు పంపుదుము. కాని లిస్టురూపములో వ్రాయబడిన కూపనులు చెల్లనేరవు. 2. ప్రవేశ రుసుము ప్రతికూపనుకు ఒక్కరూపాయి చొప్పున నగదురూపమునగాని, మనియార్డర్ లేక క్రాస్‌చేయని పోస్టల్ ఆర్డర్ ద్వారాగాని పంపాలి. మనియార్డరైనచో M. O. రసీదు కూపనుతో తప్పక జతచేసిపంపవలెను. లేనిచో కూపనులు పోటీలో నుంచబడవు. 3. ఒకపేరుతో రెండు కూపనులకంటే యెక్కువ పంపరాదు. ప్రతి కూపనుపైన మరియు పోస్టల్ ఆర్డరు, మనియార్డర్ ఫారములవెనుక భాగమున తప్పక పోటీదారుని పూర్తిపేరు, అడ్రసు వగైరా విశదముగా వ్రాయవలెను. 4. కూపనులు ముగింపుతేది సాయంత్రం 8 గంటలలోపుగా మాకు చేరునట్లు పంపాలి నియమిత సమయం దాటిన తరువాతవచ్చిన కూపనులు పోటీలో చేర్చబడవు. 5. ఈ పజిల్సులో ప్రతిపోటీదారు తానుపంపే రైటు మొదలు రెండు తప్పులవరకుగల ప్రతి కూపనుకు బహుమతి పొందవచ్చును. 6. A. కీ సొల్యూషను మాత్రం 'ఆంధ్ర పత్రిక' తెలుగు దినపత్రికలో ముగింపు తేది తరువాత పదిరోజులలో ప్రకటించ బడును. విజేతల లిస్టు, కొత్త పజిల్ కూపనులు వగైరా కావలసినవారు 30 పైసల పోస్టేజి పంపి తెప్పించుకొనవలెను. 6.B. తమ కూపనుల పునః పరిశీలనకోరే పోటీదారులు విజేతల లిస్టు ప్రకటించబడిన తేదీలగాయతు 30 దినములలోపుగా రూ. 5లు ప్రాస్పెక్టివ్ ఫీజు క్రింద మనియార్డరుద్వారా పంపుతూ ఒకదరఖాస్తు ప్రాస్పెక్టివ్ కమిటీ చైర్మన్‌గారిపేర వ్రాసి M. O. రశీదు దానితో తప్పక జతపరచి మేనేజర్ అడ్రసుకు పంపవలెను. అప్పుడు వీలైనంత త్వరలో కమిటీ నిర్ణయాన్ని పోటీదారులకు తెలుపుదుము అట్టిపోటీదారులు విజేతలైనచో రావలసినబహుమతి మొత్తముతోపాటు ప్రాస్పెక్టివ్ ఫీజుకూడ తిరిగి పంపించబడును. కానిచో ప్రాస్పెక్టివ్ ఫీజు వాపసుచేయబడదు. నిర్ణీత గడువు దాటినతరువాత ఎట్టి ఆక్షేపణలు అంగీకరింప బడవు. 7. కీ సొల్యూషన్‌లోని మాటకు సరిపోని ప్రతిమాట ఒక తప్పుగా నెంచబడును. 8. ఈ పజిలు తాలూకు అన్ని విషయములలో మేనేజరుదే తుదినిర్ణయము. 9. ఇండియాలో తప్పయితర దేశములలో నివసించువారు ఈ పోటీలో పాల్గొనుట నిషేధింపబడినది. 10. పై నిబంధనలు ప్రభుత్వ రూల్సు ననుసరించి రూపొందించ బడినవి. కావున పోటీదారులెల్లరు పాటించి సహకరింప గోరుచున్నాము. 11. కూపనులు మనియార్డర్లు వగైరా ఈ దిగువ అడ్రసుకు మాత్రమే పంపాలి.

The Manager, Sri Vani Sahitya Puzzles, Warangal-2. (A.P.)


శ్రీ వాణీ సాహిత్య క్రాస్‌వర్డ్ పజిల్ నెం. 15 కీ సొల్యూషన్

అడ్డము:— 1) అజంతా, 3) ఔషధము, 6) పినంచి, 7) మహాపాత్రము, 9) ఇభ్యుడు, 12) రెమ్మలు, 14) నిర్ణయము, 16) పార్వతి, 17) భాగీరథి, 19) పటిమ, 20) రాతి, 21) కలము, 22) కిక, 23) కంచము.

నిలువు:— 1) అజ్ఞులు, 2) తాని, 3) ఔచితి, 4) ధన్యము, 5) లోభము, 8) పాకాతి, 10) బొమ్మ, 11) అవి, 13) ఫణి, 15) యువతి, 16) పక్షి, 18) గీర్వాణము, 19) పత్రిక, 20) రాయుంచు.

క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు

అనువాదం: తిరుమల రామచంద్ర



కళింగసేన కథ

సోమప్రభ గగన మార్గంలో వెళ్లగానే కళింగసేన చిన్నబోయి ఆలోచిస్తూ కూర్చుంది: "నా నెచ్చెలి ఎవతో! విద్యాధర జాతిదో! దేవతో! నాగ కన్యకో! ఎవరో! దేవతలు కూడా మానవకన్యలతో చెలిమి చేస్తారట. పూర్వం పృథుచక్రవర్తి కుమార్తెతో అరుంధతీదేవి స్నేహం చేసిందట. కొందరి స్నేహం పూర్వుల నుండా ఎదుటివారిలో ప్రవేశిస్తుంది. అరుంధతి ప్రీతితో వశిష్ఠ ధేనువును భూలోకానికి తీసుకొని వచ్చింది. అమృతం వంటి దుగ్ధమయమైన ఆ ధేనువు పాలు పృథుమహారాజుకు ఇచ్చింది. అప్పటి నుంచే పవిత్రమైన ధేనువులు భూలోకానికి వచ్చాయంటారు. అలాగే ఈమె ఎవరో దేవత, నా పుణ్య వశాన నాకు లభించింది." కళింగసేన ఇలా ఆలోచించి ఆ రాత్రి గడిపింది.

మరునటి ఉదయం మయపుత్రిక కొన్ని యంత్రపు కర్ర బొమ్మలున్న బరిణెను తీసుకొని కళింగసేన వద్దకు వచ్చింది. ఆ కర్రబొమ్మలు విచిత్రంగా ఉన్నాయి. కళింగసేన అడిగింది "నెచ్చెలీ, నీవు ఎవరు?" అని. సోమప్రభ ఇట్లా చెప్పింది:—

"నేను అసురరాజయిన మయుని కుమార్తెను. నా పేరు సోమప్రభ. మా తండ్రి మాయావైచిత్రి పుట్టినిల్లు. నాకొక సోదరి వుంది. దాని పేరు స్వయంప్రభ. అది పాతాళలోకంలో వుంటుంది. ఆమెను పూర్వం పితమ్మను వెదకడానికి వెళ్లిన [illegible] భర్త కుబేర పుత్రుడు అయిన నలకూబరుడు. అతడు దశకంఠుడైన రావణునికి శాపమిచ్చాడు. అందువల్లనే అతడు పరవధువును తాకలేకపోయాడు."

సోమప్రభ ఇట్లా చెప్పి తన వద్దవున్న బరిణను తెరచి, ఆమెకు విచిత్రమైన యంత్రపు బొమ్మలొక్కొక దానిని బహూకరించింది. ఆ బొమ్మ ప్రాణంతో వున్నదా అన్నట్లు వుంది.

కళింగసేన ఈ రహస్య స్నేహం సంబరంతో తండ్రితల్లులు దాచివేసింది. నానాటికీ చిక్కిపోసాగింది. కళింగదత్తుడు తన కుమార్తె ఏదో చింతతో బాధపడుతున్నదని భావించి విచారపడ్డాడు. ఆస్థాన వైద్యుణ్ణి పిలిపించి వివరం అడిగాడు.

"మహారాజా! రాజకుమారికి ఏ వ్యాధిలేదు. మితిమీరిన సంతోషం వలన్న నిండిపోయి భోజనం ఇష్టపడడంలేదు" అని వైద్యుడు ఆమెను పరీక్షించి చెప్పాడు.

కళింగదత్తుడు, అతనిరాణి—కుమార్తెను అడిగారు, "అమ్మా, నీసంతోషానికి కారణం చెప్పమ్మా!" అని, కళింగసేన తన స్నేహితురాలి సంగతి ఆమె బహూకరించిన యంత్రపు బొమ్మల సంగతి తలిదండ్రులకు తెలిపింది. వారిద్దరూ ఆ వృత్తాంతం విని చాల ఆనందించారు.

సోమప్రభ సంగతి అందరికీ బాగా తెలిసిన తర్వాత, కళింగసేన, ఆమెతోపాటు విహరించడానికి, ఆమెవెంట ఇతర లోకాలకు వెళ్లడానికి తలిదండ్రులతో అనుమతి తీసుకుంది. సోమప్రభ బహిరంగంగానే రాజనగరుకు వచ్చేది. రాజు ఆమెను ఎంతో ప్రేమతో సత్కరించేవాడు. ఆమె తన నెచ్చెలి అయిన రాజకుమార్తెతో విహరించేది.

ఒకసారి సోమప్రభ యంత్రపు బొమ్మలచేత దివ్యమైన బంగారు తామరలతో విహార పూజ చేసింది. అది చూచి రాజు ఆశ్చర్యపడ్డాడు.

మరొకసారి సోమప్రభ కళింగదత్తుని అనుమతితో కళింగసేనను మాయాయంత్ర విమానంలో స్వయంప్రభను చూడడం కోసం పాతాళలోకానికి పిలుచుకొని వెళ్లింది. కళింగసేనకి పాతాళనగరం చూచి ఆశ్చర్యమయింది. అది చిత్రవిచిత్రమైన విధాత చిత్రరచన వలె వుంది.

అక్కడ కళింగసేన ఒక తపస్వినిని దర్శించింది. పొడుగాటి జటా జూటం, ఆమె ముఖానికి నామతీగలు చుట్టుముట్టిన కమలం శోభను కలిగిస్తున్నాయి. ఆమె కమలపు తీగలాగ వుంది. స్ఫటికాక్షమాల ఆమె పాలిండ్లపై తెల్లని వస్త్రాలు కప్పుకుంది. దానిని చూడగా మరుగు తెరమాటున వున్న చక్రవాకాలున్న నదిలాగా వుంది ఆమె. ఆమే స్వయంప్రభదేవి. ఆమెను చూచి రాజపుత్రి ముఖం వంచి నమస్కరించింది.

స్వయంప్రభాదేవి ఆమెను చూచింది. నమస్కరిస్తున్నప్పుడు కిందికి జారిపోతున్న కర్ణావతంసమయిన కలువల పుప్పొడి ఆమె నుదుటిపై పడి ఆ ప్రాంతమంతా సువాసనలు క్రమ్మాయి. రాజపుత్రిపేరు, వంశం విని, స్వయంప్రభాదేవి ఆమెకు ఫలపుష్పాలతో సత్కరించింది.

ఆ పండ్లు ముదిమిని పోగొట్టేవి. సోమప్రభ

కలువగా రాజకుమారి ఆ పదార్థాలు ఆరగించింది. వాటిని ఆరగించగానే రాజకుమారికి అద్భుతంతో కడిగినట్టు దేహం అపూర్వ కాంతితో మిలమిలలాడింది.

రాజకుమారి తర్వాత చెలితోపాటు దివ్యభావనతో నిర్మించిన విచిత్రమైన ఉద్యానాన్ని, బంగారుతామర లున్న దిగుడు బావిని, చూచింది. ఆమె మనస్సు ప్రీతితో నిండిపోయింది. తర్వాత ఆమె స్వయంప్రభ నుంచి సెలవు పుచ్చుకొని యంత్రవిమానంలో సోమప్రభతోపాటు తక్షశిలానగరానికి తిరిగి వెళ్ళింది.

వారి మైత్రి ఈ విధంగా పెరిగి పోతూనే వుంది. ఒకమారు ఇద్దరూ ఏవో కథలు ముచ్చట్లు చెప్పుకుం టున్నారు. సోమప్రభ అన్నది— సఖి, మన సహవాస మంతా, నీకు వివాహమయ్యేవరకే. నిన్ను ఎవరో వరుడు పెళ్ళాడతాడు. అప్పుడు మన సహవాసం దూరమయి పోతుంది. తప్పదు. దాయాదులు, అత్త మామలతో భీకరంగా ఉండే భర్త యింటిలోఇప్పటి లాగా స్వేచ్ఛగా ప్రవేశించడం సాధ్యమా?" అత్త మామలు ఎంతో హింస పెడుతారు. అలాటి హింసలు పడ్డ కీర్తిసేన కథ చెబుతాను విను.

'కీర్తిసేనను అత్తమామలు చాల బాధలు పెట్టారు. ఆమె తనబుద్ధిబలంతో విపత్సముద్రాన్ని దాటగలిగింది.'

"పాటలీపుత్రంలో ధనపాలితుడనే వ్యాపారి వుండేవాడు. అతనికి కీర్తిసేన అనే కుమార్తె వుండేది. ఆమె లావణ్యనదిలాగ వుండేది. ఆ లేడికన్నుల దానికి యౌవనం వచ్చింది. ఆమెను కండ్రి మగధవాసి అయిన దేవసేనుడనే వైశ్యుని కిచ్చి వివాహం చేశాడు.

కీర్తిసేనను భర్త ఎంతగానో ప్రేమించే వాడు. అత్తగారుమాత్రం పోట్లాటతో ఎప్పుడూ పేచీ పెట్టేది. పాములున్న చందన వనంలో వున్నట్టుగా ఆమె ఆ యింట్లో కాలం గడిపేసి.

దేవసేనుడు ధన సంపాదన నిమిత్తం వలభీ పట్నానికి వెళ్ళదలచాడు. తన భార్యకు చెప్పి పోదామని ఆమె నివాసానికి వెళ్ళాడు. "నాథా, నీవు వెళ్ళిన తర్వాత అత్తగారు నాతో నిరంతరం పోట్లాడుతూ తిడుతూ వుంటుంది" అని కీర్తిసేన భర్తతో విన్నవించింది.

దేవసేనుడు ప్రియురాలి మాటలు విన్నాడు. తల్లి వద్దకు వెళ్ళాడు. "అమ్మా కోడలిని సరిగా చూచుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు.

కొడుకు వెళ్ళిపోగానే, ఎప్పుడూ కోపంతో వెర్రెత్తి పోతున్న అత్తగారు భర్తవియోగంతో దుఃఖపడుతూ, తలవంచుకుని కూర్చున్న కోడలిని చూచి "ఏడుపు గొట్టుదానా, దుర్భాగ్యురాలా, నీ ఏడుపంతా నీ పుట్టింట్లో ఏడ్చుకో. నా కుమారుడు చిరకాలం వుండని" అని తిట్టి, ఆమె పరిజనాన్ని ఇంటి నుంచి వెళ్ళగొట్టింది.

మరుదినమూ అత్తగారు కోడలిని తూలనాడింది: "నీవు చాల గడుసుదానివి. నవ్వుతూనే అన్ని పనులూ చేస్తావు. భర్త నీకు భయపడే దేశాంతరంవెళ్ళాడు. మరి నీకు ఈ విచారమేమైనా వుందా? భర్తపై స్నేహం వుందా? వేశ్యలాగ వీధిలో వచ్చేపోయే జనాన్ని చూస్తున్నావు." అని నానా విధాలుగా, కోపం క్రోధం ఉద్రేకం ఆ వేగం పట్టలేక మాటల తూపులతో కోడలిని దినమూ పొడుస్తూనే వుండేది.

కోడలిని ఏలాగైనా వదిలించుకోవాలని దుష్టాలో చన దానికి కలిగింది. "దీనిని భర్త ధనమున్న నేల లోని చీకటికొట్టులో పడవేద్దాం" అనుకుని ఆ విధంగానే చేసింది. చీకటి కొట్టుకు వెలుపల పెద్దగడియ బిగించింది. దినమూ తినే ఆహారంలో నాలుగోవంతును విరిగిన మూకుడులో పెట్టి చీకటి కొట్టులోకి గవాక్షం నుంచి దింపేది.

కీర్తిసేన దుఃఖానికి పారమేలేదు. అయినా ధైర్యంతో ఆ చీకటికొట్టునుంచి తప్పించుకుని వెళ్ళడానికి ఆలోచన చేసింది. ఆ విరిగిన మూకుడు తోనే గోడ త్రవ్వసాగింది. అదృష్టవశాత్తు ఆమెకు పారవంటి దొకటి దొరికింది. దానితో గోడను త్రవ్వి దారిచేసుకొని, ఆ నేలమాళిగలోవున్న ధనంలో తనకు కావలసినంత మట్టుకు తీసుకుంది. విలువగల వస్త్రాలు తీసుకుంది. రాజపుత్రుని వేషం ధరించి వలభీ నగరం వైపు బయలు దేరింది.

దారిలో ఒక పెద్ద బిడారు కనిపించింది. కీర్తిసేన ఆ బిడారం యజమానితో పరిచయం చేసుకొని, తనను పురుషు లెవరూ తాకకుండా జాగ్రత్తపడుతూ పయనించింది.

చీకటి పడింది. పిడుగు పడ్డట్టుగా, ఆ బిడారుపై పెద్ద దొంగలదండు పడింది. దైవం ప్రతికూలంగా వున్నప్పుడు ఉన్న ఆధారాలు కూడా పూడి పోతాయి. దొంగలసేన బిడారును పూర్తిగా ధ్వంసం చేసింది. కీర్తిసేన రాత్రంతా ఒక గుంటలో, గడ్డి గాదం కప్పుకొని తలదాచుకుంది.

ఉదయం కాగానే, అడవిదారిపట్టి బయలుదేరింది. అడవిలోని సింహ శార్దూలాలు, ఒగరాలు ఆమెను చంపలేదు. ఆమెను చూచి తప్పుకుని పోయాయి. సతి తేజస్సు దుస్సహం కదా! ఆమె ప్రయాణపు బడలికతో మనస్తాపంతో వాడివడలిపోయింది. అప్పుడు అరణ్యంలో తపస్సు చేసుకునే ఒక మునికుమారుడు చల్లని నీరు ఆమెకు ఎవరో రాజపుత్రుడు అలసిపోయాడు అనుకొని, కనికరంతో ఇచ్చి దప్పి, తాపం పోగొట్టాడు.

ముని వెళ్ళిపోయాడు. చీకటి పడింది. ఆమె దొంగల భయంతో ఒక చెట్టుతొర్రలో దూరి తల దాచుకుంది. అర్ధరాత్రి అయింది. ఆచెట్టు వద్దకు ఒక రాక్షసి తన పిల్లలతోపాటు వచ్చింది. ఆ రాక్షసి యముని నీడలాగ వుంది.

రాక్షసి పిల్లలు ఆకలితో వున్నారేమో, "అమ్మా తినడానికి ఏమైనా పెట్టమ్మా?" అని అడిగారు. ఆ రాక్షసి పిల్లలతో ఇట్లన్నది: "నాయనలారా, కొంచెం ఓపిక పట్టండి. మహా కాలుడు మనకు భోజనం ఏర్పాటు చేశాడు. ఇక్కడికి సమీపంలో వసుదత్త మనే పట్టణం వుంది. దానికి రాజు వసుదత్తుడు. అతనిచెవిలో జెర్రిదూరి తలలో ప్రవేశించింది. అక్కడ అది వందలకొలది పిల్లలు పెట్టింది. అతడు తలపోటుతో విపరీతంగా బాధపడుతున్నాడు. వైద్యులకు అతని వ్యాధి ఏమిటో అంతుపట్టలేదు. అతడు త్వరలో మరణిస్తాడు. అప్పుడు మనకు సంపూర్ణ భోజనం లభిస్తుంది."

ఆ మాట విని రాక్షసి పిల్లలు కుతూహలంకొద్దీ అడిగారు: "అమ్మా, రాజు బ్రతికే ఉపాయంలేదా?" అని.

రాక్షసి అతడు తమ ఆహారమనే సంకోచం ఏమీ లేకుండా అతడు జీవించే ఉపాయం ఇలా చెప్పింది: "రాజుకు నేతితో తల అంటాలి. వేడివేడి పెయసాన్ని తలకు పూసి ఎండలో కూర్చోబెట్టాలి. చెవి దగ్గర ఒక వెదురు గొట్టం పెట్టి, గొట్టం మరొక కొనను, చల్లని నీళ్ళున్న ఒక కుండలోపలికి దింపాలి. జెర్రులు ఆ తాపం భరించలేక గొట్టం గుండా కుండలోకి వచ్చి పడుతాయి. సందేహం లేదు. అయినా, ఈ సంగతి మనకెందుకు? రాజు త్వరగా చావనీ. మనకు అప్పుడే సంతృప్తి."

రాక్షసి తనపుత్రులతో ఇలా కొంత సేపుమాట్లాడి నది. మరికొంతసేపటికి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

కీర్తిసేన రాక్షసి మాటలు విన్నది. రాజు దగ్గరే వున్నాడు. తెల్లవారగానే వైద్యుని వేషం వేసుకొంది. వసుదత్తపురం చేరింది. రాచనగరుకు వెళ్ళింది. తను వైద్యుడినని, రాజుకు చికిత్సచేసి గుణం చేయడానికి వచ్చానని పరిచారకులతో చెప్పింది.

ప్రతీహారుడు లోపలికి వెళ్ళాడు, ఇలా విన్నవించాడు "దేవా దేశాంతరం నుంచి ఎవరో వైద్యుడు వచ్చాడు. అతని ముఖం పూర్ణచంద్రబింబం. అశ్వినీ దేవతలలో ఒకడు దిగివచ్చాడా, అని అనిపించేట్టున్నాడు. కళ్ళు మిలమిలలాడుతూ, తామర రేకులలాగా వున్నాయి. రాజును ఆరోగ్యవంతుణ్ణి చేస్తాను అని ప్రతిజ్ఞచేస్తున్నాడు."

ఆ మాట వినగానే రాజు, రాణి "పిలు, పిలు త్వరగా పంపు" అని ప్రతీహారితో అన్నారు. ప్రతీహారి వైద్యుణ్ణి లోపలికి పంపాడు. రాజు, రాణి వైద్య వేషంలో వున్న ఆమెను చాల సత్కరించారు. కీర్తిసేన రాజుపై దృష్టి ప్రసరింపజేసింది.

రాజు క్షయరోగంతో క్షీణిస్తున్న పక్షాంత రాజ చంద్రునిలాగ వున్నాడు. పురుగులు తొలిచివేసిన నీడ చెట్టులాగా వున్నాడు. రాణి దోసటిలో తలపెట్టి కొత్త వైద్యుణ్ణి చూచాడు. ఏదో మనస్సుకు ఊరట కలిగింది. నిజమే శుభాలు కలుగునప్పుడు మనస్సు ప్రసన్నమవుతుంది.

కీర్తిసేన రాక్షసి చెప్పిన ప్రక్రియతో రాజుకు చికిత్స చేసింది. తలలోని జెర్రులను లాగివేసింది. రాజు తత్క్షణమే స్వస్థుడయ్యాడు. వైద్య వేషంలోవున్న ఆమెతో "వైద్యరాజా, నా ప్రాణాలు కాపాడావు. గుర్రాలు, రత్నాలు వున్న నా ఈ రాజ్యాన్ని సంతోషంతో పుచ్చుకో!" అని అన్నాడు.

"దేవా, నాకు రాజ్యమెందుకు? నీవు ఇస్తున్నానంటున్నావు గనుక, నారాజ్యంగానే భావిస్తున్నాను. నా రాజ్యాన్ని నీవద్ద అంకువగా పెట్టుకో. నేను అడిగినప్పుడు, నాకు అప్పగించు" అని ఆమె రాజుకు సమాధానం చెప్పి, ఒప్పించింది. ఆ ఇంట్లోనే, స్వతంత్రంగా ఉంటూ, తనభర్తకోసం ఎదురు చూస్తూ వుంది.

కొంతకాలం గడిచింది. దేవసేనుడు ఆ దారినే వెళుతూ, వసుదత్త నగరానికి వచ్చి, విడిశాడు. అతడు తెచ్చిన [illegible] సంపత్తితో, ధనంతో, పరివారంతో

(63 వ పేజీ చూడండి)

వారఫలం

6-12-1968 శుక్రవారంమొదలు 12-12-1968 గురువారం వరకు

మేషం : వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. సాహసముతో కూడినవ్యవహారాలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించ గలదు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతోష కరమైన వార్తలనువింటారు.

వృషభం : భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయ గలరు. కోర్టు వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.

మిధునం : ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అవరోధాలు తొలగి పోతాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. నూతన వ్యవహారాలు లాభించగలవు. అధికారుల వలన జరగ వలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడు తుంది. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదంఉంది. వారంమధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

సింహం వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో మెప్పుకు రాని కార్యభారాన్ని వహిస్తారు. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయ జరుగుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కన్య : వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు వారంమధ్యలో బాగా ఉంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులకు గురి కాగలరు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లస్తాయి.

తుల : వృత్తివ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి.

స్త్రీలకు—విలాస వస్తువులు కొంటారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృశ్చికం ఇంతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాల్లోనే చికాకులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సంతోష కరమైన వార్తలను వింటారు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధువులకు సహాయం చేస్తారు.

ధనుస్సు : ఫలితంమాట యెలాగ ఉన్నా, ప్రయత్నించిన ప్రతి పనీ సులువుగా నెరవేరుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సు కొంటారు. వారం మధ్యలో ఆకస్మికంగా చికాకులకు గురి కాగలరు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

మకరం వృత్తిలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో యితరులనిమిత్తం శ్రమకు గురి కాగలరు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. రాజకీయ వ్యవహారాల్లో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం: వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. పోటీవారితో మాట పట్టింపుల తగవు. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆడంబరం కోసం వ్యయంచేస్తారు.

మీనం : మీరు యెంతగానో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. నూతనావకాశాలు లభిస్తాయి. స్థిరాస్థి వ్యవహారాలు శ్రమమీద ఫలిస్తాయి. సాహిత్య కళా రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. విలాస వస్తువులు కొంటారు.

—మహేష్

ప్రశ్నావళి ?

కె. రామలక్ష్మి

పి ఎస్. ఆర్. పి, శ్రీకాకుళం

'లవ్ ఇజ్ బ్లయిండ్' అంటారు...

నాట్ ఓన్లీ బ్లయిండ్ బట్ ఆల్సో డెఫ్ బ్రదర్, కాకుండే ప్రేమ ప్రేమ అంటూ సాహిత్యం, మనుషులు, సినిమాలు సర్వం ఘోష పెడుతూండే ఎక్కడా ఉలక్కుండా పలక్కుండా ఉండిపోతుందా? రామ! రామ!

కె.ఎస్.ఆర్. బెక్కం, మహబూబ్‌నగరు

ప్రశ్నావళి రామలక్ష్మి, ఆరుద్ర గారి రామలక్ష్మి, కె. రామలక్ష్మి అంతా ఒకరేనా? కె. అంటే ఏమిటి?

ఆహా ఏంమాయో! అంతా ఒకటే. 'కె' యింటి పేరు!

అమాంతం ఓ గొప్ప రచయితను కావాలని అనుకుంటున్నాను. దానికో చిట్కా చెప్తారా?

పేలుచూసి ఓ రచన అచ్చయేలా చూడండి. తరవాత అందరికీ చెప్పవచ్చు — ఆరోపిట రాత మొదలెట్టానని. రాతంటే ఏమిటండీ మహా, నోట్లోమాటలని కాగితంపైకి ఎక్కించడమేగా? ఏమంటారు ?

బి. వి. పి. ఆర్, ఖర్గపూరు

వర్ణాంతర వివాహాల గురించి మీ అభిప్రాయం ముచ్చటగా మూడు ముక్కల్లో చెప్పండి రామలక్ష్మిగారూ.

ప్రేమకు వర్ణభేధంలేదు రావుగారూ, అది ఉంటే వర్ణాంతర దేశాంతరమనే మాటేరాదు.

వానాజీ, విశాఖ

నాడు స్త్రీలు పురుషుల అధీనంలో ఉండేవారు. మరి నేడు తారు మారగుటకు కారణం?

అలాగా నక్కుజాయి అత్తగార్ని, మొగుణ్ణి ఏకాలంలో వేస్తారోమీరు—చూడాలనుంది. కాలమే మారింది కాని మనుషులుకాదు. అప్పుడూ ఇప్పుడూకూడా — స్త్రీ పురుషులు ఒకరికొకరు లోబడి ఉంటారు. అది సహజధర్మం. వింతకాదు. విపరీతంకాదు.

కళకు కళ ఎప్పుడు వస్తుంది?

అది మానవతకి నిలయంగా ఉన్నప్పుడు.

మనిషి మీద నమ్మకం పోతూంది. అందునా ఆడదంటే మరీ నమ్మడం కష్టంగా ఉంది!

పాపం!

జె. పి. ఆర్, రాజమండ్రి

దానగుణం నేర్పితే వస్తుందా ? రాదా?

వస్తుంది. కాని కొందరికి జన్మతహ ధర్మ గుణం లోపిస్తుందనుకుంటాను — అలాంటివాళ్ళు ఉన్ననాడూ పెట్టలేరు. లేనినాడు అసలేలేదు... మరి ఉండీ లేనికాలం అంటూ ఉండదుకదా!

యం. వి. ఆర్, బ్యారక్‌పూరు

ఈ రోజులలో వోటుకి నోటుకి గల సంబంధం ఏమిటి?

రాజకీయపు ఎత్తులు అర్థకాని సామాన్యుడు ఓటుకి ఆయాపార్టీలు ఆఫర్‌చేసిన నోటు విలువే కట్టుకుంటాడు. ఎవరెక్కువ ఇస్తే వారికి... నిరక్షరాస్యత నిర్మూలం కానిదే ఓటువిలువ తెలుసుకోడం, వ్యక్తిగత విలువ నిలబెట్టుకోవడం అనేవాటి ప్రాముఖ్యం తెలిసిరాదని నా నమ్మకం,

మీరు ఇంగ్లీషు గ్రామరు కంఠస్తం చేశారా?...

మీరు చిన్నతనంలో చేయనట్టుందే!

ఈ రోజులలో మగవాళ్ళదుస్తులు ఆడవాళ్ళు ధరిస్తున్నారు. మరి ఆడవారి దుస్తులను మగవాళ్ళు ఎప్పుడు ధరిస్తారండీ ?

శుభస్య శీఘ్రం అన్నారు — ప్రారంభించండి మరి—

బి. ఎస్. ఆర్, రాజమండ్రి

మనకి లేనప్పుడు ఎదుటివాణ్ణి చూసి ఏడవడం సహజంకదా ? అది తప్పంటారెందుకండీ?

మనకి కావాలంటే ఎదుటివాణ్ణి చూసిఏడ్చి ప్రయోజనం ఏమిటి రావుగారూ — వినలేదా 'ఎదుటి కలిమిచూసి ఏడ్చెడువారికి, భాగ్యమెటుల కూర్చు పరమగురుడు ?' అన్నది.

ఏస్. ఎస్. వి. ఆర్, ఇచ్ఛాపురం

గుడిపాటి వెంకట చలంగారి 'స్త్రీ' పై మీ అభిప్రాయం ఏమిటి ?

నా అభిప్రాయం వేరే ఎలా ఉంటుంది — నిర్భయంగా వ్రాయకల్గిన రచయిత గ్రంథం ఏదైనా ఓసారి చదవవలసినదే యువతరం.

జి. ఏ. పి, గుంటూరు

డబ్బుంటేనే స్నేహితులు వస్తారు. డబ్బు లేకపోతే స్నేహితులు రారు, నిజమేనా.

డబ్బొక్కటే స్నేహానికి నాంది అయితే అంతే మరి, స్నేహం చాలామంది ఊహించే దానికంటే అతీతమైనది సోదరా, ఒకవేళ స్నేహితులు డబ్బు అడిగితే, అది నద్దలేకపోతె నీచంగా ఆలోచించడం. ఆడిపోసుకోడం — సంకుచితత్వమేగాని వేరుకాదు. డబ్బిస్తే అప్పుగానైనాసరే, మాట్లాడి, లేకుంటే నాలుగువూటలూ అనుకునే స్నేహితులు ఉండడంకంటే—లేరని చెప్పుకోడం మంచిది. ఇది నా స్వానుభవం కూడా.

పి. ఎస్, విశాఖపట్నం

మీ భర్తగారిపేరు చెప్తారా.

ఆహా భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. (మనలో మనమాట నాపేరు లోగడ చెప్పాను— శీలవనల కామిహోత్ర్యా గంధ దూరసారి!

యం. బి. హెచ్. ఎస్, వరంగల్లు

మీకు ఆరుద్రగారితో పరిచయం ఉందా?

ఉంది!

పత్రికలో 6 రూ. 5 సంవత్సరముల గ్యారంటీతో చేతి గడియారం వస్తుందని చూశాను నిజమేనా.

తమ్మునసుమానం తలతిక్క తీర్చుతుంది. ఓసారి ఆర్డరివ్వకూడదూ?

యుగంధర శ్రీ, హైదరాబాదు

'భగవంతుణ్ణి కళ్ళారా చూస్తే ఎంత బాగుణ్ణు' అనే ఆలోచన మీకు ఎప్పుడైనా కల్గిందా ?

ఎదురైతే బాగుణ్ణు అనిపించింది — ఆయనగారితో తేల్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి!

'ప్రేమ' అనేపదం జీవిత నిఘంటువులలో లేనట్లయితే ప్రపంచం ఈ నాటికి ఎలా ఉండేది ?

అలా సాగుతూనే ఉండేదని నా నమ్మకం బ్రదర్... ఇప్పుడు మామూలే పుష్కలంగా మాటు టుట్టా.

పి. ఎస్, విశాఖ

పొట్లకాయ కోడిగుడ్డుకూర చేస్తానంటుంది మరదలు...

బొత్తిగా బెండపూడిలాగా ఉంది! జాగ్రత్త అల్లుడు. ●



'పసిడీ! పడిపోతావ్, ఏమిటా పరుగు?' అమ్మమ్మ మందలింపును లెక్క చెయ్యకుండా పరుగెట్టి కనుమరుగైంది అప్పుడే యౌవన ప్రాంగణంలో అడుగు పెట్టిన రాణి.

'ఆడ పిల్లకు ఇంత విరగబాటు తగదమ్మా. పిదప కాలమూ, పిదప బుద్ధులూనూ' గొణుక్కుంది అరవయ్యవ పడిలో పడిన లక్ష్మమ్మ. అక్కడేవున్న వసంత అందుకుంది,

'అయితే ఇది మీ కాలం అనుకున్నావా అమ్మమ్మా. నాగరిత ఇంత ముందుకు పరుగు తీస్తుంటే, నువ్వు నీ మనమరాలిని వెనక్కు నడవమంటే ఎలాగ?'

'ఏమోనమ్మా ఈ నాగరికతలూ అవీ నే ఎరగను...బొట్లు వేసుకుని పరుగు పెడ్తోంది. కాలు జారుతుందో ఏమో' సణుక్కుంటున్న అమ్మమ్మను చూచి పక పక నవ్వింది పెద్ద మనమరాలు వాసంతి.

'జారదులే అమ్మమ్మా. నీది మరీ చాదస్తం'

బుగ్గలు నొక్కుకుంది లక్ష్మమ్మ.

'అవ్వ! పెళ్ళయినదానివి నువ్వు. పెళ్ళి కావలసిన పిల్ల అది. నువ్వు దానికి చెప్పాల్సిందిబోయి, వెనకేసుకొస్తున్నావటే.'

'పెళ్ళి కావల్సిన పిల్లని, కాబోయే మొగుణ్ణి గురించి కలలుకంటూ మూల కూర్చోవాలా అమ్మమ్మా' అమ్మమ్మ అమాయకత్వానికి విరగబడి నవ్వింది వసంత. నవ్వు తెరల మధ్యగా మరలా తనే అంది.

'అమ్మమ్మా నీ కెన్నేళ్ళకు పెళ్ళయిందే! అప్పుడూ ఇవే మాటలొచ్చా అమ్మమ్మా'

'ఏమి ముదనష్టపు పిల్లలబ్బా సిగ్గూ, బిడియంలేదు...' అని మనుమరాలిని తోసేసి లేచిందామె. ఆమె కోపం వెనకాల కప్పించిన సన్నటి సిగ్గుతెరను చూచి సన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది వసంత. అమ్మమ్మ వాడిపోయిన కళ్ళల్లో, కోపాన్ని, సిగ్గును చూచిన వసంత కమ్ముకొస్తున్న విచార ఛాయలను గమనించ లేకపోయింది.

లక్ష్మమ్మ తల్లిదండ్రులకు ఆరుగురు ఆడసంతానం తర్వాత ఒకేఒక్క మగపిల్లాడు పుట్టాడు. వాడి ముద్దుముచ్చటలు చూడకుండానే వాళ్ళు పరలోక గతులయ్యారు. రామచంద్రరావని పేరుపెట్టి అక్కలు వాడిని అల్లారుముద్దుగా పెంచారు. పెద్దక్క అయిన లక్ష్మమ్మకీ, రామచంద్రరావుకీ

శరీరం తేడా లేకపోయినా, తరమంత తేడా వుంది. రామచంద్రరావు పుట్టకముందే ఆమెకు పెళ్ళి అయింది. ఇద్దరు బిడ్డలకు తల్లి అయినా అవకముందే ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. భర్త బ్రతికున్నకాలంలో అడపా దడపా దెబ్బలుతిన్నా ఒకరికొకరుగా బ్రతికారు వాళ్ళు. ఆయన పోవడంతో ఆమె దెబ్బతిన్న పక్షే అయింది. ఇద్దరు కూతుళ్ళమీదే ఆశలు పెట్టుకుని బ్రతికింది. రెండో కూతురు శ్యామలను; తమ్ముడికిచ్చి పెళ్ళి చేసింది. ఇద్దరు బిడ్డలూ అత్తవారింటి కెళ్ళిపోవడంతో ఆమె మరలా ఒంటరిదై పోయింది. 'రామా కృష్ణా' అనుకునే వయస్సులో ఆ వృద్ధురాలికి మరో అఘాతం తగిలింది. ఒకరోజు దేవునిగదిలో పూజలో వుండగా వార్త వచ్చింది. 'శ్యామల హఠాత్తుగా పోయింది. వెంటనే రమ్మనమని' 'శ్రీమన్నారాయణా! ఈ వయస్సులో నాకెందుకు తండ్రీ ఈ శిక్ష విధించావ్. నాకు ముందే చెప్తే నా ఆయుస్సుపోసి నా శ్యామలను బ్రతికించుకోక పోయానా భగవంతుడా!' అని రాతి బొమ్మ పాదాలమీద పడి రోదించిందామె.

ఇటు తమ్ముడి కాపరంలో దీపం ఆరిపోయినందుకు బాధపడుతున్న ఆమెకు, అటు కూతురు శాశ్వతంగా శలవు తీసుకున్నందుకు విలపిస్తున్న ఆమెకు, పిల్లలను ఓదార్చే బాధ్యత సమస్య అయింది. వాళ్ళు ఎదిగిన పిల్లలు. వాళ్ళను ఓదార్చే భాష ఆమెకు రాదు.

'అమ్మ మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది అమ్మమ్మా' అని బావురుమన్న పద్దెనిమిదేళ్ళ రాఘవేంద్ర, పదహారేళ్ళ వాసంతి, పన్నెండేళ్ళరాణిని, ప్రక్కలో కూర్చోబెట్టుకుని చెప్పిందామె 'అందరం ముందో వెనకో పోవలసిన వాళ్ళమే తల్లీ. శ్యామలకు ముందే పిలుపొచ్చింది. అంతే...అంతే,' ఆ వృద్ధురాలు తన మనుమలను ఓదారుస్తుందేగాని, ఆమెకూ ఈ వియోగం భరించరానిదిగా వుంది 'తన గర్భంలోనుండి వచ్చిన శ్యామల తనకంటె ఎంత చిన్నది! అప్పుడే ఎందుకు రావాలి పిలుపు?'

'తల్లీ శ్యామలా! నిన్ను కన్నప్పుడు వేనుకోలేదే నీచావు చూడాల్సి వస్తుందని. కన్నబిడ్డ చావు చూడాల్సి రావడం...ఎంత ఖర్మ చేసుకున్నాను నేను!'

అమ్మమ్మ ముడతలుపడ్డ చెంపలమీదగా కారిపోతున్న కన్నీళ్ళను తుడుస్తూ అంది రాణి వెక్కిళ్ళ మధ్యగా;

'ఏడవకమ్మమ్మా భయమేస్తోంది.'

'లేదు పసిడీ, ఏడవడం లేదమ్మా' ఆ పిల్లను హృదయానికత్తుకుందామె. ఇలానే కొన్ని సంవత్సరాల్రకితం శ్యామలను తమ్ముడి వెంట పంపుతూ హృదయానికి హత్తుకున్న అనుభూతి కలిగిందామెకు.

'అప్పుడే ఎందుకు వెళ్ళిపొయ్యావు శ్యామలా. ఎంతమంది పిల్లలని సాకేది? ఇంకా నీ ముసలితల్లికి అంత సత్తువ వుందనుకుంటున్నావా?'

ఆమె నీరసించిన కళ్ళల్లోనుండి నాలుగు నీటిబొట్లు పసిడి తలమీద పడి ఇంకి పోయాయి.

అలా శ్యామల స్థానం భర్తీ చెయ్యడానికి, లక్ష్మమ్మ ఆ ఇంట్లో స్థిరపడి పోయింది.

* * *

'శ్యామల పోయి అప్పుడే మూడేళ్ళయి పోయింది'అని ఒంటరిగా కూర్చుని నిట్టూర్చుస్తున్న లక్ష్మమ్మ ప్రక్కన వచ్చి కూర్చుంది రాణి స్నేహితురాలు రమ.

'ఏంటమ్మమ్మా ఆలోచిస్తున్నావ్.'

'ఈ పాపిష్టి కళ్ళతో నీ పెళ్ళి చూచే యోగం వుందో లేదోనని ఆలోచిస్తున్నాను' అని బోసి నోటినిండుగా నవ్వింది లక్ష్మమ్మ.

రమ కూడా నవ్వి అంది.

'ఇంట్లోకూడా నా పెళ్ళికి తొందర పడుతున్నా రమ్మమ్మా. చెప్పు, చేసేసుకోమంటావా అమ్మమ్మా' పదహారేళ్ళ రమకూ, అరవైఏళ్ళ లక్ష్మమ్మకూ మధ్య విచిత్రమైన స్నేహముంది. ఆ పిల్ల ప్రతిదీ అమ్మమ్మకు చెప్పి సలహా తీసుకుంటుంది.

'బాబోయ్! అమ్మమ్మ బుద్ధులు నేర్చుకోకే రమా' అని ఏడిపిస్తూ వుంటుంది రాణి.

'చేసుకోతల్లీ, ఏ వయస్సులో ఏది జరగాలో అది జరిగిపోవాలి.'

'ముక్కూ ముఖం తెలియని వాడివెంట వెళ్ళాలంటే భయమేస్తుంది అమ్మమ్మా'

'పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయి తల్లీ. నువ్వతని ముక్కూ ముఖం తెలుసుకోవాలనుకున్నా; తెలుసుకున్నది మొటుకు నిజమని ఏముందమ్మా'

లక్ష్మమ్మ చెప్పిన మాటలు మౌనంగా విని 'రాణి ఎక్కడమ్మమ్మా' అంటూ లేచింది రమ.

'రాణీ! ఈరోజు నాకు పెళ్ళివారు వచ్చారు.'

'అమ్మదొంగా నాకు చెప్పనే లేదు' అని ఎగిరి గంతేసి రమ ప్రక్కన వచ్చి కూర్చుంది రాణి.

'అతనెలా వున్నాడు? బాగున్నాడా? చదువుకున్నాడా? మీరిద్దరూ మాట్లాడుకున్నారా? ఏమి మాట్లాడుకున్నారు?'

స్నేహితురాలి ఆతృతకు సన్నగా నవ్వుకుంటూ చెప్పింది రమ.

'బాగున్నాడు, చదువుకున్నాడు. కానీ మాట్లాడుకోవాలని అతను అడగలేదు'

రాణి ఉత్సాహమంతా చల్లారిపోయింది.

'ఒట్టి బ్రూట్‌లా వున్నాడు. కాకపోతే ఒకరిభావాలు ఒకరు తెలుసుకోకుండా పెళ్ళి చేసుకోవడమేమిటి?'

రమ మాట్లాడలేదు.

'వద్దు రమా! ఇతను కాకపోతే మరొకడు. నువ్వతనితో మాట్లాడాలి. ఏపార్కుకో సినిమాకో వెళ్ళి అతని తత్వం అర్థం చేసుకోవాలి. అసలు నన్నడిగితే— ప్రేమించందే పెళ్ళి చేసుకోకూడదంటాను'

రెండు విరుద్ధమైన సలహాల పందిరి క్రింద నిల్చుని తన స్వంత నిర్ణయం ఏదో చేసుకోవడానికి వెళ్ళిపోయింది యుగసంధిలో జన్మించిన రమ.

* * *

'రాముడూ! పసిడి ఇంకా రాలేదురా' స్నేహితులతో సినిమాకి వెళ్ళిన మనమరాలు ఇంకా తిరిగిరాలేదని ఆరాటపడుతుందామె.

'వస్తుందిలే అక్కా. నువ్వెళ్ళి భోంచేసి పడుకో' నిశ్చింతగా చెప్పి తన ఫైల్స్‌లో మునిగిపోయారు రామచంద్రరావుగారు.

'అదేవిటిరా! ఎదిగిన ఆడపిల్ల రాత్రి పూట ఊళ్ళమ్మట తిరుగుతుంటే నీకు చీమ కుట్టినట్లయినా లేదు.'

'ఈకాలంలో కూడా ఆడామగా తేడా ఏమిటక్కా నీ పిచ్చిగాని. రేపు మన రాణి ఈ దేశానికి ప్రెసిడెంట్ కావచ్చు'

'ఒరే నువ్వెన్నయినాచెప్పు ఆడది ఆడదే' అని ఆగి 'అసలే తల్లిలేని పిల్ల. రేపు

లోకం నన్ను దుమ్మెత్తి పోస్తోంది' అంటూ కంట తడిపెట్టుకుంది కూతురు జ్ఞాపకానికి రాగా.

'అయితే నన్నేం చేయమంటావక్కా' విసుక్కున్నారాయన.

'ఇక చదివించింది చాలు ఆపెసెయ్యి. మంచి సంబంధం చూచి ముడిపెట్టేద్దాం. ఈలోపల సినిమాలకీ పంపించకు. పెళ్ళయ్యాక దానిష్టం, దాని మొగుడిష్టం.' ఆయన పకపక నవ్వారు.

'నీ మనమరాలు ఉద్యోగం చెయ్యాలంటుంది ఎలా మరి?'

'పిచ్చి తల్లి. స్త్రీకి సృష్టికంటె పెద్ద ఉద్యోగమేముందిరా?'

ఆయన మాట్లాడలేదు. తన సిద్ధాంతాలు తన తమ్ముడికి నచ్చలేదని నిట్టూర్చి లేస్తుండగా వాకిట్లో కారు శబ్దమయింది. తన ఆశయాన్ని మర్చిపోయి, వాకిట్లోకి నడిచిపోయిందామె.

కారులోనుండి రాణి, రఘు దిగారు. కారులో ఇంకా ఒక అమ్మాయి ఇద్దరబ్బాయిలు వున్నారు. వాళ్ళు టా టా చెప్పేసి వెళ్ళిపోయారు. మనవడికీ, మనమరాలికీ అన్నం వడ్డిస్తూ అంది ఆమె.

'మనవ్వా వెళ్ళావ్ట్రా రాఘవా సినిమాకి? అలా అని తెలిస్తే ఇంత గాభరా

యుగ సంధి

పడక పోదునుకదా!'

'మధ్యలో కలిసాం అమ్మమ్మా' అని లెంచేయడంతో లీనమయిపోయాడు.

'ఓరే రాఘవా! వాళ్ళు నీ స్నేహితుల్రా! అందరూ కలిసే వెళ్ళారా?'

'నా స్నేహితులు కాదు అమ్మమ్మా రాణి స్నేహితులు' అని చెప్పి రియాక్షన్ కొరకు అమ్మమ్మవైపు చూచాడు రాఘవేంద్ర.

'అదికాదురా ఆ మగపిల్లాళ్ళ గురించి నేనడిగేది.'

'ఆఁ వాళ్ళగురించే చెప్పిందికూడా' అని వెల్లెలివైపు తిరిగి చిరునవ్వు నవ్వాడు రాఘవేంద్ర.

లక్ష్మమ్మకిదంతా విచిత్రంగా తమాషాగా వుంది. ఆమెకు తెలుసు తనింకా తరచి అడిగితే అన్నా, చెల్లి ఇద్దరూ కలిసి తనను అవహసిస్తారని. అందుకే వాళ్ళకు వరావంగా వడ్డించివచ్చి పడవలో కొంగు పరచుకుని పడుకుంది. కానీ ఆమెకు నిద్రపట్టడం లేదు సరిగా. కలత నిద్రమండి ఉలిక్కిపడి లేచికూర్చుంది.

'అమ్మా నా కూతురిని నీ చేతుల్లో పెట్టాను. ఇలాసేనా అమ్మా పెంచేది ?,

శ్యామల నిలదీసి అడుగుతున్నట్లని పించింది. మనవడిగదిలో ఇంకా లైటు వెలుగుతోంది. వాకిలిదాకావెళ్ళి తిరిగొచ్చింది. ఆమెకు తెలుసు వాడు తన మాటలను కొట్టిపడేస్తాడని, నాగరికత పేరుచెప్పి అవమానిస్తాడనీ. అయినా ఆ ముసలి ప్రాణానికి రాజీ కుదరలేదు. మరలా లేచి నేరుగా మనవడిదగ్గర కెళ్ళిందామె.

'రాఘవా !'

'ఏం అమ్మమ్మా'

'అది కాదురా పసిడికి తెలియదనుకో నువ్వయినా చెప్పకూడదట్రా. అలా మగ పిల్లలతో తిరిగితే లోకం నవ్వుతదిరా'

'అది మీకాలం అమ్మమ్మా. ఈ కాలంలో ఎవరు ఎలా పోయినా ఎవరూ పట్టించుకోరు.'

'ఎవరూ పట్టించుకోరని బురదలో పడుస్తామా నాయనా'

'తర్వాత కడుక్కుంటే బురదపోతుందిలే అమ్మమ్మా. విసిగించక వెళ్ళి పడుకో'

'అంతే తెలుసురా నీకు. అంతే తెలుసు' ఆమె గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

* * *

'అమ్మమ్మా !' తన ఒడిలో చేరి వెక్కి వెక్కి ఏడుస్తున్న రాణిని చూచి లక్ష్మమ్మ గుండె నీరు కారిపోయింది.

'ఏమి తల్లీ! ఏం కష్టం వచ్చిందమ్మా నీకు. నాతో కాకపోతే ఇంకెవరికి చెప్పు కుంటావే పసిడి, చెప్పమ్మా'

రాణి కళ్ళల్లోనుండి నీళ్ళు కారి పోతున్నాయేగాని జవాబు రావడంలేదు.

'నాన్నగారేమన్నా అన్నారా ?'

తల అడ్డంగా త్రిప్పింది రాణి.


'నీ మ్యాట్లో పిల్లలేమయినా అన్నారా? చెప్పు ఎవరేమన్నారో చెప్పు. నా తల్లిని అనడానికి ఎన్నిగుండెలుండాలి వాళ్ళకి?!'

'అమ్మమ్మా !' బావురుమంది రాణి.

'ఎంత బాధ లేందే కళ్ళనీళ్ళు వింపు కుంటావు ! నా బంగారుతల్లివి కదూ ! నాకు చెప్పవూ పసిడీ, నేను అమ్మమ్మను కాదూ !' పదిహేనేళ్ళ పసిడిని—ఒళ్ళోకి లాక్కుని బుజ్జగించింది లక్ష్మమ్మ.

'అమ్మమ్మా !'

'ఏం అమ్మా. చెప్పు తల్లీ చెప్పరా' మనమరాలి వెన్ను రాస్తూ బతిమలాడిందామె.



వెక్కిళ్ళమధ్యగా తలవంచుకుని మెల్లగా అంది రాణి,

'నాకు మూడోనెలట అమ్మమ్మా'

'అంటే...అంటే...'

రాణి అమ్మమ్మవైపు నీళ్ళునిండిన కళ్ళతో భయంభయంగా చూస్తోంది. మెల్లి మెల్లగా ఆ వృద్ధురాలికి అంతా అర్థమవుతోంది. ప్రపంచమంతా మోసంగానూ, ఆ ప్రపంచంలో వంచించబడ్డది అమాయకురాలైన తన పసిడి ఒక్కటేనని అన్పించసాగిందామెకు.

'పాపిష్టిదానా! ఎంతపని చేసావే!' వడలిపోయిన ఆమె బుగ్గలమీదుగా వేడి కన్నీరు జారిపోతోంది. ఆమె పెదాలు అస్పష్టంగా గొణుక్కుంటున్నాయి.

'నీకు అందరూ 'రాణి' అని పేరు పెడ్తే, పసిడి ముద్దలా వున్న నిన్ను చూచి సంబరపడి 'పసిడి' అని పిల్చుకున్నాను. కానీ...ఆ బంగారం మైలపడి పోయింది.'

'పరలోకంలో వున్న శ్యామలకు ఏమి జవాబు చెప్పాలి తనిప్పుడు?'

శ్యామల పోయినప్పుడు ఏడ్చిన ఆ వృద్ధురాలు మరలా ఈనాడు మనమరాలి భ్రష్టమైన జీవితాన్ని తలచుకుని ఏడుస్తోంది.

'ఏడవకమ్మమ్మా, భయమేస్తోంది'

ఉలిక్కిపడింది లక్ష్మమ్మ. శ్యామల పోయినప్పుడు తను కంట తడిపెడ్తుంటే ఇలానే...అచ్చు ఇలానే అంది ఆ పసిపిల్ల. పసిడి ఏమీ ఎదగలేదు ఎదగని పసిడి తప్పు చేసింది. దానికి బాధ్యులు ఎవరు? తను కాదా!' ఆమె ఆత్మవిమర్శ చేసుకుంటోంది.

'అమాయకురాలు, పసిపిల్ల అయిన ఈ మొగ్గను, భద్రంగా కాపాడలేదు తను. మొగ్గ విడకముందే వెలుగును చూడమని ప్రపంచంలోకి విసిరివేసారు. ప్రతి పురుగునూ భ్రమరం అనుకునే పసిడి మోసపోయింది.'

మనమరాలిని కొద్దిగా ముందుకు వంచి ఆపిల్ల కళ్ళల్లోకి తదేకంగా చూస్తోందామె.

'భగవంతుడా! ఈ పసిడి బంగారాన్ని ఎందుకు మలిన పర్చావు? అపవాదులన్నీ భరించి బ్రతకమనా నాకింకా ఆయుస్సు పోస్తున్నావు?'

ఆమె తేరుకుని ఈలోకంలో పడేసరికి నిశికాంత సొగసు దిద్దుకుంటోంది. మనమరాలిని లేవదీసి కూర్చోబెట్టి సిరసన్వరావ

యుగ సంధి

అడిగింది.

'ఎవరు?'

రాణి కళ్ళు వాల్చేసుకుంది.

'ఎవరో తెలియదా?' తెలుసన్నట్టు తల వూపింది.

'అతనంటె నీ కిష్టమా?'

సగౌరవంగా అవునంది.

'అతనికి?...'

మాట్లాడలేదామె.

'మీ నాన్నగారితో చెప్పనా?'

భయం భయంగా చూచింది రాణి.

'ఎలా తల్లీ? నేను ఉత్త ఆడదాన్ని. పైగా నీకు తల్లినికూడా కాను. ఈ రహస్యాన్ని నాకడుపులో పెట్టుకుని దాచుకునే శక్తిలేదు. ఏం చేయను నేను?'

మర్నాడు ఈవిషయాన్ని విన్న రామచంద్రరావుగారు ఉగ్రుడైపోయాడు. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగారు.

'వాడికి బుద్ధిలేదనుకో. ఆడపిల్ల దీని కెందుకు బుద్ధిలేకపోయింది?'

'అదేవిట్రా! ఈకాలంలో ఆడామగా తేడా లేదన్నావుగదా?' అమాయకంగా అంది ఆమె. ఆయన అక్కమాటలు విన్పించుకో లేదు.

'ఎటువంటి వంశం మనది! వంశంలో మచ్చ తెచ్చాక ... ఇంతమచ్చ తెచ్చాక...' ఆయాస పడ్తున్నారాయన.

'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమిలాభం?' నిట్టూర్చిందామె.

ఉన్నట్టుండి కూతురువైపు తిరిగి గర్జించాడాయన.

'ఎవడు వాడు?'

'రాముడూ! ఆవేశ పడకురా. పసిడీ! నువ్వు లోపలకెళ్ళు' వాళ్ళిద్దరిమధ్య నలిగి పోతుంది. రెండు భావావేశాలు ఆమెను కుదిపేస్తున్నాయి.

మనమరాలిని లోపలకు పంపించేసి తమ్ముడి దగ్గరకొచ్చి ఆయన తలమీద చెయ్యివేసి అంది ఆమె 'చూడు రాముడూ! అతనెవరో కనుక్కో. ఆతర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం.'

'రఘూ' లోపలికి కేక వేసారాయన.

జరిగినదంతా విని అన్నాడు రఘు.

'బహుశ అతనే అయ్యుంటుంది' అని అతని తాలూకు వివరాలన్నీ చెప్పాడు రామచంద్ర.

'అయితే వాడి కులం, గోత్రం కొన్ని కనుక్కోరా ముడిపెట్టేద్దాం.' అంది ఆమె సంతోషంగా.

'నీకేం తెలీదు ఊర్కో అక్కా. కులం గోత్రం ఒకటి కాకపోయినా పర్వాలేదు. కానికి పనికిరాని ఆ వెధవకుమాత్రం నా కూతురినివ్వను.' ఖచ్చితంగా చెప్పారాయన. కులం, గోత్రాలలో అందరూ సమానమే అంటున్న వీళ్ళు డబ్బు విషయంలో మరలా కొత్తరకం తెగల నెందుకు సృష్టించుకుంటున్నారో ఆమె మేధస్సుకు అందలేదు. అయినా ఆమె అవన్నీ ఆలోచించ దలచుకోలేదు. మనమరాలి జీవితం చక్కబడితే అంతేచాలు.

'మనం జరిగిపోయినదాన్ని గురించి కూడా కొద్దిగా ఆలోచించాలికదరా'

'అలా అని ఆ 'యూస్‌లెస్ ఫెలో'ని నా అల్లుణ్ణి చేసుకోనా? ఆతర్వాత నేను—తలెత్తుక తిరగాలా?' విసురుగా అక్కడ నుండి లేచి వెళ్ళిపోయారాయన. డబ్బుతో కీర్తిప్రతిష్ఠలను కొనుక్కోవాలనుకుంటున్న తమ్ముణ్ణి తలంచుకుని ఆశ్చర్యపడ్తున్న ఆమె మనవడి సలహాకు ఉలిక్కిపడింది. ఆమె పంచేంద్రియాలూ మొద్దుబారిపోయాయి—

'అంత చిన్నదానికి ఇంత హంగామా ఎందుకు అమ్మమ్మా 'అబార్షన్' చేయిస్తే పోలా ?'

'ఒరే ఏమన్నావు? హంగామా చేస్తున్నానా నేను? ఇది చిన్న విషయంగా కన్పడుతోందా నీకు? ఇదా నువ్విచ్చే సలహా! ఎందుకురా మీ చదువులన్నీ గంగలో కలప డానికి'

'ఇంతకంటె పరిష్కారం మరిలేదు అమ్మమ్మా' అని లేచాడు మనవడు.

'ఎంత తేలిగ్గా చెప్పావురా. అది బొమ్మ కాదురా చేతోత్తీసి పడేయడానికి. తల్లి గర్భంలో జేరి తల్లిలో కోటి తియ్యటి తలపుల్ని రేపే శిశువు అది. మీ మగాళ్ళకేం తెలుస్తుంది గర్భం తీపి.'

ఆమెకిదందా చిత్రంగా, తమాషాగా వుంది. ఈ విషయంలోకూడా వీళ్ళందరూ తనను కొట్టిపడేసి దీనిని తేలిగ్గా తీసు కుంటారనుకుంది? ఇలా ఎందుకు జరి

గింది?—వీళ్ళ నాగరికతకు అర్థం తెలియక బుర్ర బద్దలు కొట్టుకుంటున్న ఆమె దగ్గరకువచ్చి కూర్చుంది పెద్ద మనమరాలు వాసంతి.

'ఇప్పుడీ విషయం మా ఆయనకు, అత్తవాళ్ళకి తెలిస్తే ఇంకేమయినా వుందా అమ్మమ్మా' అంటూ కంట తడిపెట్టుకుంది.

లక్ష్మమ్మ విస్తుపోయింది 'తన చెల్లెలికి జరిగిన అన్యాయానికి బాధపడాల్సింది పోయి, తన భవిష్యత్తును గురించి చింతిస్తోంది ఆమె. ఎంత స్వార్థం!'

'అదేమే, మీవాళ్ళు ఇలాటివి అస్తే పట్టించుకో రనుకుంటానూ, అదేదో క్లబ్బులకూ గట్రా తిరగతారని చెప్పావుగా'

'తిరిగితే ఇలాటి పనులు చెయ్యాలని వుందా ?'

'మీరే దాన్ని దేశం మీదకు వదిలేసారు. మరలా...మరలా' ఆగిపోయిందామె. మనమరాలి మనసు నొచ్చుకుంటుందని ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ కాతరస్వరాన అంది.

'తిరగడానికీ, తప్పు చెయ్యడానికీ తెలియని వయస్సులో పిల్ల పసిడి. దానిని క్షమించు వాసంతీ.'

వాసంతి ఏమీ మాట్లాడలేదు. ఆ సాయంత్రమే అత్తవారింటికి ప్రయాణమయింది.

* * *

'ఇలా జరిగింది రమతల్లీ. ఇప్పుడు నన్నేం చేయమంటావు ?' తన స్నేహితురాలూ, సలహాదారూ అయిన రమను తన బాధను అర్థంచేసుకోమని అర్థించిందామె.

'ఇన్నిఏళ్ళ, నీ అనుభవంముందు నేనే పాటి అమ్మమ్మా. నీకు నేనేం చెప్పగలను ?'

'అలా అనకు తల్లీ. నేను ఈ తరం దాన్ని కాదు. ఈ తరంలో దేన్ని మంచి అంటారో, దేన్ని చెడ్డఅంటారో నాకు తెలియదు. నేనేమి చేస్తే నాతల్లి బ్రతుకు నవ్వులపాలు కాకుండా వుంటుందో కాస్త చెప్పి నాకు దారిచూపించు రమ తల్లీ'

'అమ్మమ్మా!' అమ్మమ్మ ఎడల ఆరాధనతో ఆ పిల్ల కళ్ళు ఆర్ద్రమయ్యాయి.

'నీ దగ్గర మేము నేర్చుకోవాల్సింది చాలా వుంది అమ్మమ్మా'

ఉన్నట్టుండి అడిగింది లక్ష్మమ్మ:

'నాగరికత అంటే ఏమిటి తల్లీ?'

'అందమైన గులాబీని కాగితం పువ్వుగా మార్చడం అమ్మమ్మా...అది ఒక భ్రమాచ్ఛన్నమైన బ్రతుకులే అమ్మమ్మా'

'అయితే తల్లీ, నే ననుకున్నది నిజం కాదా !'

'ఏమిటి అమ్మమ్మా !'

'నా తరానికీ, మీ తరానికీ మధ్యలో కరిగిపోయిన కాలంలో మీరు చాలా సాధించే రనుకున్నా నమ్మా' రమ వెంటనే జవాబు చెప్పింది.

'సాధించాలనే కోరికవుంది, సాధిదా మనే తపన వుంది. కాని పూర్తిగా సాధించకముందే పరుగుతీసి బోళ్ళా పడిపోతున్నాము. ఏది మంచో ఏది చెడో, ఏది అవునో, ఏది కాదో తెలియని మిథ్యాయుగం ఇది. అందుకే మిడతల్లా మాడిపోతున్నాం'

'ఇంకా పాతసూత్రాల గ్రంథం మూసి పోలేదు. క్రొత్త సూత్రాల గ్రంథం తెరవబడనేలేదు. అందుకే ఏ సూత్రాలు అవలంబించాలో తెలియడంలేదు. ఒక సిద్ధాంతాన్ని హర్షించే మనిషి, ఆ సిద్ధాంతాన్ని అనుసరించే మనిషిని హర్షించలేక పోతున్నాడు. ఒకవ్యక్తిని తప్పుత్రోవలో త్రోసి మంచిగా బయట పడనందుకు ఆ వ్యక్తిని శిక్షిస్తున్నాడు. తన వస్తువును భద్రపరచుకోవడానికి బద్ధకించి, అది చేతుల్లో నుండి జారిపోయాక ఏడుస్తున్నాడు. ఇదీ అమ్మమ్మా మా నాగరికత.'

ఆమె అంతా శ్రద్ధగా విని అంది.

'నేను నా పాత పద్ధతుల్ని, ఆచారాల్ని, కులగోత్రాలను పట్టుకుని వేళ్ళాడినా, నా సంతతి సుఖపడ్తోందని మనసులో సంతోషించేదాన్ని. కానీ తల్లీ నా కిప్పుడిప్పుడే తెలుస్తోంది—మాదింకా నయం నరకంలో నడుస్తున్నామని తెలిసి అడుగులు అతి జాగ్రత్తగా వేసేవాళ్ళం. మీరలా కాదమ్మా, స్వర్గంలో నడుస్తున్నామనే భ్రమలో, ఆ అతిశయంతో బ్రతికి ఒక్కసారిగా నరకపుద్వారం సమీపించేసరికి తట్టుకోలేక—పోతున్నారు.'

రమ అందుకుంది.

'కులమత తారతమ్యాలు సమసిపోతున్నాయని సంతోషించేలోపలే డబ్బును కేంద్రంగా తీసుకుని సరికొత్త తారతమ్యాలు కల్పించుకుంటున్నారు.'

'నరగ్రహాల్ని ఎలా చేరాలా అనే ఆలోచనల్లో, ముందుకుపోతున్న శాస్త్ర పరిజ్ఞానంలో, ఎదుటి మనిషికి ఒక మనసు వుందని మర్చి పోతున్నారు.'

'యుగం మారుతోంది కానీ కష్టాలు, సుఖాలు ఏం మారలేదు. కాకపోతే కష్ట సుఖాలు ఈ యుగంలో రంగురంగుల దారాలతో నగిషీ చేసుకుంటున్నాయంతే.'

రాణి వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దంతో ఇద్దరికీ మెలుకువ వచ్చింది. మనమరాలిని పొదివిపట్టుకుని ఒడిలోకి తీసుకుంటూ అంది లక్ష్మమ్మ.

'చూడు రమా ! ఈ పిల్లకు ఒక మనసంటూ వుందని వీళ్ళు మర్చిపోతున్నారమ్మా. గర్భంలో కదలాడే పసికందును తీసెయ్యమని తేలిగ్గా చెప్తున్నారమ్మా' అలా అనేప్పుడు ఆమె గొంతులో చిత్రమైన విరక్తిభావం కదలాడింది.

'అయితే అమ్మమ్మా, నువ్వేం చేయాలనుకుంటున్నావు ?' కొన్నినిముషాల మౌనం తర్వాత అడిగింది రమ.

'ఈ పసిదానికొరకు నేనేం చేయలేను తల్లీ !'

'అవును అమ్మమ్మా నువ్వు ఏమి చేసినా వెనక హింసించడానికి వాసంతక్కలాగ అత్తమామలు లేరు. కీర్తి పోతుందను కోవడానికి, నీ కీర్తిని, సంస్కారాన్ని అసలెవ్వరూ గుర్తించనే లేదు'

ఆ ముసలి ప్రాణం లేచి నిల్చుంది.

'నడువు పసిడీ. నా ఇంటికి పోదాం పద. నీకు మనస్తిమితం ఏర్పడ్డాక, తీరిగ్గా వివేకంగా ఆలోచించి నీ నిర్ణయాన్ని చెప్పువుగాని. ఇంతకంటె అవివేకురాల్ని, నేను సాహసించి ఏమి చెయ్యగలను ?'

ఆ వృద్ధురాలు ఈ ఆధునికపు యుగపరదాలను తప్పించుకొని, నాగరిక ప్రపంచాన్ని లెఖ్ఖచేయకుండా మనమరాలిని ముందుకు నడిపించుకు వెళ్తుంటే ఆమెను, చెమ్మగిలిన కళ్ళతో ఆరాధనా పూర్వకంగా చూస్తోంది రమ. ●



ప్రేమించు ప్రేమకై

కె. రామలక్ష్మి

2

తెల్లవార్లూ నిద్రపట్టలేదు లలితకి. మోహన్‌తో తన అనుభవం ఎంత వద్దనుకున్నా జ్ఞాపకానికి వస్తూనే ఉంది. మోహన్ తనని మోసం చేసినా అతనోరకం స్వేచ్ఛా పిపాసకి తనలో జీవం పోశాడు. రెక్కలిచ్చాడు. తొలి ప్రయత్నం ప్రమాదంతో ముగిసినా, స్వేచ్ఛగా ఉండాలన్న కోరిక చటుక్కు పోలేదు లలితకి. ఇకపై అత్తయ్యతో కూడా భయపడకుండా మసలకలను అనుకుంది. అవీ ఇవీ ఆలోచిస్తూండగానే హాల్లో గడియారం ఐదుగంటలు కొట్టింది. తెలతెలవారుతుంది. అక్కడా అక్కడా ఒకటీ అరా కాకులు కూస్తున్నాయి. ఎవరో పదే పదే తలుపు తట్టుతున్నారు. హాల్లో అవ్వగారు గాఢనిద్రలో ఉన్నట్టుంది, ఆ చప్పుడికి కూడా తెలివి రాలేదు. లలితే లేచివెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా టెలిగ్రామ్ బంట్రోతు. 'అత్తయ్య వచ్చేస్తూందన్నమాట' అనుకుంటూ సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకుంది లలిత. అది మోసుకు వచ్చేవార్త ఏమిటో ఊహించకల్గడంతో నెమ్మదిగా మంచం మీద కూర్చుని తెరచింది. తను చదువుతున్నదేమిటో తనకే అర్థం కాలేదు లలితకి. ఏమిటి? ఏమిటి వ్రాసి ఉంది? కళ్ళు నులుపుకుని మళ్ళీ చదివింది.

'సుబ్బమ్మ డైడ్ ఆఫ్ హార్ట్ ఎటాక్. మీట్ లాయర్ వెంకట్రామయ్యర్' అని ఉంది.

క్షణంపాటు ప్రాన్పడి కూర్చుండిపోయింది లలిత. 'అవ్వగారూ', గట్టిగా కేక వేసింది.

'ఏమామ్మ ఏమైంది? ఏమైంది' అంటూ హడావిడి పడ్డారు.

'అత్తయ్యచచ్చిపోయింది అవ్వగారూ, చచ్చిపోయింది' ముఖంచేతులలో కప్పుకుని భోరున ఏడ్చేసింది లలిత. లలితకి తెలుసు— అత్తయ్య పోవడంతో తను ఏకాకినని. మన కాధారభూతమైనవాళ్ళు ఆరళ్ళు పెట్టినా కట్టడి చేసినా సరే చచ్చిపోయారని తెలిసినప్పుడు 'అయ్యో మనమే కొంచెం అభిమానం ఎక్కువగా చూపించి ఉండవలసింది. కొంచెం ఆదరంగా ఉండవలసింది' అనిపించడం సహజం. అత్తయ్యని నమ్మించి మోసంచేశానే అన్నబాధ విపరీతంగా బాధిస్తున్న సమయంలో ఏదో విధంగా ఆవిడని దగ్గరకి తెచ్చుకుని తను చేసిన దానికి పశ్చాత్తాపం ప్రకటించాలని తలపోస్తున్న అదనులో ఆ వ్యక్తే లేకుండా పోయిందన్నవార్త పిడుగుపాటులాగా అయింది లలితకి. 'ఏమైందమ్మా చెప్పు' టెలిగ్రాములో వివరాలుండవని తెలియని అవ్వగారు తెగ అడుగుతున్నారు.

'గుండె ఆగి చనిపోయిందిట. లాయిరుగారిని కలవమని వైరు ఇచ్చారు' వెక్కుతూ చెప్పింది లలిత.

'అయ్యో తల్లీ ఎంతట్లో ఎంత ముంచుకొచ్చిందే.' వాపోయారు అవ్వగారు. బాగా తెల్లవారినా కూడా ఆ కబురూ ఈ కబురూ చెప్తూ లలిత పక్కనే కూర్చుని ఓదార్చారు. ఈ సమయంలో కనీసం ఈవిడేనా లేకుంటే ఏమైపోయేదాన్నో అనుకుంది లలిత.

'ఎనిమిది కావస్తూంది. లాయిరుగారిని పిలుద్దామమ్మాయి, వారికీ వార్త అందే ఉంటుంది. ఏం చేస్తాం చెప్పు. గుండె ధైర్యం ఇలాంటి సమయాల్లోనే చిక్కబట్టుకోవాలమ్మా. ఒంటరిదాన్ని చేసి మహాతల్లి వెళ్ళి పోయింది' దుఃఖంతో అవ్వగారి కంఠంకూడా వణికింది.

ముఖం కడుక్కుని లాయరుగారికి ఫోను చేసింది లలిత. అత్తయ్య వస్తుందన్న ఆశవల్లకాబోలు అప్పటిదాకా ఇల్లు బోసిపోలేదు. కాని ఇక రాదని తెలిశాక ఇంటిలో నిశ్శబ్దం ఆవరించి నట్టనిపించింది లలితకి. ఇకమీదట ఎలాగ జరుగుతుందో అన్న బెంగ ఒకపక్క కృంగతీస్తూంది.

ఎంతోసేపు మ్రోగాకగాని లాయరుగారి ఫోను ఎవరూ ఎత్తలేదు. నెమ్మదిగా వివరాలు చెప్పింది లలిత.

'నేనూ నీకు ఫోను చేద్దామనుకుంటున్నానమ్మాయి, పాపం. అనారోగ్యంగానైనా ఎప్పుడూ కనిపించని ఆవిడగారు ఎంతలో కన్ను మూసింది. నీకు చెప్పవలసిన విషయాలు చాలా ఉన్నాయి. పది గంటలకి కాగితాలూ అవీ పట్టుకుని వస్తానమ్మా. నువ్వేం బెంగపడిపోకు. మేమంతా ఉన్నాంగా' అని ఎంతో దయగా మాట్లాడారు లాయరుగారు. ఆయన చూపిన అనునయానికి మరింత దుఃఖం పొంగు కొచ్చింది లలితకి. అలాగే అని చెప్పి ఫోను పెట్టేసి —వచ్చి మంచం మీద బోర్లా పడుకుని చిన్న పిల్లలాగా ఏడ్చేసింది.

తనకి జ్ఞానం వచ్చిన దగ్గర నుంచి అత్తయ్య తప్పించి ఎవరినీ తెలియదు. ఒక మేనమామ అప్పుడప్పుడు వచ్చి చూసి వెడుతూ ఉండేవాడు. ఆ మామయ్య కూడా తనకి వయసు వచ్చాక రాలేదు. తను మళ్ళీ ఆయనని చూడనేలేదు. 'ఒంటరిగాడు ఏదో

వ్యాపారంలో బాగా సంపాదించాడు. తిరిగి ఎప్పుడు వస్తాడు' అనేది అత్తయ్య. అలాంటి మామయ్య ఓ రోజు పోయాడని అత్తయ్య చెప్పేదాకా తెలియలేదు లలితకి. ఇప్పుడీ పెంచి పెద్దచేసిన అత్తయ్య కూడా కనుచాటై పోయింది. తనెంత ఏకాకిగా బ్రతకాలో ఊహించుకున్న కొద్దీ దుఃఖం ఎక్కువైంది లలితకి—

పది గంటలు ఇట్టే అయింది. అవ్వగారు లాయరుగారిని హాల్లో కూచోబెట్టి లలితని పిలిచారు. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచి పోయాయి. చెదిరిన జుట్టుతో శోక మూర్తిలాగా ఉంది లలిత. 'తల్లీ నీకు వచ్చిన కష్టం నేను ఊహించుకోకల నమ్మా' అంటూ లలిత రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని కుర్చీలో కూర్చో పెట్టారు లాయరుగారు.

'అత్తయ్య ఎంత మోసం చేసి వెళ్ళి పోయిందండీ' ఏడుస్తూనే అంది లలిత.

'చావు చెప్పి వస్తుందా పిచ్చిదానా. ప్రియ బంధువుల కోసం బాధ పడడం అన్నది తప్పదు. కాని బ్రతికి ఉన్నందుకు మనకి కర్తవ్యం అంటూ ఒకటి ఉంటుందిగా. అది మరచి పోకూడదు. అంటూనే బ్రీఫ్‌కేసులోంచి కాగితాలు బయటికి తీశారు వెంకట్రామయ్యర్. 'చూడు లలితా మీ అత్తయ్య చాలా ఇంగితం కల వ్యక్తి. అటువంటి దూరదృష్టికల ఆడవాళ్ళు చాలా అరుదమ్మా. ఆమెగారు నీతో కించిత్తయినా చెప్పకుండా దాచిన విషయాలు చాలా ఉన్నాయి.' అన్నారు వెంకట్రామయ్యర్.

'నాకు తెలుసండీ అత్తయ్య అప్పుడప్పుడు చెప్తూవుండేది. ఒకవేళ తనకేదైనా జరిగితే వెయ్యిరూపాయల దాకా కర్చుకి మీదగ్గర వాడుకోమనేది... నిజంగానే ఇలా జరుగుతుందని ఊహించలేకపోయాము' లలిత కంఠం ఏడ్పుతో పూడుకుపోయింది. 'పిచ్చితల్లీ నే చెప్పబోయిన విషయం అది కాదు. ఆవిడ ఈవిధంగా పోవడం చాలా విచారకరం అనుకో. కాని ఇలాంటి విషయాలు ఎంత విషాదంలో ముంచినా బ్రతికి ఉన్నవాళ్ళపట్ల మనం శ్రద్ధ తీసుకోక తప్పదు కదా. నీ విషయమే చూడు...'

లలిత ఆయిన ముఖంలోకి విప్పారిన కళ్ళతో చూసింది.



'నీ విషయమేమాడు నీ అత్తయ్య ఎన్నో విషయాలు నీకు తెలియకుండా దాని పెంచి పెద్దదాన్నిచేసింది నిన్ను...ఆవిడ ఉద్దేశ్యాలు ఆవిడవి. అలాంటి వాటిలో ఒకటేమిటో తెలుసా...మనిషికి శీలం చాలా ముఖ్యం. డబ్బుంది నాకేం అన్న ధోరణిలో పెరిగితే అది దెబ్బతింటుందని నమ్మిందామె. అందు కనే కదమ్మా నీకు చదువుచెప్పించి నీకాళ్ళ మీద నువ్వు నిలబడేలా చూసింది? నీకీ సంగతి షాక్‌గానే ఉండవచ్చు. నీ అత్తయ్య ఆస్తి యావత్తూ నీకే వస్తుంది. అంతే కాదు నీ మేనమామ పోతూపోతూ తన ఆస్తిని నీకు రాయడమే కాకుండా అవసరం వస్తే ఆదుకునేందుకొక సంరక్షకుడిని కూడా నియమించాడు' ఆగారాయన. నోట మాటరాలేదు లలితకి. అలాగే కూర్చుండి పోయింది. వెంకట్రామయ్యర్ ఆప్యాయంగా లలిత భుజం తట్టుతూ అన్నారు. 'నీభవిష్యత్తుని గురించి నువ్వేం బెంగపెట్టుకోనక్కర లేదమ్మాయి. నిన్ను జాగ్రత్తగా చూసుకొనే వాళ్ళంతా ఉన్నారు. నీకు ఇరవై రెండేళ్ళు వచ్చేదాకా నీ ఆస్తిపాస్తుల విషయాలు నేనూ నీ మేనమామ నియమించిన శాస్త్రి గారూ చూసుకుంటాం.

'మళ్ళీ నాకు సంరక్షకుడా' ఆశ్చ ర్యంగా అడిగింది లలిత.

'నేనిక్కడే ఇదే ఉద్యోగంలో కాలక్షేపం చేస్తానండీ' అంది.

'లేదమ్మా, శాస్త్రిగారికీ ఉత్తరం రాశాను. శాస్త్రిగారు మీ మేనమామకు చాలా కావలసిన స్నేహితుడు. ఐశ్వర్యవంతుడు. మంచి సంప్రదాయకమైన కుటుంబం లోంచి వచ్చాడు. వీలైనంత త్వరలో నిన్ను వారింటికి చేర్చే బాధ్యత నాది. వాళ్ళు నీ మేలు కోరేవారు. నిన్ను తమ యింట్లో వ్యక్తిగానే చూడగలిగి ఉన్న వాడమ్మా శాస్త్రి' వివరంగా చెప్పారు లాయరుగారు.

'అది కాదండీ, జరిగినదేదో జరిగి పోయింది. నా జీవితంలో నేను ఎలాగో సర్దుకుని కాలంవెళ్ళబుచ్చగలను. ఈమార్పు లెందుకని? నాకు జ్ఞాపకం వచ్చాక ఈ ఊరు వదిలి వెళ్ళలేదు. పరాయి ఊళ్ళో నేను ఉండలేనండీ' బాధగా అంది లలిత.

'కాదమ్మా. అలా అనకు. ఉన్నవూరే స్వంత ఊరవుతుంది. రేపు పెళ్ళిచేసు కుంటే అత్తవారి ఊరు వెళ్ళవా?...నీ ప్రయాణానికి అన్నీ సిద్ధం చేస్తాను... అప్పటిదాకా అవ్వగారివే సాయం ఉంటా మను. ఇంద...' అంటూ ఐదొందలరూపా యలు చేతికి అందించారు లాయరుగారు. 'వెళ్ళలోగా ఏమైనా బట్టా పాతా కొత్త లిస్తే కొనుక్కో...' తన పని అయినట్టు లేచారు లాయరుగారు.

లలితకూడా లేచి నిలబడింది.

'తప్పదంటారా?' అడిగింది.

'నీ మేనమామ నిన్నెంత అభిమానించే వాడో నీకు తెలియదమ్మా, మీ అత్తయ్యని ఎన్నోసార్లు అడిగాడు నిన్ను తనే పెంచ డానికి ఇమ్మని.కాని ఆడ దక్షతలేని చోటని పంపలేదు. ఆయన ప్రియస్నేహితుడు నిన్ను ఆయనంతా అభిమానిస్తాడు. సందేహించకు' కాగితాలు సద్దుకు ని బయలుదేరారు లాయరుగారు. వీధి గుమ్మందాకా ఆయనని సాగనంపి లోపలికి వచ్చి కుర్చీలో కూలబడింది లలిత. ఎంతలో ఎంతమార్పు! అనుకుంది. మార్పేముంది? పంజరంలోనుంచి పంజరంలోకి మారడ మేగా? విషాదంగా నవ్వుకుంది.

తను ఐశ్వర్యవంతురాలు.

తను ధనవంతురాలు! అయినా స్వేచ్ఛ లేదు.


ధనం కొనలేదు తను కోరే స్వేచ్ఛని.

వారసురాలనని తెలియగానే మోహన్ లలిత మనస్సులో మెదిలాడు. 'పాపం! మోహన్' అనుకుంది.

'నాకీ ఆస్తి అంతా వస్తుందన్న సంగతి ఓ రోజు ముందు తెలిసినా ఈ క్షణంలో ఇక్కడ వచ్చి వాలును!' అనుకుంది. కాని తనతన్నీ చుట్టుపక్కలకి రానివ్వదు.

అతని స్నేహం జ్ఞాపకం లేదు లలితకి. కాని అతను తనలో రేపిన అశాంతి నిత్య నూతనంగా ఉంటుంది.

మోహన్‌ని ప్రేమించలేదు లలిత. అత గాడు తనలో సృష్టించిన పంచవన్నెల కలని ప్రేమించింది. కల్మషం ఎరుగని హృదయం అందించగల తొలి ప్రేమ అది. ఆలోచన లకి తావివ్వని, దూరదృష్టి సారించనివ్వని తొలి వలపు అది. అది సమసిపోయింది. ఆ కల పొరల క్రిందనుంచి ప్రపంచాన్ని చూసి మోసపోయింది. కాని ఇప్పుడా పొరలు చీలాయి. వాస్తవం కొట్టినట్టు కనబడు తోంది. ఇక తననెవరూ నమ్మించలేరు, మోసం చేయలేరు. నిండైన వ్యక్తి తనని



ప్రేమించు ప్రేమకై

ఆలోచనలలో ముంచకలడేగాని, వేలికి కాలూనకుండా ఊపిరి సలపకుండా కలలలో ముంచెత్తలేదు ! ప్రేమ దేవతకి కూడా మెట్టలోనే ఉంటాయి కొళ్లన్న సత్యం ముళ్లదారివెంట నడిచి మరీ గ్రహించింది లలిత...

ఆలోచనలకి స్వస్తి చెప్పి ఆఫీసుకి బయలుదేరింది లలిత. ఆఫీసులో అంతా సానుభూతి చూపేవాళ్లే. ఆ సమయంలో, ఇంతమంది స్నేహితులు ఉన్నారని తెలిసి వున్న తరుణంలో ఉద్యోగం వదలి పెట్టాలని అనిపించలేదు లలితకి, కాని రిజైనివ్వక తప్పదు. రెండురోజులలో రిలీవ్ చేస్తానన్నారు ఆఫీసువాళ్లు.

ఆ రోజునుంచి మొదలుపెట్టింది లలిత ప్రయాణానికి సర్దడం. ఏమీ లేవనుకున్నా రైలుకు వెళ్లేదాకా సర్దడం పూర్తి కానే లేదు. అవ్వగారు లాయరుగారు వచ్చి రైలెక్కించారు.

'నిన్ను దింపుకోమని ఉత్తరం వ్రాశాను. ఏం ఫరవాలేదు. చేరగానే ఉత్తరం రాయమ్మా,' అన్నారు రైలు కదలబోయే ముందు లాయరుగారు.

'ఏమండీ, అవ్వగారు నాదగ్గిరే ఉండి పోతారు. నేనీ ఊరు వదలకుండా ఉండ కూడదా.?' అడిగింది లలిత.

లాయరుగారు నవ్వుతూ లలితచేయి తన చేతిలోకి తీసుకున్నారు.

'మరేం ఫరవాలేదు. కొద్దిరోజులు పోతే నువ్వే రాస్తావు. ఆఊరు ఎంత బాగుందో. శాస్త్రిగారి ఇల్లు అంటే ఎలా ఉంటుందో నీ ఊహ కందడంలేదు. వారా ప్రాంతాలకి మకుటంలేని మహారాజులమ్మా' ఇంకా ఏదో చెప్పబోతూండగానే కూతపెటి రైలు బయలుదేరింది.

కనుమరుగయేదాకా అలా అవ్వగారి కేసీ లాయరుగారికేసి చూస్తూ కూర్చుంది లలిత...అంతా దూరమైపోయారు. రైలు కూడా స్పీడు అందుకుని ముందుకి దూకి తూంది. రైల్లో ఉన్నంతసేపూ తనకు తను ధైర్యం చెప్పకుంది లలిత.

గడచిన జీవితాన్ని నెమరు వేసుకుంది.

'ఏది ఏమైనా ఎవరూ నన్నిక బంధించి ఉంచలేరు. నాలోకూడా వ్యక్తిత్వం పెరి గింది' అనుకుంది.

* * *


ఆ ఊరులో రైలు ఆగేసరికి ఉదయం పదిగంటలయింది. ఒక్క కుదుపుతో లేచి నిలబడింది లలిత.

పెట్టెలోంచి దిగి కొత్త గడ్డమీద కాలుపెట్టింది. హడావిడిగా సామానులు దింపేస్తున్నారు కూలివాళ్లు...

'ఇదొక కొత్త జీవితానికి నాంది' అను కుంటూ స్టేషను అవతలకి నడిచింది లలిత...

స్టేషను అవతల రకరకాల బళ్లు పోటీపడి బేరాలాడే ప్రయాణీకులు, ఒకటే గోలగా ఉంది. తన కోసం వచ్చినవారు ముందుకి రాకపోతారా అని ఎదురు చూస్తూ ఒక పక్క నిలబడింది లలిత. కూలివాడు సామానంతా గుట్టగా పక్కనే పెట్టి కూలి డబ్బు కోసం తొందరపడుతున్నాడు. చేతి సంచిలోంచి డబ్బు తీసి వాడికి ఇచ్చింది. 'ఏదైనా బండి చూడమంటారా అమ్మాయిగారూ' అడిగాడు.

'నా కోసం వస్తామన్న వాళ్లకోసం చూస్తాను. పది నిముషాలు' అంది లలిత—చుట్టుపక్కల పరిశీలనగా చూస్తూ. నెమ్మదిగా స్టేషను దగ్గిర జనం పల్చ బడిపోయారు. రైలు దిగిన వాళ్లంతా తమ తమ గమ్యస్థానాలకి వాహనాలు బేరం ఆడుకుని వెళ్లిపోయారు. ఉసూరుమంటూ లలిత మాత్రం అక్కడ మిగిలిపోయింది. 'లాయరుగారు మరీ మరీ చెప్పేరే — తప్పకుండా ఎవరైనా స్టేషనుకి వస్తారని' అనుకుంది. అప్పుడే రైలు దిగి అరగంట దాటిపోయింది. కాని ఎవరి జాడా లేక పోయేసరికి ఎక్కడలేని బెంగా ముంచుకు వచ్చింది. ఇంకో పది నిముషాలు చూద్దా మని నిశ్చయించుకుంది. అప్పటికే అటూ ఇటూ తిరిగే పనిలేని కుర్రవాళ్లూ, పెద్ద వాళ్లూ కూడా లలిత కేసి వింతగా చూస్తున్నారు. ఇదేమిటిక్కడ నిలబడి పోయింది? అన్నట్టు. స్టేషనులోకి వెళ్లి




'పస్మాత రేపు వెళ్దాం అన్నా...అంతే!'

స్టేషను మాస్టరు గది దగ్గిరకి వెళ్ళింది లలిత. 'ఏం కావాలండీ?' అని ఆత్రంగా అడిగారాయన. లలిత నెమ్మదిగా ఆయనకి తన కష్టం చెప్పుకుంది. 'వారెవరైనా తప్పకుండా రావలసిందే. కాని ఉత్తరాల పొరపాటు వల్లనో ఏమో ఎవరూ వచ్చినట్టులేదు. ఎవరినేనా పంపి బండి మాట్లాడి పెడతారా?' అని అడిగింది.

'నీకు కరెక్టు అడ్రసు తెలిస్తే చెప్పమ్మా, ఓ టాక్సీవాడికి చెప్పి, తిన్నగా నిన్ను అక్కడ దింపమంటాను' అంటూ స్టేషనుమాస్టరు గది దాటి బయటికి వచ్చారు. హాండ్‌బాగులోనికి చెయ్యిపెట్టి తన గార్డియను చిరునామా కల కార్డు తీసి స్టేషనుమాస్టరు చేతిలో పెట్టింది లలిత. అది చూసి అదిరిపడ్డంత పనైంది స్టేషనుమాస్టరుగారికి. 'పోలయ్యా' అంటూ ఒక్కకేక పెట్టారు. వారి నమ్మినబంటు పోలయ్య ప్రత్యక్షం అయ్యాడు. 'నమ్మకస్తుడైన ఓ టాక్సీవాణ్ణి తీసుకురా అమ్మాయిగారు శాస్త్రిగారు ఎస్టేటుకి వెళ్ళాలిట' అన్నారు. అంతే వాడోసారి విచిత్రంగా లలితకేసి చూసి టాక్సీవాడికోసం పరుగెత్తాడు...వీరి ప్రవర్తనలో మార్పుని గుర్తించిన లలిత 'ఎవరీశాస్త్రిగారు బాబూ' అనుకుంది. సామాన్లు పెట్టేదాకా రామ్మా లోపల కూర్చో. ఇంతట్లో నేను శాస్త్రిగారికి ఫోను చేస్తాను' అన్నారు స్టేషను మాస్టరు.

'వద్దండీ. అక్కరలేదు. ఎలాగా ఓ గంటలో వెళ్ళిపోతానుకదా?' అంటూ లలిత వారించింది. ఎంతో నొచ్చుకుంటూ, 'ఎంతో పొరపాటై పోయిందమ్మా' అంటూ టాక్సీలోకి ఎక్కించి, ఒకటికి పదిసార్లు టాక్సీ వాణ్ణి హెచ్చరించి పంపారు స్టేషను మాస్టారు.

అప్పటికే లలితకి విసుగొచ్చింది. అసలిక్కడికి రావడం ఇష్టంలేని తనకు యీ వెల్‌కం లేకపోవడంతో కోపం వచ్చేసింది. ఆ ఇల్లు ఎంతదూరం అయినా, ఎంత దగ్గిరే అయినా లెక్కచేసే స్థితిలో లేదామె. తిరిగి తమ ఊరు వెళ్ళిపోయే అవకాశం చిక్కితే చాలు అనిపించింది. అసలిదంతా ఇలా జరగడంలోనే ఏదో దోషం ఉంది అనిపించింది లలితకి. ఎవడో బాబూ యీ చాదస్తపు ముసలిశాస్త్రి! అని ఎప్పుడూ తను చూడని తన గార్డియన్ని అసహ్యించుకోవడం ప్రారంభించింది. తన



ప్రేమించు ప్రేమకై

ఇక్కడికి రావడం ఎంత ఇష్టంలేదో — బహుశ ఆయనకీ అంత అయిష్టంగానూ ఉండే ఉంటుంది. లేకుంటే ఇలా స్టేషనుకి ఎవరిని పంపకుండా ఊరుకుంటాడా? అనుకుంది.

కొత్తగడ్డ మీద ఎంతని అనుభూతి చేదుగానే తోచినా కారు పోతున్న దారిలోని సుందర దృశ్యాలకి ఉప్పొంగి పోకుండా ఉండలేక పోయింది లలిత. బారులు తీరిన చెట్లు. దూరంలో కనీ కనిపించని కొండలు. స్వచ్ఛంగా నీలితెరలాగా ఉన్న ఆకాశం ... కన్నుల పండుగగా ఉన్నాయి. పట్నంలో ఉంటే ఇటువంటి ప్రకృతి సౌందర్యానికి మొహం వాచిపోక తప్పదు. ఎంతో అనాగరికంగా ఉండే ఇళ్ల వరసలు — బారులు తీర్చిన పెట్టెలలాగా ఉంటాయి. వైర్లకి అడ్డు అంటూ చెట్లు నరికేస్తారు. ఇళ్ల ముందు తోటలు కూడా అంతంతగానే ఉంటాయి. పూర్వం భవంతులకి సువిశాలమైన కాంపౌండులుండేవి. నాటి నీనాడు ఇళ్ల స్థలాలుగా అమ్మేసి డబ్బు చేసుకుంటున్నారు — ఇంటి అందం ఏమైతేనేం?... ఇక్కడి వాతావరణం కళ్లకి చల్లగా ఉంది. చెట్ల మానుల సందుల లోంచి దూరంలో పంటచేలు తలలూగిస్తూ వీస్తున్న గాలిని గుర్తుచేస్తున్నాయి. మనసులో ఎలా ఉన్నా ఇంత అందమైన పరిసరాలలోంచి కారు సాగిపోతూంటే మనస్సులో రేగిన ఆనందాన్ని అణచిపెట్టలేక పోయింది. పట్నవాసం చూసి చూసి మసకలు కమ్మిన కళ్లకి దృశ్యం స్వర్గ ద్వారాలు తెరచినట్లని పించింది. 'ఇక్కడే కొన్నాళ్లుంటే ఈ ప్రాంతాలన్నీ తిరిగి చూడాలి. హాయిగా ఆ కొండకోనలలో పరుగులు పెట్టి, ఆట పాటలు పాడినా ఎవరూ పట్టించుకోరనుకుంటాను.' అనుకుంది లలిత — తనలో చెలరేగిన ఊహలకి పైకే సన్నగా నవ్వుతూ. నీలాకాశాన్ని సన్నని కుంచెతో కడిగినట్లు ఎండ పరుచుకుంటూంది. ప్రకృతి సర్వస్వం పరిశుభ్రంగా స్పష్టంగా కనపడుతూంది. తమ బయలుదేరినప్పుడు సర్వం నిస్ప్రాణంగా నిరుత్సాహంగా అనిపించింది. మనసులోనూ ప్రకృతిలోనూ కూడా వసంతం అన్నదేదో మిథ్యగా తోచింది. కాని టాక్సీ కిటికీలోంచి కన్పిస్తున్న ప్రకృతి సౌందర్యం మబ్బులు లేని నీలాకాశం, బంగారు ఛాయలతో ప్రకృతిని పరచుకుంటూన్న సూర్యకాంతి అంతా కలిసి మనసులోని నిరుత్సాహాన్ని లలితకి తెలియకుండానే తరిమి కొట్టాయి. ఎంత చక్కని రోజా — అనుకుంది.

కారు సాఫీ రోడ్డుమీద అర్జెంటుగా సాగిపోతూంది. అక్కడా అక్కడా పెద్ద పెద్ద భవంతులు తోటలమధ్య కన్పిస్తున్నాయి. టాక్సీడ్రైవరు అక్కడక్కడ పేరు తెలిసిన ఇళ్లు చూపెడుతున్నాడు. 'మీరు వెళ్లబోయే ఇల్లు కూడా ఈ ప్రాంతాలలో చాలా పేరుగాంచినదే నమ్మగారూ. శాస్త్రుల్లుగారు అందరిమీదా కోపం చేసుకుంటారు — మిమ్మల్ని కల్సుకోడానికి ఎవరూ రాలేదని తెలిస్తే — అయ్యగారికి కోపంవస్తే ఎలా ఉంటుందో చాలాసార్లు విన్నానండి!' అన్నాడు తనలో తను నవ్వుకుంటూ. 'చాలా మంచివారే కాని కోపంవస్తే మనిషి కాదంటారు' అన్నాడు ఎంతో గౌరవంతో.


ఇంకా ఎన్నో విశేషాలు అడగాలనిపించింది లలితకి. కాని అడగడం సభ్యత కాదని కోరికని అణగద్రొక్కుకుంది. కంటికి కన్పడుతున్న సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ మౌనంగానే కూర్చుంది. 'కారు ప్రయాణం ప్రారంభం అయి ఓ మున్పావు గంట అవుతూంది. ఎత్తుగా ఉన్న ప్రహరీ గోడలతో చూడ గంభీరంగా ఉన్న ఓ ఇంటి కేసి కారు మళ్లించాడు డ్రయివరు. పెద్ద గేటు మూసివుంది. హారన్ వేశాడు. కారు కిటికీలోంచి కుతూహలంగా బయటికి తొంగి చూసింది లలిత — గేటుపక్క బోర్డు మీద ఏమైనా రాసి ఉందా అని. అంత పెద్దని కాని అక్షరాలతో 'కీర్తిపతాక' అని మాత్రమే రాసి ఉంది. బహుశా ఇంటి కాపేరు పెట్టారు కాబోలు — అనుకుంది — గేటు కొంచెంగా తెరుచుకుని ఎర్రని చీర ఎత్తికట్టిన ఓ మనిషి తొంగి చూసింది. 'ఎవరూ?' అంది గమ్మత్తుగా సాగతీస్తూ. ఇంతట్లో కిటికీలోంచి చూస్తూన్న లలిత కనబడ్డట్టుంది — 'అయ్యబాబో అమ్మాయిగారు వచ్చేసినట్టుంది కొంప మునిగింది' అంటూ గేట్లు బార్లా తెరిచి తోటలో ఓ పక్కగా ఉన్న చిన్ని ఇంట్లోకి పరుగెత్తింది 'రంగయ్య మామా' అంటూ అరుస్తూ. కారు ముందుకి సాగింది. నెమ్మదిగా పోర్టికోలో ఆపాడు డ్రయివరు. తన కళ్ల ఎదుట కనబడుతున్న సుందర


దృశ్యాన్ని ఊహించన నమ్మలేకపోయింది లలిత. పురాతనమైన కట్టడం — రకరకాల పూదీగలు అల్లుకుని పైపైకి పాకిపోయి గుత్తులు గుత్తులుగా పూసి గుబాళిస్తున్నాయి. ఎత్తుగా ఉన్న మెట్లకి ఇటూ అటూ పూలకుండీలు అమర్చి ఉన్నాయి. పైని వరసగా పూలతొట్లు వేలాడదీసిఉన్నాయి — వాటిలోంచి నాజూకుగా క్రిందికి వేలాడుతున్నాయి — అందమైన ఆకులూ పూవులూ. కింద నిలబడిచూస్తే అదంతా ఎవరో అదృశ్యులు అదృశ్య హస్తాలతో ఎత్తిపట్టిన దండలాగా తోచింది. లలితకి. సామాన్లు దింపి సలాం కొట్టాడు డ్రయివరు. యాంత్రికంగా డబ్బుయిచ్చి మెట్లెక్కసాగింది లలిత. ఇంతట్లోకే గేటు దగ్గిర చూసిన మనిషి ఇంకోమనిషిని వెంట పెట్టుకుని పరుగు పరుగున వచ్చింది— 'రండమ్మాయిగారూ, రండి. అయ్యా బాబో మీరెప్పుడో వత్తారన్నారండి' అంటూ హడలిపోయింది: ఆ అయ్యబాబో యీావిడ గారికి ఊతపదం కాబోలు అనుకుని నవ్వింది లలిత. 'నీపేరేమిటి?' అంది చేతికి తగిలిన పూలగుత్తిని వంగి ఓసారి వాసన చూస్తూ.


'రత్తి అమ్మాయిగోరూ' వాడు రంగయ్య మామ. మేం తోటోళ్లం. మీరేమో మిదుటికి కాక నావటి కొత్తారని చెప్పారండి. ఇల్లంతా ఒకటే హడావిడి. ఇక సరళమ్మగారైతే చెప్పనే అక్కర లేదు. సరస్వతమ్మగారొకటే 'ఊరుకోవే' అన్నా ఏదేదో చెప్తూనే ఉండారు—' అంటూ ఆగింది.

'వీళ్లంతా ఎవరు?' కుతూహలంగా అడిగింది లలిత, 'సరస్వతమ్మగారు అయ్యగారికి అత్తవుతారు. ఆయమ్మగోరి అమ్మాయిగారే సరళమ్మ. పట్నంలో చదివింది. మాబాగా వుంటారండి.' అంటూ గబగబ అడుగులేస్తూ ముందుకి సాగింది. 'మీరుండండమ్మా, నేవెళ్లి వంటావిడకిచెప్పి మీ గదులు తెరిపిస్తాను.' అంటూ లోపలికి అదృశ్యమైంది. రంగయ్య చూడబోతే చాలా నెమ్మదస్తుడిలా ఉన్నాడు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. సామానంతా పైకి తెచ్చి తన పనైనట్టు తలగుడ్డ విదిలించి మళ్లీ వచ్చిన దారినే వెళ్లిపోయాడు.

(ఇంకా ఉంది)







బస్టాపులో బంగారబ్బొమ్మలాంటి అమ్మాయి నుంచుంది. స్ఫురద్రూపి కాకపోయినా అలా కనపడాలని వేషం వేసుకున్న వో అబ్బాయి ఆమెకి కొంచెం దూరంలో నిలబడ్డారు. వాళ్ళతోపాటు నేనూ. నాకెందుకో అమ్మాయిని చూడాలనే అపేక్షకంటే ఆ అబ్బాయిని చూడాలనే తాపత్రయం ఎక్కువయింది.

బస్టాపులో అడుగెట్టానో లేదో కొరకొరా చూశాడు. నేను ఆ క్షణం విస్తుపోయిన మాట నిజం. ఈ శత్రుత్వం ఎక్కడిది? కనీసం ఇంతక్రితం మేమెప్పుడూ దార్లో ఎదురన్నా ఎదురవలేదే? మరి...?

వాకు అర్థమై పోయింది. కాంపిటీషన్నమాట...?

నేను పాలిచ్చి పిల్లాడులా ముఖం పెట్టుకుని ఆ ముఖాన్ని పత్రికతో దాచేసుకున్నాను. కాని, అబ్బాయిమీదే నా దృష్టి!

పద్దెనిమిదేళ్ళ పైనే వుంటుంది వయస్సు. చదువుందో లేదోగాని చదువుకున్నట్టే కనిపిస్తున్నాడు. జుట్టు నెలల తరబడీ క్షవరం చేయించుకోనట్టుగా (అతని కది 'బీటిల్స్ కట్' అయివుంటుంది) వుంది. రాత్రీ పగలూ తెలుస్తుందో లేదోగాని చలవకళ్ళ జోడుంది. దానికి ముఖాన్ని కప్పేసేంతటి పెద్ద పెద్ద అద్దాలు! కోరమీసాలు తిప్పి లంగరులాంటి గడ్డాన్ని నున్నగా దువ్వుకున్నాడు. పై బొత్తాలు విడిచిన బొమ్మల చొక్కాలో నుంచి ఛాతి కనిపిస్తోంది. చొక్కా చేతులు పిలియునంత సన్నగా మడిచాడు. దాన్ని దండల పైకెక్కించడానికి కుస్తీపట్టి వుంటాడు! ఒకచేతికి మురుగు (వెండా?). మెళ్ళో సన్నని గొలుసు (బంగారమా?) వాచీ మోచేతికీ మణికట్టుకీ మధ్య కట్టాడు. అంత టైట్‌గావున్న పాంటులోకి అతనికాళ్ళు ఎలా దూరాడో ఆ దేవుడికే తెలియాలి. అదీ, తుంటివరకూ మాత్రమే వుంది. ఎప్పుడో చెప్పి చెయ్యకుండా దిగజారి పోయేంత క్రిందికివుంది. బెత్తెడు వెడల్పున వెయిస్ట్‌బెల్టు. బూట్లు ఆయుధాల్లా మొనలు తేలి మెరుస్తున్నాయి. ఇన్ని అసౌకర్యాలతోనూ అతను కులాసాగానే కనిపిస్తున్నాడు!

అప్పుడప్పుడు బడాయిగా వాచీ చూసుకుంటున్నాడు. కళ్ళజోడు దిద్దుకుంటున్నాడు. జుత్తును చేత్తో రాసుకుంటున్నాడు. వెయిస్ట్‌బెల్టును ఇంకా క్రిందికి లాక్కుంటున్నాడు. పెదాల మధ్య అంటీ అంటనట్టు సిగరెట్టుంచి గుప్పుగుప్పుమనిపిస్తున్నాడు. ఏదో సెంటువాసనకూడా ఘుమ్ముమంటున్నది.

ఈ వేషం చూడగానే అతనెవరో పసిగట్టేశాను. రోమియో! ఆహా...ఎంత ఆకర్షణ!

అదేపనిగా బంగారబ్బొమ్మని చూస్తున్నాడు. కళ్ళతో తాగేస్తున్నట్టుగా చూస్తున్నాడు. నేనూ అమ్మాయిల్ని చూస్తాను. (అసలుచూడనివారెవరంట?) కాని, అంత బాహాటంగా కాదు. చూసీ చూడనట్టు. మరి ఇతనలాకాదు. ఎంత ధైర్యం? ఎంత చొరవ?

ఆ అమ్మాయిని చూశాను; మహా ఇబ్బంది పడిపోతుందనుకున్నాను. హాశ్చర్యం, ...లేదు...!

అయినా, ఎందుకో ఆ అమ్మాయి మీద అనవసరంగా జాలిపడి పోయాను. రోమియోగారి చూపు నావైపు తిప్పుకోవాలనుకున్నాను. పలకరించాలనే వూహాలో తేలిపోయాను.

'నమస్కారమండీ రోమియోగారూ... నాపేరు ఫలానా. నేను భలానా...' అన్నాను.

చెయ్యి కలుపుతాడనుకున్నాను. మూతి వంకరగాపెట్టి రెండుసార్లు పైకీ కిందికీ తలాడించాడు. 'హాయ్...' అన్నాడు. నా పలకరింపులో అంత హాయి వుందేమో!

'మీ పేరు తెలుసుకోవచ్చునా?'

పేరే అడగాలా?

'మీ రెక్కడుంటారు?'

ఇల్లయితే చాలా చాలా దూరంలో వుంది.

దానిపని మనకి భోజనానికి నిద్రకి మాత్రమే.

'మిమ్మల్ని ఎక్కడెక్కడ కలుసుకో వచ్చు ?'

ఇప్పుడిక్కడవుంటే, కాస్సేపటికి మరో బస్టాప్‌లో వుంటాను. ఇంకాస్సేపటికి సినిమా హోలుదగ్గర వుండొచ్చు. షాపింగ్ సెంటర్లూ, రైల్వేస్టేషన్లూ చూసుకుని దేవాలయాల్ని అదీ సందర్శిస్తూ వుంటాను. ముఖ్యంగా రద్దీగా వుండే ప్రదేశాలు నా సొంతవరం.

ఇన్ని పుణ్యకార్యాలూ పురుషకార్యాలూ నెరవేర్చ గల్గుతున్న అతన్ని, అభినందించి తీరాలి !

'చదువు కుంటున్నారా'

నాకు చదువేమిటి ? ఆడపిల్లల్ని అల్లరి పెట్టించడానికి తగిన చదువుంది. అయితే, మాలో చదువుకునే వాళ్ళూ లేక పోలేదు.

'మీ పని...!'

కనిపించడంలా ?

'మరి ఎలా గడుస్తుంది ?'

తెచ్చిపెట్టే తలిదండ్రులున్నారు. లేక పోతే అన్నదమ్ములున్నారు. బంధుజన మున్నారు. మాకేమోయ్...ఫ్రీ బర్డ్స్.

'మీ భవిష్యత్తుమాట...?'

దానిగురించి ఆలోచించే తీరిక నాకెక్కడుంది ? ఏ వయసులో ఎలా ఆనందించాలో నీకు తెలియదు. అందుకే నువ్విలా తయారయ్యావు.

'నా మాట అలా వుంచు. నువ్విప్పుడా అమ్మాయిని తినేస్తున్నావ్...పెళ్లి చేసుకుంటావా...?'

పెళ్ళా...? హహహహ్హా ... అలాంటి పదాలు నా డిక్షనరీలోనే వుండవు. కావాలంటే వెతుక్కో.

'పోనీ, ప్రేమిస్తున్నావా...?'

ప్రేమా...! అదేమిటి? ఏ బజార్లో దొరుకుతుంది? కిలో ఎంత ?

'మరెందుకీ శ్రమ ?'

నువ్వుత్తి ఫూల్‌వోయ్.

ఇది శ్రమా? థ్రిల్‌మై డియర్‌బోయ్... థ్రిల్! నీకేంతెలుసు వట్టి బీసీ రకం! అమ్మాయిల్ని ఏడిపించడంలో అందం తెలియని దద్దమ్మవు. అందులో ఆనందం ఎరగని దేభ్యానివి.

'నీతో పోల్చుకుంటే...నువ్వన్న మాటలు రైటే. అది సరే ... ఏ అమ్మాయియినా తిరగబడితే...?'

బొత్తిగా నీకు ఆడాళ్లంటే ఏం తెలియనట్టుగా వుంది. వాళ్లకీ ఇది థ్రిల్లింగ్‌గానే వుంటుంది. కావాలంటే అడిగి తెలుసుకో. నాకు టైం లేదు.

ఇందులో సత్యమెంతో నాకూ తెలుసుకోవాలనే అనిపించింది. బంగారబొమ్మను చూశాను.

'ఏమ్మా...రోమియోగారు ఇలా అంటున్నారు. నిజమా ?'

అమాయకులు గారూ ..., మా అమ్మా నాన్నా మమ్మల్ని చదువులు కోసం పంపుతున్నారు. లేదా; ఉద్యోగాల కోసం పంపుతున్నారు. అంతేగాని మేము ఆడపిల్లలమని అనుకోవడంలేదు. మమ్మల్ని నిర్విచారంగా వీధిలోకి పంపిస్తున్నారంటే మా తల్లిదండ్రులకి కొండంత ధైర్యం వుండబట్టే కదా ? ఎందుకో తెలుసా ? ఇరుగో మా బాడీగార్డులు ! రోమియోలకి మా వెంటపడడం సరదా అయితే — అది మాకు రక్షణ !

'బాగానే వుంది గాని ... మరి శ్రుతి మించితేనో ?'


మీకు పిచ్చా యేం...? అలాంటిదేమీ జరగదు. కావలిస్తే చూడండి.


రోమియోగార్ని చూసి నవ్వింది. రోమియో తెల్లముఖం వేశాడు. అతనిలో సంచలనం రేగినట్టు ప్రతి అవయవమూ ప్రస్ఫుటం చేస్తోంది. టెక్నికలర్ రంగులన్నీ ముఖంలో కనిపించాయి.

అదే సమయానికి ఆపద్బాంధవిలా రత్నాలరాసి ఒకామె వన్నెలు విరజిమ్ముతూ వచ్చి నిలబడింది. బంగారబొమ్మని రోమియోగారు విడిచిపెట్టేశారు ! బస్సొచ్చేసింది. బంగారబొమ్మా, ఆ వెనక నేమూ బస్సెక్కేశాము !

రోమియోగారు అక్కడే నిలబడి వున్నారు. రత్నాల రాసిని తినేస్తున్నట్టు చూస్తున్నారు...! ●




STUDIO:
ERANKI



(మూడవ భాగం)

గౌరీపతి, కిటికీలోంచి బయటకు చూశాడు.

స్టేషనూ, డేవిడ్‌తోపాటు జనం క్రమంగా దూరమవ సాగారు. ఆ కొద్దిపాటి వెల్తుర్లో అంతా చిన్న పురుగుల్లా కనిపించారు.

అవును! డేవిడ్ ఒక చిన్న పురుగు. అతన్ని తలచుకుంటే జాలేస్తోంది!

గౌరీపతి వొచ్చి సీట్లో కూర్చున్నాడు. అతని కెదురుగా నడివయసు దాటిన భార్యాభర్తలు కూర్చున్నారు. వాళ్ళు చాలా సంతోషంగానూ, చూడ ముచ్చటగానూ వున్నారు.

మేరీ డేవిడ్‌ను చాలా హీనంగా చూస్తోందన్నది నిజం! అతన్నొక భర్తగా కాకుండా సేవకుడిగా ట్రీట్ చేస్తోంది. ఈ నరకాన్ని ఏ మగవాడునూ భరించలేడు! నిజం ఇది. డేవిడ్ భార్యను అమితంగా ప్రేమించాడు. ఆమె చిరునవ్వు కోసం, మంచిమాట కోసం పరితపించే మనిషతను.

రైలు కదలబోయేముందు డేవిడ్ అన్న మాటలు మళ్ళీ గుర్తుకొచ్చాయ్!

పరాయివాడు తన భార్యతో చనువుగా ప్రవర్తిస్తే సహించలేడు! మేరీ ప్రవర్తన డేవిడ్‌కు తెలీక కాదు. ఆమె నడవడిలో మార్పువచ్చి తన్ను భర్తగా ఆదరిస్తుందని గుండెల్లో ఆశ పెంచుకున్నాడు. చాలా అందమైన రంగు రంగుల కలలు గన్నాడు. మధ్యలో తన రాకతో— అవన్నీ కోపంలో, కన్నీళ్లలో కరిగిపోయాయి!

మనిషి సహనానికీ, ప్రవర్తనకూ వొక హద్దంటూ వుండాలి. వాటిని దాటితే తిరుగుబాటు తప్పదు. డేవిడ్ ఈవిధమైన వేదనని భరించలేకపోయాడు.

అందుకే—

వెళ్ళిపోయేటప్పుడు ఆమాటలన్నాడు డేవిడ్! అప్పుడు గౌరీపతికి అంతులేని అభిమానం కలిగింది డేవిడ్‌మీద.

రైలు ఏదో స్టేషన్లో ఆగింది.

గౌరీపతి దిగి ప్లాట్‌ఫారంమీద కెళ్ళి సిగరెట్ ప్యాకెట్ తెచ్చుకున్నాడు. అటూ యిటూ తిరిగాడు. ఐదునిముషాల్లో భర్త భార్యను ఆనుకుని కునికిపాట్లుపడుతున్నాడు. ఆయనకు చలిగాలి తగలకుండా, ఆమె శాలువా కప్పి—

'ఫ్లాస్కులో కాఫీ వుంది. తాగుతారా?' అంది ఆప్యాయంగా.

'ఇప్పుడు తాగను' అన్నాడు.

ఇది చూసి గౌరీపతి సర్దుకూర్చుని హాయిగా గాలి పీల్చుకున్నాడు. సిగరెట్టు కాల్చుకుంటూ కళ్ళు మూసుకున్నాడు. అతని కెదురుగా మేరీ డేవిడ్ కనిపించారు. వాళ్ళిద్దరి మనస్తత్వాలూ—వికృతంగా తారట్లాడాయి. వాళ్ళిద్దరికీ యిక సరిపడదు. పొత్తు కుదరదు.

వాళ్ళిద్దరి జీవితాలూ— 'నిరాదరణ' అనే కథావస్తువు.

ఈ కథలో—

మేరీ అనే ఆడకూతురు యువరాణి. ఆయువరాణి పువ్వులో పుట్టింది. ఆ లత— అందంగా, హుందాగా, గర్వంగా పెరిగింది. తోడు వెదుక్కుంది. కార్లలో తుళ్ళిపడి తిరిగింది. వెనుకచూపు లేదు. అంతా ముందు చూపే.

ప్రేమించినవాణ్ని పెళ్లి చేసుకోలేక,

తండ్రి మాటమీద మరో అనామకుడ్ని (భార్యమాట దాటనివాడ్ని, ఇల్లరికంవుండే వాడ్ని) చేసుకుంది. డబ్బుకు ఆశించని వాడుండడు.

ఆవలలో చిక్కుకుపోయి దారి కనుపించక చీకటిని చూడలేక బల్లిలా అంటుకు పోయాడు డేవిడ్! పూర్ ఫెలో! ఆత్మనూ అభిమానాన్ని చంపుకుని మేరీ అనే భార్య చేస్తున్న చేష్టల్ని ఖండించలేక సతమత మవుతున్నాడు.

తాను కోరుకున్నది తీరలేదనే కసికొద్దీ, అందమైన బ్రతుకులో ఏదో సాధించాలనే పగ కొద్దీ చీకటిని కొని తెచ్చుకుంటోంది మేరీ!

డేవిడ్ ఇవన్నీ సహించాడు!

చివరకు—

అతని కళ్లెదుటే ప్రేమించిన వాడ్ని రప్పించి అతనో సంచరించిన భర్తను అవమానించింది. నిర్లక్ష్యమూ చేసింది. మనసు విరగడానికింతకంటే ఏం కావాలి?

అదే భర్త మరో ఆడదానితో తిరిగితే భార్య సహించలేదు! ఈ ఆలోచనలు రాగానే గౌరీపతి ఉలిక్కి పడ్డాడు. అతని ఊహల్లో శారద నిండుగా కనుపించింది.

గౌరీపతి సరిగా కూర్చుని కంపార్ట్మెంటంతా చూశాడు. అతని కెదురుగా కూర్చున్న ఆ దంపతులు ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

రైలు శబ్దం, కూత తప్ప ఆ రాత్రిలో ఇంకేమీ వినిపించడం లేదు. తన మనస్సు రైలు శబ్దంలాటి ఆవేదన్ని సూచిస్తోంది.

శారదను తను ఎప్పుడూ భార్యగా చూడలేదు. కనీసం ఆప్యాయంగా మాట్లాడి కూడా ఎరగడు! శారదని మానసికంగా కృంగదీశాడు. విందుగా నవ్వుకోవడం, మనసులు విప్పి మాట్లాడుకోవడం ప్రతి భార్య భర్తనుంచి ఆశిస్తుంది. వాటి నన్నిటినుంచీ శారదను దూరం చేశాడు.

ఎన్ని మాటలన్నా ఓర్పుతో సహించి పెదవుల మీద చిరునవ్వు కురుపిస్తూ వుండేది. ఒకవేళ, శారద ఎదురు తిరిగి సమాధానం చెబితే తన మగతనం ఏం కావాలి?

గౌరీపతి చేతిగుడ్డతో ముఖం తుడుచు కున్నాడు. కిటికీలోంచి బయటకు తొంగి చూశాడు. అంతా చీకటి. ఆ చీకటిని చీల్చుకుంటూ రైలు పరుగెడుతోంది. తనింత కాలం గుండె కార్నర్లో చీకటినే పెంచుకున్నాడు. అదీరోజుతో అంతమవు తుంది. ఆ స్థానంలో శారద వెన్నెల కురి పిస్తున్నట్లుగా జీవితాంతం నవ్వుతూ వుంటుంది. తనకంతకంటే ఇంకేం అక్కర్లేదు!

మేరీ డేవిడ్ల బ్రతుకే 'నిరాదరణ' అను కున్నాడు. ఒక విధంగా తమ జీవితాలు కూడా 'నిరాదరణ' లాటివే. అక్కడ మేరీ! ఇక్కడ తనూ!! ఆ నిరాదరణ ఈ రోజుతో ఆదరణగా మారిపోతుంది.

గౌరీపతి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. తన కెదురుగా నిద్రపోతున్న ఆ దంపతుల్ని చూసి—

'ఈబంధం ఇలాగే వుండిపోవాల'ను కున్నాడు.

ఈ క్షణంలో గౌరీపతి మనసూ, శరీరం యావత్తూనూ శారద ముందు వాలాలని వుంది.

* * *

గౌరపతి స్టేషన్లో దిగాడు.

రిక్షాకూడా బేరం ఆడకుండా అడ్రస్ ఇచ్చి వేగంగా పోనిమ్మన్నాడు. అతని హృదయమంతా శారదమీది ప్రేమతో నిండిపోయింది. రిక్షాలోంచి దిగి వాడికో రూపాయిచ్చి గబగబా లోపలకెళ్లాడు.

శారద సోఫాలో కూర్చుని పుస్తకం చదువుకుంటోంది. బూట్లశబ్దం విని తలెత్తి చూసి లేచి నుంచుని—

'ఇదేనా రావడం?' అంది.

గౌరీపతి నవ్వుతూ భార్యకేసి వింతగా చూడసాగాడు.

'రాత్రల్లా నిద్రలేదనుకుంటాను. స్నానా నికి నీళ్లుతోడతాను. కాఫీ పెడతాను. అంతా క్షణంలో జరుగుతుంది' అని లోపలి కెళ్ల బోయింది.

గౌరీపతి రెండడుగులు ముందుకువేసి—

'శారదా' అన్నాడు ఆప్యాయంగా.

ఆ పిలుపుకు శారద పరవశించిపోయింది.

'శారదా! అప్పుడే తొందరలేదు ఇవేళ నేను కాలేజీకి వెళ్లను మాట్లాడుకుంటూ కూర్చుందాం. రా శారదా' అని సోఫాలో కూర్చున్నాడు.

భర్త ప్రవర్తనకు శారద ఆశ్చర్యపోయి అతని ముఖంలోకి చూసి తలొంచుకుని వచ్చి ప్రక్కన కూర్చుంది.

గౌరీపతి, శారద భుజంమీద చెయ్యి వేసి—

'సినిమాకెడదాం' అన్నాడు.

శారదకు ఇదంతా ఒక కలలా అనిపిం చింది.

'మీరు వెళ్లిన పని సవ్యంగా జరిగిందా? అక్కడ మీకేమీ ఇబ్బంది కలగలేదు గదా?' అంది.

'శారదా! ఈ ప్రయాణంవల్ల నేను బతుకంటే ఏమిటో తెలుసుకున్నాను. ఇంత కాలం ఈ ఇంట్లో వెలుగుని చూడలేక పోయాను. నేను చాలా దారుణంగా ప్రవ ర్తించాను అందుకు సిగ్గుపడుతున్నాను.'

శారద నిలువెల్లా పరవశించి గౌరీపతి నుంచి తప్పించుకుని లోపలకు పరుగెత్తింది!

ఆ సాయంత్రం—

ఇద్దరూ కలిసి సినిమాకెళ్లి హోటల్లో భోజనంచేసి ఇంటికొచ్చారు.

గౌరీపతి పడుకోబోయేముందు...

'శారదా! నేనంటే నీకెప్పుడూ కోపం, అసహ్యంకలగలేదా?' అన్నాడు.

'ఎందుకు?'

'నిన్ను చాలా హింసించాను. ఎక్క డెక్కడో తిరుగుతూ ఎప్పుడో ఇంటి కొచ్చేవాడ్ని. కోపగించుకుంటూ వుండేవాడ్ని, తిడుతూ కూడా ఉండేవాడ్ని.'

శారద నవ్వి—

'మిమ్మల్నెప్పుడూ ఏమీ అనుకోలేదు. నన్నీ ఇల్లు వదలిపెట్టి వెళ్లమనలేదు. నాకదే ఆనందంగా వుండేది. అలా మీరంటే నా గతేంకాను?' అంది.

'శారదా! ఒక భార్యకు ఎన్నెన్నికోర్కెలు, ఆశలు, ఊహలు వుంటాయో తెల్సుకుంటు న్నాను. వాటిని తీర్చడం భర్త ధర్మం. నేనెక్కడికి వెళ్లానో నీకు తెల్సు. అక్కడేం జరిగిందో చెప్పనా?'

'మీ యిష్టం.'

జరిగిందంతా గౌరీపతి చెప్పి—

'శారదా! నీతో అబద్ధం ఆడాలనే ఉద్దేశం నాకు లేదు; కష్టమైనా, సుఖ మైనా మనిద్దరమే భరించాల్సి వుంటుంది ఇకనుంచి!' అన్నాడు.

శారద నవ్వుతోంది.

'నిజం శారదా! అలా నవ్వకు. నామీద నమ్మకంలేదా? ఒట్టు శారదా. నేను

ఖర్మం గౌరీపతిని కాను.'

'మీరు మరీ చిన్నపిల్లాడయి పోతున్నారండీ' అంది శారద, గౌరీపతి జుట్టు నిమురుతూ.

* * *

శంకర్రావ్ కాంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

'హల్లో! గుడ్‌మార్నింగ్ శంకర్రావుగారూ!' అన్నాడు గౌరీపతి నవ్వుతూ.

'హలోలో! ఎప్పుడొచ్చారు? ఏమిటి విశేషాలు?' ప్రక్కన సీటు చూపించాడు. మరో కాఫీకి ఆర్డరిచ్చాడు.

'రెండురోజులైంది వచ్చి.'

'రెండురోజులైందా? మరి కనుపించనే లేదు.'

'చాలా బిజీగా వున్నానండి.'

ఇంతలో కాఫీ వచ్చింది. గౌరీపతి అందుకుని సిప్ చేస్తూ—'అనుకోని విధంగా చాలా జరిగాయి శంకర్రావుగారు, మీతో చాలా విషయాలు మాట్లాడాలి' అన్నాడు.

వాళ్ళు మాట్లాడుకుంటూ వుండగా సోమయాజులు నీట్‌గా డ్రస్సయ్ వచ్చి విష్ చేశాడు.

'ఏమిటి గురువుగారూ! ఎక్కడా అయిపు లేదు. మీరు లేకపోతే బొత్తిగా చిన్నబోయింది కంపెనీ' అన్నాడు గౌరీపతిని ఉద్దేశించి.

నీలాంటి ఒకరు...

గౌరీపతి నవ్వి వూరుకున్నాడు.

శంకర్రావు, సోమయాజులు కేసి చూసి—

'ఫస్ట్‌వర్ లేదా?' అన్నాడు.

'లేదు. లాస్ట్‌వర్ మాత్రమే వుంది. మధ్యాహ్నమంతా ఆఫ్'! అన్నాడు.

గౌరీపతి వాచీ చూసుకుని లేచి రెండడుగులు ముందుకు వేశాడు. సోమయాజులు, గౌరీపతి చెయ్యిపుచ్చుకుని ఇవతలకు తీసుకొచ్చి—

'గురూగారూ! రాత్రికి మంచి పండుగ చేద్దాం. మీరు కల్సి చాలా రోజులైంది' అన్నాడు.

'సారీ సోమయాజులూ! నేనికనుంచి తాగదలచుకోలేదు. అలా అంటున్నానని మరోలా అనుకోవద్దు.'


'అదేమిటలా అంటున్నారు?'

'తాగడంలో వున్న సుఖం కంటె మా ఇంట్లో వున్న వెలుగే నాకానందం. మరి మీరంతా ఎందుకిలా...?'

సోమయాజులు నవ్వాడు.

'తర్వాత కలుద్దాం వస్తా' అని గౌరీపతి, శంకర్రావు కూర్చున్న సీటుకేసి నడిచాడు.

'ఏమిటంటున్నాడు సోమయాజులు రమ్మ



నేనా?'

గౌరీపతి నవ్వి అవునన్నట్లు తలూపాడు. శంకర్రావు గంభీరంగా మారి—

'గౌరీపతిగారూ! మీరు తాగడం నేను సహించలేను. సోమయాజులు ఎటువంటి వాడో మీకు తెలీదు. అతను చాలా క్రూరమైన మనిషి. సాధించాలనుకున్నది నెరవేరితే గాని పట్టు వదలడు. వొద్దు. అతని స్నేహం మీ కొద్దు' అన్నాడు.

గౌరీపతి విచిత్రంగా చూశాడు.

'అవును గౌరీపతిగారూ! సోమయాజులు నా కెప్పటినుంచో స్నేహితుడు. అతన్ని మార్చాలన్న నా ప్రయత్నాలన్నీ మంటగలిసి పోయాయి. మీరతనో తిరగొద్దు.'

'అవును సోమయాజులుగురించి ఎక్కువ మాట్లాడుకోవడం మంచిదికాదు అతన్ని మర్చిపోదాం.'

'వెరీగుడ్! ఈ మాటొక్కటే చాలు. సాయంత్రం సినిమా కెడదాం?' అన్నాడు.

'సారీ! సాయంత్రం మా ఆవిడతో సినిమా కొస్తానని మాటిచ్చాను. నా కోసం చూస్తూ వుంటుంది.'

'ఇప్పుడు చాలా సంతోషంగా వుంది గౌరీపతిగారు.'

'రేపు మా ఇంటికి రండి ఇన్నాళ్ళో మా శ్రీమతి వంట రుచి చూసే భాగ్యం కలగలేదు మీకు. రేపు ఆ భాగ్యానికి నోచుకోండి' అన్నాడు గౌరీపతి.

* * *

ఆ రాత్రి—

సోమయాజులు ఎన్నడూ తాగనంతగా తాగేశాడు. వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. అతనొక్కడే గదిలో చాపమీద కూర్చుని గోడకు ఆనుకున్నాడు.

అతనికిప్పుడు చాలా ఆందోళనగా వుంది.

గది స్పష్టంగా కనిపిస్తున్నా కళ్ళు తేలిపోతున్నాయి.

జీరోవాట్స్ బల్బు గుండెల్లో అసంతృప్తిలా వుంది.

మెమ్మదిగా ఏదో ఇంగ్లీషు పాట పాడసాగాడు. లేచాడు. కాళ్ళకింద భూమి కదుల్తున్నట్లుగా వుంది. తలంతా ఆలోచనలతో బరువుగా వుంది. ఆలోచనలచుట్టూ తను తిరుగుతుంటే తనచుట్టూ గ్రాండీ తిరుగుతోంది! టేబుల్‌మీదున్న బాటిల్లోది కొస్త గ్లాసులోకి వంపుకుని గడగడా



కొత్త
సూపర్ సర్ఫ్
అత్యంత అమిత తెల్లగా ఉతుకుతుంది
NEW! SUPER Surf
FOR SUPER WHITENESS
సూపర్ సర్ఫ్ అత్యధిక ఉతికే శక్తిని కలిగియున్నది! సూపర్ సర్ఫ్ మీ దుస్తులన్నింటి మురికిని పారద్రోలుతుంది— ఎంత ఎక్కువగా మాసిపోయినవైనా సరే. సూపర్ సర్ఫ్ కానరాని మురికిని సహితం తొలిగించేస్తుంది. ఇంక మీ బట్టలన్నిటికీ మెరయుచుండే తెలుపును కలిగిస్తుంది, తెలుపుచేసే పౌడర్‌ను చేర్చక్కర్లేదు. మీ అత్యధిక బట్టలను ఉతుకుట కూడ సూపర్ సర్ఫ్‌తో సులభం. మరి ఆనందకరం కూడా. ఆ తాజా పరిమళాన్ని ఆఘ్రాణించండి — ఇంకే ఇతర ఉతికే పౌడర్ ఇంత సౌకర్యమును సమకూరుస్తుంది!
హిందుస్థాన్ లీవర్ వారి విశిష్టమైన ఉత్పత్తి

తాగేశాడు.

[ఈ అందమైన రాత్రి నా కోసం ఉద్దేశింపబడింది. అందుకే సోమయాజులవే ఓ ఫుల్ అతిదారుణంగా తాగేశాడు తాగడం ఇలా అలా కాదు. గుండెలు పగిలి చచ్చేట్టు. సోమయాజులంటే అందరికీ దుర్మార్గుడు. నీచుడు. అతనిలో వున్న మరో మనిషిని ఎవరూ చూడలేరు. చూడ్డం ఎవరికీ చేతకాదు. అది వాళ్ళ తరంకాదు.

యస్! దిగులుపడకు సోమయాజులూ. నీ సంగతి నాకు తెలుసు. నువ్వు మంచి వాడివి.]

సోమయాజులు హఠాత్తుగా తలుపులు తీసుకుని బయటకు వచ్చేసి నడవసాగాడు.

అప్పటికి అమావాస్య వెళ్ళి రెండు రోజులు కావడం వల్లనూ, వీధి దీపాలు లేకపోవడం వల్లనూ దారంతా చీకటిగా వుంది.

తలంతా తిరుగుతోంది. కళ్ళ ముందు దారి కనుపించడం లేదు. గతం అతన్ని కలవర పరుస్తోంది. అప్పుడతను బిగ్గరగా నవ్వుకున్నాడు.

[నేను ది గ్రేట్‌ని. సోమయాజులూ! నువ్వు గొప్పవాడివి. గొప్పవాడివే కాదు. మనసుని జయించిన ధీశాలివి. నా జే జే లందుకో.]

సోమయాజులు చాలా దూరం వచ్చేశాడు. ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

నీలాంటి ఒకరు ...

వున్నట్టుండి అతని కెందుకో గుండెలు విసి పోయేలా యేడ్వాలనిపించింది. అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. కళ్ళు తుడుచుకున్నాడు.

[సోమయాజులూ! నువ్వు పిరికివాడి వయ్ పోతున్నావ్. నీ ధైర్యమంతా 'ఉష్ కాకి' అయిపోయింది. బతుకులో నీకేం మిగల్లేదు! నీ బంగారు కలలన్నీ ఎండ మావులయ్యాయి. నిజం సోమయాజులూ! వోడి పోయావ్ నువ్వు. ఒప్పుకో]

సోమయాజులు వేదాంతిలా నవ్వాడు. చేతులోత్తి ముఖం తుడుచుకున్నాడు. అతని కళ్ళముందు ఏదో అస్పష్టపు నీడ కదిలి చెదిరిపోతోంది. కళ్ళు తిరుగుతున్నాయి. ఒక్కడుగు కూడా యిక ముందుకు వెయ్యలేక పోయాడు. వళ్ళంతా చెమట్లు పట్టాయి. ఆ నడి రోడ్డుమీద కుప్పలా కూలిపోయాడు సోమయాజులు.

* * *

రాత్రి రెండుగంటలయింది.

సెంకడ్‌షో కెళ్ళి గౌరీపతి గేటు తీసుకుని లోపలికొస్తుండగా శంకర్రావు అతనింట్లోంచి బయటకొస్తున్నాడు!

అతను మనిషంతా నలిగిపోయి అదుర్దాగా వున్నాడు. గౌరీపతిని చూసి ఖంగారు పడ్డాడు.

'మీ కోసమే వచ్చాను' అన్నాడు.

'ఇప్పుడా? అంతర్జంటా? అవుతే లోపలి కెడదాం రండి' అన్నాడు గౌరీపతి.

'ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలి!'

'ఏమిటి మీరంటున్నది?'

'అవును గౌరీపతిగారు! ఓ అభాగ్యుడికి ప్రాణ దానం చెయ్యాలి. అది మీచేతిలో వుంది. మీరు నా మిత్రులు. మీరంటే నాకు గౌరవం, అభిమానం వుంది. అందుకే మీతో చెప్పేయ్యాలనుకున్నాను.'

గౌరీపతి అనుమానంగా శంకర్రావు ముఖంలోకి చూశాడు. శంకర్రావు, గౌరీపతి భుజం మీద చెయ్యివేసి — 'నన్నపార్థం చేసుకోవద్దు. నేను మీ శ్రేయోభిలాషిని' అన్నాడు.

ఇద్దరూ లోపలి కెళ్ళి గదిలో కూర్చున్నారు.

కాసేపు ఎవరూ మాట్లాడుకోలేదు!

'చెప్పండి శంకర్రావుగారు' అన్నాడు.

శంకర్రావు తటపటాయించాడు.

అప్పుడు గౌరీపతి నవ్వి— 'ఎందుకలా సంకోచిస్తారు'? అన్నాడు.

'నేను చెప్పబోయేది......'

'ఏదైనా కానివ్వండి, ఆనందంగా వింటాను. చెప్పండి శంకర్రావుగారు.'

'గౌరీపతిగారూ! మీకో కథ చెప్తాను. నాకో ఆప్తమిత్రుడున్నాడు. అతను చదువుకునే రోజుల్లో ఓ అందమైన అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకోవాలను కున్నారు. వాళ్ళ పెద్దవాళ్ళు ఒప్పుకోక పోవడం వల్ల విడిపోయారు. వేరే పెళ్ళిళ్ళు చేసుకున్నారు......'

'ఈ కథ నాది. ఇది మీకూ తెలుసు. నన్నవమానిద్దామనా మీ ఉద్దేశం?'


'కాదు. ఇటువంటి కథలు చాలా మంది కున్నాయ్. నే చెప్పేది పూర్తిగా వినండి. ఆ తర్వాత ఏం చెయ్యాలో మనస్ఫూర్తిగా చెప్పండి.'

'చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు?'

'ప్రేమించినమ్మాయిని పెళ్ళి చేసుకోలేదనే కసికొద్దీ అతను తాగుబోతయ్యాడు. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించాడు. తన ప్రేమికురాలి భర్తని పరిచయం చేసుకుని అతన్ని నాశనం చెయ్య ప్రయత్నించాడు.'

'ఎందుకట?'

'కసి. వాళ్ళ సంసారం సుఖంగా వుండడం తనకిష్టం లేదు. అది సహించ



లేదు. ఆమె వల్లనే తను సుఖానికి దూరమయ్యాడు. తనలాగే ఆమెకూ సుఖం లేకుండా చెయ్యాలంటే ఇది మంచి మార్గం. వాళ్ళ సంసారం నరకంగా వుంటే తనకానందం. ఇది పగ. ఈ పగ ఎంతో కాలం పని చెయ్యలేదు. ఇప్పుడతను తుదిక్షణాల్లో వున్నాడు. అతనికో కోర్కె వుంది. ఆమెను కడసారిగా, ఆమె భర్తతో చూసి ఆనందించాలనీ, వాళ్ళనుంచి క్షమాపణ పొందాలనీనూ ఎదురుచూస్తున్నాడు. అందుకు భర్త ఒప్పుకుంటాడంటారా?'

'భార్యను అమితంగా ప్రేమించే వాడయితే ఆమెను తీసుకెళ్ళాలి. అది న్యాయం.'

'ఈ మాట మనస్ఫూర్తిగా అంటున్నారా?'

'అవును.'

'గౌరీపతిగారూ! నన్ను మన్నించండి. ఇది కథ కాదు.'

'మరి......'

'ఇప్పుడు సోమయాజులు చివరిదశలో వున్నాడు. నాలుగు గంటల క్రితం అతను గుండెపోటుతో నడిరోడ్డు మీద స్పృహ తప్పి పడిపోయాడు. స్టూడెంట్స్ చూసి హాస్పిటల్లో అతన్ని ఎడ్మిట్ చేశారు. మీరూ, శారదగారూ వచ్చి అతనికి కనిపించండి. ఇదతని చివరి కోర్కె.'

వాళ్ళ మాటలు వింటూ శారద కిటికీలో కూర్చుంది. కిటికీ ఊచల్లోంచి బయటకు చూస్తోంది. ఎక్కడో దూరాన ఓ వెలుగు కనుపిస్తోంది.

గౌరీపతి, శంకర్రావు మొహంలోకి చూసి — 'ఒక్క క్షణం. ఇప్పుడే వస్తాను' అన్నాడు.

గౌరీపతి గుమ్మం దగ్గరకొచ్చి గదిలోకి చూశాడు. శారద కదలకుండా అలాగే బయటకు చూస్తోంది.

'శారదా' అన్నాడు.

శారద మాట్లాడలేదు.

గౌరీపతి లోపలికెళ్ళి మళ్ళీ—

'శారదా' అన్నాడు.

శారద ఇటు తిరిగి భర్తకేసి చూసింది.

ఆమిప్పుడు...నిర్వికల్పంగా, యోగినిలా వుంది!

గబగబా వచ్చి భర్త కాళ్ళమీద పడింది.

గౌరీపతి ఆమెను లేవనెత్తి—

'శారదా! నువ్వు చాలా మంచిదానివి. నేను అదృష్టవంతుడ్ని' అన్నాడు.

* * *

'అంతా చెప్పేనా? అతనొప్పుకున్నాడా? నాకు నిజం చెప్పు శంకర్రావ్' అన్నాడు సోమయాజులు భయం భయంగా.

'ఇంకో క్షణంలో వాళ్ళిద్దరూ నీ ముందుంటారు—సరా?'

'థేంక్స్ ...ఇంకోమాట చెబుతావా?— నేను బ్రతుకుతానంటున్నాడా డాక్టరు బాబు.'

'మరేం ఫర్లేదు.'

'ఏం జబ్బట? — పోనీ దానిపేరు చెప్పకు. నీకు సుమతీ శతకం కంఠతా వొచ్చుగదూ— బుద్ధిమంతుడెవడు? వాడి గుణగణాలెట్టివి? వివరిస్తావూ? వింటాను—'

'ఇంక అట్టే మాట్లాడకు సోమయాజులూ. కళ్ళు మూసుకుని నిద్రపో...'

'కళ్ళు మూసుకోనా? బలేవాడివి. ఆ కళ్ళు అలాగే శాశ్వతంగా మూసుకుపోతే నేను శారదనీ, సరస్వతినీ ఎలా చూడగలను? అన్నట్టు సరస్వతికి వైరిచ్చావ్ గదూ? థేంక్స్,' అన్నాడతను.

అదే క్షణంలో శారదా, గౌరీపతి వొస్తున్న వైనం గమనించిన శంకర్రావ్ సోమయాజులు నోరు మూసి అన్నాడు—

'ఉష్...వాళ్ళు వస్తున్నారు!'

'ఎవరు? శారదేనా? అవునా?...'

శంకర్రావ్ తలూపడం చూచి సోమయాజులు గుమ్మం వేపు దృష్టి విసిరాడు—

శారదా, గౌరీపతి గుమ్మం దగ్గర నిలిచారు.

వాళ్ళు ఆది దంపతుల్లా సోమయాజులుకి కనిపించారు.


వాళ్ళు తన ప్రాణదాతల్లా ప్రత్యక్షమయ్యారనుకున్నాడతను. అందుచేత—మనసులో నిండిన అభిమానానికి చిహ్నంగా—

సోమయాజులు రెండు చేతులూ జోడించాడు.

అతని కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

అకస్మాత్తుగా తలని పక్కకి వాంచేశాడు సోమయాజులు!

(అయిపోయింది) ●



కార్తీక దీపం

ఈశ్వరుడిని జ్యోతి రూపంలో ఆరాధించడం ఒక ప్రాచీన హైందవ సాంప్రదాయం. కార్తీక దినం నాడు శివుడిని ఎన్నో దీపాలు వెలిగించి ఆరాధిస్తారు. విష్ణువుని కూడా ఇదే విధంగా పూజిస్తారు. భగవంతుడు జ్యోతి రూపంలో లోకంలోని అంధకారాన్నే కాక మానవుడి లోపలి చీకటిని కూడా పోగొడతాడు.

తిరువణ్ణామలయిలో కార్తీక దీపం పండగని గొప్పగా చేసుకుంటారు. ఇక్కడే ఈశ్వరుడు జ్యోతి రూపంలో నుంచుని బ్రహ్మ, విష్ణువులని తన శిరస్సు, కాళ్ళని కనుక్కోమన్నాడుట. ఇద్దరూ తమ ప్రయత్నాలలో విఫలులయ్యారుట. కాని బ్రహ్మ శివ శిరస్సుని చూసినట్లు అబద్ధం చెప్పినందుకు శాపగ్రస్తుడయ్యాడు: బ్రహ్మకి దేవాలయాలు ఉండవని శాపం. (ఈ సందర్భంలో బ్రహ్మ హంస రూపాన్ని విష్ణువు వరాహ రూపాన్ని ధరించారుట.)

తిరువణ్ణామలయిలో కొండ మీద పెద్ద దీపం వెలిగిస్తారు. ఇది చుట్టుపక్కల కొన్ని మైళ్ళ దూరం కనిపిస్తుంది. ఈ దీపం కొన్ని రోజులపాటు వెలుగుతుంది. ఇది పంచభూత స్థలాలలో ఒకటి. (అగ్ని పంచ భూతాలలో ఒకటి కాబట్టి.)



తల్లి పెడుతున్న బెల్లం అటుకుల ఉండలని ఆప్యాయంగా తింటున్న పిల్లలు



కార్తీకదీపోత్సవంరోజున మొట్టమొదట పూజచేసే దీపస్తంభం

కృత్తికా నక్షత్రం నాడు కార్తీక దీపం పండగ పదిరోజులు జరుగుతుంది.

కార్తీక దీపం పండగ శివాలయాలలోనే కాక వైష్ణవాలయాలలో కూడా చేస్తారు. ఈ సందర్భంలో దీపాన్ని విష్ణు దీపం అంటారు.


కార్తీకదీపాన్ని దేవిగా కూడా పూజించే సంప్రదాయం ఉంది. అప్పుడు దీపాన్ని దీపలక్ష్మి అంటారు. దీపలక్ష్మి ఆరాధన ఆడవారికి ముఖ్యం. తమిళనాడులో ఈ ఆరాధనని 'తిరువిళక్కు పూజ' అనీ, దీపం పట్టుకున్న స్త్రీ మూర్తిని 'పావై విళక్కు' అనీ అంటారు.

దక్షిణదేశంలో కార్తీకదీపం పండుగ చాలా ముచ్చటగా, అందంగా ఉంటుంది. ప్రతి ఇల్లూ దీపాల వరసలతో మెరిసిపోతూ ఉంటుంది! చిన్న పిల్లలు టపాకాయలు కాలుస్తారు. తమిళనాడులో బెల్లం అటుకుల ఉండలు చేసుకుని తింటారు.

కార్తీకదీపం పండగ కార్తికేయుడి గౌరవార్థం అనే సాంప్రదాయం కూడా ఉంది. కార్తికేయుడిని ఆరుగురు అమ్మాయిలు (కార్తిగై పెణ్గళ్) పెంచారుట. అతను తారకాసురుడిని జయించినందుకు దీపాలతో పండగ చేసుకుంటారుట. కొత్త బట్టలు వేసుకున్న ఇంటావిడ మొదటి 'దీప స్తంభాన్ని' వెలిగించిన తర్వాత దాని నుంచి ఎన్నో ఇతర దీపాలని వెలిగిస్తారు ●

వ్యాసం : ఎస్. నాగరత్నం

ఫోటోలు : ఎస్. రామకృష్ణ



జరిగిన కథ

సావిత్రమ్మ ఒక మధ్యతరగతి ఇల్లాలు. ఆమె భర్త రామనరసయ్య. పెద్దకొడుకు గోపీ వారాలు చేసుకుని పై వూళ్లో చదువుకుంటూ వుంటాడు. విధిలేక చిన్నవాడు మురళిని సరసింహానికి పెంపకం ఇస్తుంది. గోపీ తెలివి తేటల్ని గ్రహించి అతనికి తన ఇంటిలోనే వసతి ఏర్పాటు చేస్తాడు ప్రొఫెసరు. అతని కుమార్తె అనిత. అనిత ప్రవర్తన గోపీకి నచ్చదు. గోపీ ఆచోటు విడిచి పెట్టేస్తాడు. విదేశాలకి వెళ్తాడు. విమల ఒప్పుకోని సంబంధానికి కమల ఒప్పుకున్నది. చదువుమీద ఆసక్తిగల విమల ఒక కాన్వెంటులో స్థానం సంపాదించుకోగల్గుతుంది. ప్రిన్సిపాల్ ఆమెను ప్రత్యేకశ్రద్ధతో గమనిస్తూ ఉంటుంది.

10

బాలికా పాఠశాలవంటిదే అక్కడ మగపిల్లలస్కూలొకటి ఊరికి మధ్యగా నడుపబడుతున్నది. ఈ రెండు పాఠశాలలు స్థాపించినదొక కమిటీయే. దీనికి విదేశీ ధన సహాయమూ పెట్టుబడీ ఉన్నాయి. ఆ పాఠశాలలకు స్వంత భవనాలూ విశాలమయిన ఆవరణాలూ—చుట్టూ పెద్దతోట—ఆ ఆవరణంలోనే విద్యార్థులు ఉండటానికి హాస్టలు, టీచర్లకు వసతిగృహాలు, ప్రిన్సిపల్సుకు ఫర్నిచరుతోసహా ఒక అందమయిన ఇల్లు— నిర్మింపబడ్డాయి. పిల్లలు ఆడుకోవటానికి విశాలమయిన క్రీడాస్థలము—వంటయింటికి సమీపంగా పెరటితోట దానికితగిన నీటి వసతీ ఉన్నాయి. ప్రతి ఆదివారమూ విద్యార్థినీ విద్యార్థులను తీసుకుని టీచర్లు చర్చికి వెళ్లి ప్రార్థనా సమావేశాలకు హాజరవుతూ ఉంటారు.

ఆదివారాలు చర్చి సమావేశాలకు వెళ్లి వచ్చిన తరువాత మేరీ కరుణ రెండుమూడు రోజులపాటు సన్నిహితంగా మెలగుతూ గుసగుసలాడుకునేవారు.

డైనింగు హాలులోనుంచి బయటికి వస్తూ 'రండి అక్కడే నిలబడి పోయారేం?' అన్నది మార్గరెట్.

'నీవు వెళ్తూ ఉండు వస్తాంలే'

రోజూ రాత్రివేళ మార్గరెట్‌కు మేరీ లెక్కలు చెబుతుంది. ఆ పాఠమయితేనేగాని ఆమె పడుకోదు. కొంతదూరం ముందుకు వెళ్లి వెనక్కుతిరిగి చూసింది. మేరీ, కరుణ ప్రాకారానికి సమీపంగా ఉన్న గుల్‌మొహర్ వృక్షము క్రిందికి వెళ్లి నిలబడ్డారు.

ఆశ్చర్యపడుతూ మార్గరెట్ తన పడక వద్దకు చేరుకున్నది. కాని వాళ్లకోసం కిటికీగుండా చూడటం మానలేదు. ఆ మసక చీకట్లలో గోడమీదినుంచి ఏవో నీడలు క్రిందికి దిగినట్లు కనబడ్డాయి. ఆ నీడలు రెండుకు నాలుగయి భోజనశాలకు వెనుకగా వెళ్లినట్లు కనబడ్డది. ఈవిధంగా వారానికి పదిరోజులకూ కరుణ, మేరీ ఆలస్యంగా పడకలు చేరుతూ ఉండేవారు. అంతవరకూ మసులుతూ పడుకున్న మార్గరెట్ కదలకుండా ఊపిరి బిగబట్టి పడుకుంటూ ఉండేది.

రాత్రి పదిగంటలవేళ పాఠశాల ఆవరణంలోని భవనాలన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి చెట్లనందులగుండా మసకవెన్నెల నేలమీద పడుతోంది.

ఎక్కడో చెట్లఆకులమీద నడిచినసవ్వడి. 'ఎవరది' మారయ్య ఒక పొలికేక పెట్టాడు.

ఆకేకతోపాటు పరుగులు—ఆ పరుగులు వినవచ్చినచోటికి మారయ్య ఒక్క అంగలో చేరుకుని ఇద్దరినీ చెరొకచేతో పట్టుకున్నాడు. మారయ్యది ఉనప పిడికిలి. ఆ పిడికిలికి బిగుసుకు పోవటమేగాని విచ్చుకోవటము అలవాటులేదు. ఎంత గుంజుకున్నా పిడికిలి విడవకుండా పాఠశాల భవనం ముందర ఉన్న దీపపు వెలుగులోకి లాక్కుని వచ్చాడు మారయ్య.

ముఖం తేరిపారజూసి 'నీవా సుందరం?' జుట్టు పట్టుకుని ముఖం పైకెత్తాడు.

సుందరం గజగజ వణికిపోతున్నాడు. భయంతో మోకాళ్లు రెండూ ఒకదాని కొకటి కొట్టుకుంటున్నాయి. జివ్వుజివ్వుమని చలిగాలి వీచే ఆ సమయంలో అతడికి ముఖమంతా చెమట పట్టింది. చప్పున వంగి మారయ్య కాళ్లను చుట్టేశాడు.

చేతులు నులుపుకుంటూ అంతదూరాన నిలబడి పోయింది కరుణ.

'ఎందుకు వచ్చారు చెప్పండి మీరిద్దరూ ఇక్కడికి ? కరుణమ్మా. నీవిక్కడికి ఎట్లా వచ్చావు ?' గర్జించాడు మారయ్య.

వాళ్లిద్దరికీ మౌనమే శరణ్యమయింది.

'గోడ దూకావు కదూ?'

సుందరం మాట్లాడలేదు.

'అట్లా అప్పుడప్పుడు దూకుతునే ఉన్నావుకదూ ?' సుందరం చెయ్యి మెలిక పెట్టాడు మారయ్య.

బాధతో కళ్లు మూసుకుంటూ అవునని తల ఊపాడు.

'వెళ్లు—మాట్లాడకుండా. వెళ్లిపో. ఎట్లా వచ్చావో అట్లా వెళ్లిపో. ప్రిన్సిపల్‌కు మీ యిద్దరి సంగతి చెప్పానంటే ఇక్కడినుంచి వెళ్లగొడతారు' సుందరం చెయ్యి విడిచిపెట్టాడు.

దూమకు పొయ్యాడు సుందరం.

తల వంచుకుని పరుగు తీసింది కరుణ.

ఈ సందడిలో మరొకబంటి చెట్ల నీడన దాగిదాగి అందరూ వెళ్లిపోయిన తరువాత విడిపోయింది ఆ చీకట్లో.

మారయ్యకు ఆ రెండు పాఠశాలలలోని టీచర్లవీ పిల్లలవీ రహస్యజీవనాలు తెలుసు. కదిపితే టకటక అంతా బయట పెట్టేస్తాడు. అందుకనే అతడిని ఎవరూ కదప

టానికి సాహసించరు.

మార్గరెట్ మెట్రిక్ ప్యాసయేలోపల లోకబారు ప్రణయ జీవులను ఎందరినో చూసింది. అవి పాఠశాలలు కావు. కాముకుల నిలయాలని గ్రహించింది. కాని వారిలో కూడా స్మరించ తగినవారినీ, చెయ్యెత్తి నమస్కరించ తగిన వారినీ తలుచుకొని ముందుకు సాగిపోతున్నది.

పరిక్షాఫలితాలు తెలిసిననాడు ప్రిన్సిపల్ మార్గరెట్‌ను పిలిచింది.

'ముందు ఏంచెయ్యదలచుకున్నావు మార్గరెట్ ?' ప్రశ్నించింది ప్రిన్సిపల్ కలంకొన పెదవులకానించుకుంటూ.

ఎటూ తోచక చేతులు కట్టుకుని నిలబడి పోయింది మార్గరెట్.

'చెప్పుమరి ? నీసంగతి పైకివ్రాయాలి కదా.'

'నర్సింగ్ కోర్సు చదువుకోవాలని ఉంది మేడమ్'

ప్రిన్సిపల్ దగ్గర సెలవు తీసుకుని గదికి వెళ్ళింది మార్గరెట్.

అక్కడ కరుణ మేరీ గుసగుస లాడుకుంటున్నారు.

* * *

వెన్నజాజాలూ కనకాంబరాలూ నీలాంబరాలూ మరువంతో కలిపి అతిమనోహరంగా మాల కట్టింది రాధిక. ఒయ్యారంగా మెట్లుఎక్కి వస్తూ భజనకీర్తన పాడుతున్నది. ఆ మాల నలగకుండా చేతిమీద వేసుకుని దాని సోయగాన్ని అవలోకిస్తున్నది. మేడమీద రెండడుగుల ఎత్తు బుద్ధ విగ్రహమూ, కృష్ణ విగ్రహమూ పుస్తకాల బీరువామీద ఉన్నాయి. వాటిని నిత్యమూ పూల మాలలతో అలంకరిస్తాడు చక్రపాణి.

చక్రాల కుర్చీని దొర్లించుకుంటూ రాధిక తెచ్చిన మాలతో మూర్తులను అలంకరించి వెనక్కుతిరిగాడు. పళ్ళెం నిండా గులాబులు బల్లమీద గుసగుస లాడుతున్నాయి. వాటిని ఒకచేతో అందుకుని బాల్కనీ దగ్గరకి కుర్చీని దొర్లించుకుంటూ వెళ్ళాడు.

రాధిక ఏమీ తోచనప్పుడు ఆ బాల్కనీ దగ్గర నిలబడి క్రిందికి చూస్తుంది. అక్కడినుంచి రంగురంగుల పూలతో తలలూపుతూ పూలచెట్లు అతిరమణీయంగా కనబడతాయి.

చక్రపాణి బాల్కనీ లోకి వస్తున్న సవ్వడి విని రాధిక కదలకుండా అక్కడే నిలబడ్డది. చక్రపాణి కొంచెము ముందుకు వంగి ఆమెజడ పట్టుకో బోయాడు. ఆమె అతడికి అందకుండా ముందుకు ఒక అడుగు వేసింది. అతడు మరింత ముందుకు ఒంగాడు. అంతే బోర్లా పడిపోయాడు.

రాధిక అదిరిపడ్డది. ఆమెకు పై ప్రాణాలు పైన ఎగిరి పోయినట్లయింది. దడదడ కొట్టుకునే గుండెలతో అతడి ప్రక్కన చతికిలబడి పోయింది.

ఆ చప్పుడు విని క్రిందినుంచి హనుమాయమ్మగారు మెట్లెక్కి ఆయాస పడుతూ పైకి వచ్చేసరికి చక్రపాణి తలను ఒడిలో పెట్టుకుని నేలకు రాసుకుపోయిన మోచేతులను నోటితో ఊదుతున్నది రాధిక.

'ఏమయింది రాదికా అంత చప్పుడయింది?'

'ముందుకు ఒంగబోయి పడ్డారు' ఆమె కంఠం రుద్ధమయింది.

ఇద్దరూ కలిసి అతడిని తిరిగి కుర్చీమీదికి చేర్చారు.

రాధిక కది పెద్ద గుణపాఠమయింది. ఆమె జీవితంలో సరాగాలకూ సరదాలకూ సరసాలకూ చోటులేదు. అతడొక పసిబిడ్డ' ఆ బిడ్డను వేయికళ్ళతో కనిపెట్టుకుని



ఉంటాలా?

'రాధికా' రాత్రి పొలమారగిన గ్లాసు ఆమెచేతికి ఇస్తూ ముఖంలోకి చూశాడు చక్రపాణి.

నీళ్ళునిండిన కళ్ళతో ఆమె ముఖం పైకెత్తి అపరాధివలె అతడిని చూసి తల దించుకుంది.

'ఎందుకంత భయపడతావు? అందులో నీ తప్పేముంది? నిన్ను పట్టుకోబోయి నేనే ముందుకు వొంగాను. దానికేనా ఇంత బాధ పడుతున్నావు?'

'నాది తప్పే. నేనొక అడుగు ముందుకు వెయ్యకుండా ఉంటే మీకా పాటు తప్పేది. మీరు వస్తున్నారని తెలిసి—ఏం చేస్తారో చూద్దామని ఒకఅడుగు ముందుకువేశాను.' కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ 'ఏంజరిగిందో చూశాను' అంది.

'జరిగిపోయినదానికి పదిసార్లు అనుకో కూడదు. వెళ్ళి అలమార్‌లో ఉన్న ఫ్లూటు తీసుకురా.'

జీవితవలయాలు

శశాంకుడు పదహారు కళలతో ప్రకాశిస్తున్నాడు. ప్రకృతి చల్లగా తెల్లగా ప్రశాంతంగా ఉన్నది. చక్రపాణి ఆ చక్రాల కుర్చీలో కూర్చుని మురళి వాయించటం మొదలుపెట్టాడు. రాగానికొకటి వంతున సమ్మోహనాస్త్ర తుల్యంగా వాయిస్తున్నాడు. ఆ గాన మాధుర్యానికి అచేతనాలు చేతనాలుగానూ, చేతనాలు అచేతనాలుగానూ మారిపోతున్నాయి.

మురళి వాయిస్తున్నచక్రపాణి లోకమోహనంగా కనబడుతున్నాడు రాధికకు. ఆ గానం 'రాధా రాధా రాగ రస్తైక సుధా, రాధా రాధా' అన్నట్టు ఆమె చెవులలో మార్మోగటం మొదలుపెట్టింది. రాధా రాధా అన్న పిలుపు వినబడ్డకొద్దీ ఆమెమనసు కరిగి నీరై అతడిచుట్టూ ప్రవహించినట్లవుతోంది. ఆమె అక్కడ ఒక వ్యక్తిగా లేదు. ఆమె ప్రాణాలు అతడిలో లీనమయిపోతున్నట్లవుతున్నది.

హనుమాయమ్మగారు వచ్చి అక్కడ నిలబడటం ఇద్దరూ గమనించలేదు.

* * *

గోపీ ఆశ్చర్యముతో పోస్టులో వచ్చిన కవరు తిప్పి తిప్పి చూశాడు. అందమయిన దస్తూరి. ఆత్రంతో విప్పిచూశాడు.

అన్నయ్యా!

నీ ఎడ్రసు సంపాదించటానికి నాలుగు నెలలు పట్టింది. నీవు ఎవరికయినా ఉత్తరాలు వ్రాస్తేకదా నీ అడ్రసు తెలిసేది? చివరకు అమ్మకుకూడా నీవు ఉత్తరం వ్రాయటం లేదని తెలిసింది. మా అందరి మీద నీకు కోపమా లేక నిర్లక్ష్యమా? ఏమిటి?

నేను ఇంగ్లీషులో వ్రాసిన జాబు చదువుతుంటే నీకు ఆశ్చర్యంగా ఉందికదూ? నాసంగతంతా నీవు వింటే మరీ ఆశ్చర్యపడతావు.

నాఫోటో పంపుతున్నానుచూడు. ఆయనే మీ బావగారు. నాపెళ్ళి చాలా విచిత్రమయిన పరిస్థితులలో అయింది. ఈ సంబంధం అక్కకుమాట్లాడారు. అక్క యిష్టంలేక తప్పించుకుని పారిపోయింది. ఫోటో చూడగానే ఆయన ఎంత సౌందర్యవంతుడో ఎంత ఆరోగ్యవంతుడో నీవు గ్రహించే ఉంటావు. ఆయన లోకమోహనంగా మురళి వాయించగలరు. ఉత్తమ చిత్రకారుడు. ప్రఖ్యాత పత్రికా రచయిత.

ఇటువంటి ప్రముఖుడిని వివాహం చేసుకోవటానికి అక్క ఎందుకు నిరాకరించిందో తెలుసా? ఆయన పాదం క్రిందబెట్టని అదృష్టవంతుడు. చక్రాలకుర్చీలో ఇల్లంతా తిరిగే భోగి. నేను శేషన్నయ్యా అమ్మనూ వప్పించి కావాలని ఈపెళ్ళి చేసుకున్నాను. ఆయన తన విద్యలన్నీ నాకు నేర్పుతున్నారు. సంగీతం చిత్ర కళ అభ్యసిస్తున్నాను. నన్ను బి. ఏ పరీక్షకు ప్రయివేటుగా వెళ్ళమని బలవంతం చేస్తున్నారు. అందుకు చదువుతున్నాను.

నాజీవితం నాకు తృప్తిగానే ఉంది. కాని అన్నయ్య అమ్మ ఇంకా మనసు కుదుర్చుకోలేదు. నేను ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు యివ్వలేదు.

నీవు క్షేమంగా ఉన్నాననుకుంటాను. నీవు ఎప్పుడు తిరిగి ఈదేశానికి వస్తావు?



డైరెక్టర్: ఈ సీన్లో మీరు తలనొప్పి వచ్చినట్లు నటించాలి.
హీరోయిన్: అబ్బ! ఇవ్వాళ లాభం లేదు. తలనొప్పిగా ఉందండి.

నాకు అమ్మావాళ్ల క్షేమం అసలే తెలియటం లేదు. మురళిని చూద్దామని ప్రాణం కొట్టుకుపోతున్నది కాని సాధ్య పడటంలేదు.

జవాబు వ్రాస్తావుకదూ?

నీ చెల్లెలు

లా. క. రాధిక.

ఇక్కడికి వచ్చినతరువాత నాపేరు మారి పోయింది. రాధిక నయ్యాను.'

ఉత్తరాన్ని నాలుగుసార్లు చదువు కున్నాడు గోపి. ఫోటో చూశాడు. ఆ ఫోటో అతడినెంతో ఆనందపరచినట్లుంది— పదే పదే చూశాడు.

ఈ సంబంధం చూసి విమల పారి పోయిందా? ఎక్కడికి పోయి ఉంటుంది?

అతడికి విశాఖపట్నంలో తాను చదువు కుంటున్నప్పుడే ఇంటి సంగతులు సరిగా తెలియలేదు. ఎట్లా తెలుస్తాయి? తనమీద అంత ఆశ పెట్టుకుని తల్లి పెద్ద చదువుకని పొరుగూరు పంపింది. చేతిలో ఉన్నంత వరకూ తనమీద పెట్టుబడి పెట్టింది. తను చదువుకొని డాక్టరయి కుటుంబాన్నంతా పోషిస్తాడని ఆశించింది. కడుపున పుట్టిన వాళ్లందరికంటె తనను ఘనంగా చూసింది. అమ్మకు తనమీద ఎంత అపేక్ష. ఆ తల్లి ఒక్కొక్క ఇబ్బంది వచ్చినప్పుడల్లా గోపి డాక్టరయి వచ్చి వాటిని తీరుస్తాడని కాంక్షించి ఎదురు చూసింది. గోపి వచ్చిన తరువాత తనకు ఏవిధమయిన కష్టాలూ ఉండవనుకుంది. కాని చివరికి ఏం జరిగింది? గోపి రెండుచేతులతో తలపట్టుకున్నాడు.

క్రిందటివారం కాంతం ఉత్తరం వ్రాశాడు. అతడి కెంత శ్రద్ధ తన కుటుంబంపైన! ఎంత అభిమానం? తను కాంతంపాటి చెయ్యలేక పోయాడు.

కుటుంబ పరిస్థితులను దృష్టియం దుంచుకునే తను కష్టపడి చదువుకున్నాడు. పరీక్ష ప్యాసయాడు. కాని తనపైన అసహ్య కరమయిన నేరము మోప బడ్డది. తను నిరపరాధి. అయినా నలుగురి దృష్టిలో అపరాధి. తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవాలి. కాని అందుకు సమయం లేదు. తనకు ప్రయాణం తోసుకువచ్చింది. ప్రొఫె సర్లకూ ప్రిన్సిపల్‌కూ మధ్య తగాదాలు ఉండటంవల్ల తనకు లాభం కలిగింది.

అమ్మ సంగతి సంసారం సంగతి తాను ఆలోచించలేదు. ఆమె బిడ్డలతో ఎన్ని ఇబ్బందులు పడుతున్నదీ తనకు తెలుసు. ఆమెకు ఏవిధమయిన సహాయమూ చేయలేక పోయినా ఓదారుస్తూ ఉత్తరాలు వ్రాయ వచ్చు. తమ్ముళ్లకూ చెల్లెళ్లకూ బాగా చదువుకొమ్మనీ, తల్లిని డబ్బుకోసం ఇబ్బంది పెట్టవద్దనీ ఉత్సాహపరుస్తూ ఉత్తరాలు వ్రాయవచ్చు కాని తను ఆవిధంగా కూడా ఆమెను సంతోషపరచలేక పోయాడు.

తన సంగతి తప్ప మరొకరిసంగతి ఆలో చించలేని స్వార్థపరుడు. తను పాపి. ఆ పూజ్యురాలి కడుపున చెడబుట్టిన దుర్మార్గుడు.

విశాఖపట్నంలో ఉన్నంతకాలం తన చదువు ఎట్లా సాగుతుందా అని ఆలోచిం చాడు. అన్నిటినుంచి దూరంగా ఉంటూ ఆమెకు సహాయం చెయ్యటానికి పూను కున్నాడు. ఇక్కడికివచ్చిన తరువాత పద్మిని తారసిల్లింది.

విదేశాలలో ఉన్నవాళ్లకు భారతీయులు కనబడగానే ప్రాణం లేచివచ్చినట్లని పిస్తుంది. లైబ్రరీలో రీసర్చిచేసే పద్మినికీ గోపికీ అనుకోకుండా పరిచయము అయింది. పద్మిని కలుపుగోలుతనమే అతడిని ఆకర్షించింది.

పద్మినిసన్నాటు తలపుకురాగానే మురిసి పడుతున్న గోపి మనసులో ఇతరవిషయాలు సద్దుమణగిపోయాయి.

* * *

మార్గరెట్ నర్సింగ్‌హోమ్‌లో చేరింది. అక్కడ ఆమెతోకూడా శిక్షణపొందేవారిలో తార పెద్దది. వచ్చిన వారానికి అందరినీ పరిచయము చేసుకుని స్నేహాలతను పాకించ నారంభించింది.

అందరూ పడకలు చేరిన తరువాత

పడకమీద ఉండి సన్నటి కూనిరాగం తీయటం మొదలుపెట్టింది. క్రమంగా ఆ కూనిరాగం పాటలలోకి దిగింది. శ్రావ్యమైన కంఠం. శాస్త్రయుక్తమైన రాగము. ఆ రాగచ్ఛాయలలో లలిత సంగీతము—తీగెలు సాగినట్టు సాగిపోతున్నది. కవ్వించినట్టు పాడుతోంది సినిమా సంగీతము చివరకు.

ఒక్కొక్కరే పడకలమీదినుంచి లేచారు. కూర్చుని కొంతసేపాలకించి — లేచివచ్చి ఆమెచుట్టూ చేరారు.

'ఈపాట ఏ సినిమాలోదో చెప్పవూ?'

సినిమా పేరుచెప్పి ఆ పాటల సందర్భం కూడా చెప్పింది—తార. దాని తరువాత వాళ్ళ సంభాషణ నటీనటులమీదికి జంటల మీదికీ మళ్ళింది. తరువాత వాళ్ళ అభినయంమీదికి తిరిగింది. నవ్వులూ తుళ్ళింతలతో సంభాషణలు పకపక మంటున్నాయి.

గడియారం పన్నెండుగంటలుకొట్టింది. అందరూ ఉలిక్కిపడ్డారు. ఒక్కొక్కరే మెల్లగాలేచి పడకలు చేరారు. కాని తారను చుట్టుకుని వసుంధర కస్తూరి ప్రశ్నలు వేస్తూ గుడగుడ మాట్లాడటంసాగించారు.

సంభాషణలు మంచిపట్టులో ఉన్నాయి.

'తారా, వసుంధరా, మనం నాలుగుగంటలకు లేచి సిద్ధం కావాలి. ఐదుగంటలు కొట్టే సరికి హాస్పిటల్లోఉండాలి. జ్ఞాపకం ఉంచుకోండి' మార్గరెట్ మళ్ళీ జ్ఞాపకం చేసింది.

'వెళ్దాం లేద్దూ' వసుంధర కస్తూరి కొంగు పట్టుకుని కూర్చోబెట్టింది.

'మనం ఉపేక్ష బద్ధకం కూడని వృత్తిలోకి పోతున్నాం. మనం అన్నిటిలో చురుగ్గా ఉండటమే కాకుండా వేళను అతిక్రమించకుండా వృత్తిధర్మాలను నిర్వహించుకుంటూ పోవాలి. రాత్రివేళల్లో వృధా కాలక్షేపము చేస్తే ఉదయము లేవలేము.'

'సరే సరే. మేము నీతో పాటు లేస్తే సరికదా. అయినా నీ అంతటి అత్తగారు ప్రక్కన ఉండగా మేము అల్లరి చెయ్యనూ లేము — వేళను అతిక్రమించనూ లేము. సరేనా?' తార వాళ్ళను పంపించి పడక మీద దొర్లుతూ ఎప్పుడో నిద్రపోయింది.

నర్సులు హాస్టలులోనుంచి హాస్పిటల్కు వెళ్ళాలంటే రోడ్డుదాటి వెళ్ళాలి. ఆ రోడ్డు చాలా విశాలమయినదే కాకుండా రాకపోకల రద్దీ ఎక్కువ కలది. ప్రైవే

జీవితవలయాలు

అందరూ ఒకసారి రోడ్డుదాటటం సులభము. ఒక్కొక్కరే బళ్ళనూ కార్లనూ చూసుకుని దాటాలంటే చాలా సమయం పడుతుంది. ప్రతిరోజూ వీళ్ళనందరినీ వెంటబెట్టుకుని హాస్పిటల్కు వెళ్ళటం మార్గరెట్ పని. అందరినీ లెక్కబెట్టుకుని ఒకరిచేతులు ఒకరు పట్టుకుని రోడ్డు దాటిన తరువాత ముందుకు నడిచింది మార్గరెట్.

పడకలు సరిచెయ్యటం, టెంపరేచరు చూడటం, మందులు గ్లాసులలో పోసి రోగులకు ఇవ్వటం — డ్యూటీ ప్రకారం అందరూ పనిలోకి వెళ్ళారు.

'తార ఏ డ్యూటీమీద వెళ్ళింది ?' మేట్రన్ నాలుగుసార్లు అడిగింది కనబడ్డ వాళ్ళనందరినీ.

అందరూ ఏమో ఏమో అన్నారు.

మేట్రన్ రూల్సు తప్ప మరేమీ మాట్లాడదు. ఎవరయినా రూల్సు ననుసరించి నడవవలసిందే. వాటిని అతిక్రమించిన వాళ్ళను ఆమె క్షమించదు. ఒకటి రెండు సార్లయినా వార్నింగు ఇచ్చి చూడదు. వెంటనే ఒక రిపోర్టు వ్రాసి పడేస్తుంది. ఆ రోజు తారకొరకు వెదికింది — వెతికించింది. తారకొరకు ఆమె చికాకుపడి అరుస్తూ ఉండగా ఆ వార్డు బ్రదర్ వచ్చాడు.

'ఇలా నిలబడిపోయారేం దారిలో?' అడిగాడు ఆశ్చర్యపడుతూ. ఆమె నిలబడిన తీరు—ముఖం రంగుచూసి ఎవరికో మూడిందనుకున్నాడు.

'ఈ ప్రైవేనీస్ కారుగాని నా ప్రాణాలు తోడేస్తున్నారు. వేళకు రారు. పని సరిగా చెయ్యరు.'

'ఈపూట ఎవరయినా ఇబ్బంది పెట్టారా?'

'తార అనే పిల్ల రాలేదు. ఆ పిల్లను ఏ పనిమీద పంపిస్తామో ఆపని త్వరగా చేసుకుని రాదు. ఇంకెక్కడికో వెళ్తూ ఉంటుంది.'

'ఒక ప్రైవేనిని మేల్నర్సుల స్టాఫ్ రూములో తిరుగుతూ ఉండగా చూశాను. అయితే నాకు ఆమెపేరు తెలియదు. మేల్ నర్సు ప్రకాష్ లేడూ అతడితో మాట్లాడుతూ ఉండగా చూశాను.

'అతడికే నేనొకచీటీ ఇచ్చి రమ్మని పంపాను. ఇంతసేపు చేస్తోంది. అక్కడే కబుర్లలోకి దిగింది కాబోలు. ప్రకాష్ కబుర్లలోకి దింపాడంటే ఎవరికైనా ఒళ్ళు తెలియదు. ఎంత టైమయినా తెలియదు. తనపని తనుచేసుకుంటూ ఇతరులను ముంచుతాడు.' గొణుక్కున్నది మేట్రన్.

రాత్రి ప్రైవేనీసంతా హాస్టలుకు చేరుకున్నారు. పడకలు చేరగానే తార ఏదంటే ఏది అని ఒక్కొక్కరే లేచారు.

'తార ఇవాళ రాదు' వసుంధర అన్నది.

'ఎందుకు? ఎక్కడికి వెళ్ళింది?' మార్గరెట్ లేచివచ్చి వసుంధరను అడిగింది.

'మేట్రన్దగ్గర నిలబడి ఏమో మాట్లాడుతూ ఉండగా చూశాను. ఆమె ఒకచీటి తారచేతిలో పెట్టి ఎటో వెళ్ళమంటున్నది.'

కనుబొమలు ముడుచుకుంటూ మార్గరెట్ తన పడక చేరింది.

రెండునెలలు పూర్తికాకుండానే తార పేరు ప్రైవేనీసు లిస్టునుంచి తీసివేసినట్టు మేట్రన్ చెప్పగా మార్గరెట్ విన్నది.

ఒకనాడు మేల్ మెడికల్వార్డులో పడకలను సరిచెయ్యటానికి మార్గరెట్ జట్టు వెళ్ళుతుండగా వార్డుబాయిస్ గదిలోనుంచి బయటికివస్తూ తార కనబడ్డది.

'ఏం బాగున్నావా తారా? మాతో పనికి రావటం లేదేం?' ఆ జట్టులో ఎవరో అడిగారు.

'నన్ను వెళ్ళగొట్టటానికి మీరంతా పంతం పట్టారని తెలిసింది. మీరంతా నామీద కక్షకట్టారటకదా?' అందరూ ఒక నిమిషంసేపు ఆగారు.

'పేర్లెందుకులే చెప్పటం? వాళ్ళనే బాగుపడనీ'

వింటూ మార్గరెట్ ముందుకు నడిచింది. అంతా ఆమె వెనుక వెళ్ళారు.

ఆ రాత్రి ప్రైవేనీస్ పడకలు చేరుతుండగా తారమెల్లగా వచ్చింది. వసుంధర దగ్గరచేరి కబుర్లు చెప్పటం మొదలుపెట్టింది.

మేట్రన్కూ మేల్ నర్సుకూ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయట, వాళ్ళడ్యూటీలు ముగించుకుని ఇళ్ళకు వెళ్ళేముందు ఎక్కడయినా కలుసుకోవాలి. నైట్డ్యూటీలు ఉన్న రోజుల్లో ఆ

హాస్పిటల్లోనే కలుసుకోవాలి. ఏరోజు ఎక్కడ కలుసుకోవలసిందీ చీటీలు వ్రాసుకుంటారు. ఆ చీటీలు తీసుకు వెళ్లటానికి అనువైన మనిషి దొరకాలి. ఆపని సక్రమంగా నమ్మకంగా చేసుకు రాకపోతే కక్షగట్టి ఏదో ఒక నెపముమీద తీసివేయించుతారు. ఒకనాడు తార చీటీ తీసుకు వెళ్ళింది. అతడు కనబడ లేదు. థియేటర్‌లో ఉన్నాడట. అతడు వచ్చే వరకూ అక్కడ ఉండి ఆ చీటీ యిచ్చి జవాబు తీసుకు రావాలి. జవాబు తీసుకు వచ్చేసరికి పదకొండు గంటలు దాటింది. అదిగాక ఇంకొక విషయము—ఆ ప్రకాష్ దుర్మార్గుడు. వయసులో ఉన్న ఆడపిల్ల కనపడితే ఊరుకోడు. ఏదో మిషమీద ఎదురుగా కూర్చోబెట్టుకుని కబుర్లలోకి దింపుతాడు. వెకిలిమాటలు మాట్లాడుతూ కదలనీయడు. ఒకనాటిరాత్రి ఎనిమిది గంటలకు మేట్రన్ ప్రకాష్‌కు చీటీ పంపించింది. జవాబుకోసం ఆమె పదిగంటల వరకూ స్టాఫ్ రూమ్‌లో కూర్చుని ఎదురు చూడవలసి వచ్చింది. అప్పుడు—తార జవాబు తీసుకు వచ్చింది. మేట్రన్ ఆలస్యానికి కారణాలు అడుగుతూ తార నఖశిఖపర్యంతం గుచ్చిగుచ్చి చూసింది. తార చెప్పిన జవాబు ఆమెకు తృప్తి కలిగించ లేదు. పైగా తారమీదనే అనుమానపడ్డది. ఆ మరునాడు తార ప్రవర్తన సరిగా లేదని రిపోర్టు చేసి తీయించింది.

దూరంగా పడుకున్న మార్గరెట్ తార చెప్పినదంతా వినగలిగింది.

అయితే ఇంతమందిలో తారనే మేట్రన్ తన పనికొరకు ఎట్లా ఎన్నుకోగలిగింది? తార తనపనికి తగిన మనిషని ఎట్లా గ్రహించింది ?

మార్గరెట్ మెల్లగాలేచి తార దగ్గరికి వచ్చి 'తారా, ఎక్కడ ఉంటున్నావు?' అడిగింది జాలిపడుతూ.

'మేల్ నర్సు శివానందం లేడూ? అతడు తన యింటి దగ్గర ఒక చిన్నగది చూపి పెట్టాడు. ఆ గదిలో ఉంటూ చుట్టు ప్రక్కల పిల్లలకు చదువు చెబుతున్నాను. ఎనభై రూపాయలు వస్తున్నాయి. ఈ నెలనుంచీ ఒక చిన్న స్కూలు పెడదామని చూస్తున్నాను.. దానికి కొంత పెట్టుబడి కావాలి.'

'పెట్టుబడి ఎక్కడినుంచి తెస్తావు?'

'శివానందం లేడూ? అతడే ఏర్పాటు చేస్తాడు. ఎలాగో బ్రతక్కపోను. ఆ మేట్రన్ నా మీద ఎన్ని కుట్రలు పన్నిందో తెలుసా? నా మీద అనుమానం వల్ల అట్లా చేసింది. అందులో నా తప్పేముంది? అయినా ప్రకాష్ అటువంటి మనిషి తన ఒక్క దానితోనే తృప్తి పడుతున్నాడని ఎందుకు భ్రమపడుతోందో తెలియదు. అతడి యిష్టానిష్టాలకు నేను బాధ్యురాలినా?' తిరస్కార సూచకంగా నవ్వింది తార.

అందరూ కళ్ళు పెద్దవి చేసుకుని చెవులు దోరగిల పెట్టుకుని వింటున్నారు.

'ఇక్కడ పడుకో, తెల్లవారి వెళ్ళుదువు గాని' అంటూ లేచింది మార్గరెట్.

'తెల్లవారే వరకూ నేను ఎట్లా ఉంటాను? వెళ్ళిపోవాలి. ఒంటిగంట తరువాత శివానందం వస్తాడు.'


మార్గరెట్ పడక చేరుకున్నది. స్కూలు వదలిపెట్టి ఇక్కడికి వచ్చినా ప్రేమాయణాలు వదలి పెట్టలేదు కరుణ మేరీలకూ స్కూలు వాతావరణమూ తప్పించుకుందను కుంటే ఇక్కడా తటస్థ పడ్డాయి. ఎక్కడ ఆడపిల్లలు ఉంటే అక్కడ ఇటువంటి గొడవలు ఉంటాయా? లేక ఇక్కడేనా? ఇటువంటి గొడవలు ఎందుకు బయలు దేరుతాయి? ఆమె కన్నె మనసు అర్థం కాక కొట్టుకుంది.

మొదట తారను చూడగానే ఆమె చెల్లెలు కమలను చూసినట్లనిపించింది మార్గరెట్‌కు. పిలిచి మాట్లాడాలనిపించింది. తార నవ్వుతుంటే భుజాల మీద చేతులు వేసి కౌగలించుకోవాలనిపించింది, కాని తరువాత — తరువాత తార చేస్తున్న అల్లరి చూస్తే వెగటు పుట్టింది. ఆమె కొంటె చేష్టలు అసహ్యమనిపించాయి. తార గాలిసోకితేనే మైల పడతానని భయపడ్డది. తారకు దూర దూరంగా తిరగటం మొదలు పెట్టింది.

చదువుకోవాలని మతము మార్చుకున్నది. కళ్ళు మూసుకుని ఏదో విధంగా స్కూలు ఫైనలు ముగించింది. హైస్కూలు బోర్డింగులో కరుణ మేరీల సాంగత్యంలో తనకేవిధమయిన కీడు కలుగకుండా బయట పడ్డది. ఈ కోర్సు మంచి కూడా బయట పడగలిగితే ధన్యురాలు. ఆ బోర్డింగులో ఉండగా మాట కఠినమయినా తనకు పెద్ద దిక్కుగా నిలబడి తన మంచి చెడ్డలు చూసిన మాదయ్య ఆమెకు జ్ఞాపకం వచ్చాడు.

గడియారం టంగు టంగున నాలుగు గంటలు కొట్టింది. మార్గరెట్ లేచి పక్క చుట్టింది.

(ఇంకా ఉంది)





ప్రేమ-పన్నాగం

అమర్

'ఏదో ఏదో ఏదో ఏదో ఔతున్నది—ఇదే ఇదే ఇదే ఇదే బాగున్నదీ' రాగం తీస్తూ జడ అల్లుకుంటూంది మంజు. 'అయ్యిందామ్మా, అలంకరణా! త్వరగా బయల్దేరుతావా! లేదా' విసుక్కుంటూ వచ్చింది అనూరాధ. 'పదపదవె వయ్యారి అనురాధా'—పాడుకుంటూ రాధ వెనుక బయల్దేరింది మంజు. ఇద్దరూ స్టేషన్‌కి చేరుకునేసరికే ట్రైన్ వచ్చివుంది ప్లాట్ ఫారమ్‌మీద. ఎక్కేజనం దిగే జనం. రద్దీగా వుంది ప్లాట్‌ఫారమ్. ఒక్కో కంపార్ట్‌మెంట్ వెతుకుతూ నడవసాగేరు స్నేహితురాళ్లిద్దరూ.

రాధ బావ మధుబాబు డాక్టరేట్ పుచ్చుకుని విశాఖపట్నంలో ప్రాక్టీస్ పెట్టడానికి వస్తూన్నట్టు ఆ రోజే టెలిగ్రాం ఇచ్చాడు. రాధ విశాఖలోనే హాస్టల్‌లో వుంటూ చదువుకుంటూంది. రాధ క్లాస్‌మేట్ మంజు. ఇద్దరూ ఒక్కరూమ్‌లోనే వుంటూన్నారు. ప్రాణస్నేహితురాళ్లు.

'ఏడనున్నాడో! ఎక్కడున్నాడో నీ చుక్కలరేడు! ఏడనున్నా...' మోచేతితో మంజుని పొడిచింది రాధ 'స్టేషన్‌లో కూడ ఏమిటే నీ రాగాలు. కాస్త నోరు మూసుకో' అంటూ. టక్కున నోరు మూసుకుంది మంజు. ఇంతలో సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోంచి దిగుతూన్న ఒక వ్యక్తిని చూచి 'ఏయ్ మధూ!' అంటూ పరిగెత్తింది రాధ. 'హమ్మయ్య! వచ్చావా! రాలేదేమో అనుకున్నాను' సామాన్లు దింపుతూ మంజును చూసి 'అన్నట్టు వీరు...' అర్థోక్తిలో ఆగి ప్రశ్నార్థకంగా చూశాడు మధు.

'ఆఁ చెప్పడం మరిచాను. ఈవిడగారు మై క్లాస్‌మేట్, రూమ్‌మేట్ అండ్ మై బెస్ట్ ఫ్రెండ్ మిస్ మంజులా' పరిచయం చేసింది రాధ. 'ఓ! నమస్తే!' సమాధానంగా చేతులు జోడించి ఊరుకుంది మంజు. దారంతా ఏదో హస్కు కొడుతూ నడుస్తున్నారు రాధా మధు మౌనంగా అనుసరిస్తూంది మంజు. అప్పటికి జ్ఞాపకం వచ్చింది కాబోలు, రాధ వెనుతిరిగి అంది 'ఏమోయ్! మూగనోము పట్టావా ఏం? నీ రాగాలేమైనాయ్? అన్నట్టు మధూ! మా మంజు ఎంత చక్కగా పాడుతుందనుకున్నావ్ లే

'అలాగా ! నాకెప్పుడైనా మీ పాట విని పించాలి మరి' మంజువైపు తిరిగి చనువుగా అన్నాడు మధు.

నుదురు కొట్టుకుంటూ అంది రాధ 'అయ్యొ రాతా ! కొత్తగా ఒకపాట వినిపిస్తుందా ! అది నోరువిప్పితే రాగాలే వస్తాయ్ మాటల కన్నా. విని విని విసుగెత్తి పోవాలి మనం.'

'ఊ హూఁ అలాగా ! అలా వుంటేనే మంచిది. మన బాధలన్నీ మరిపించేదీ, ఆరోగ్యాన్ని కలిగించేదీ అయిన మంచి ఔషధం సంగీతమే ! తెలుసా,'

'సరి సరి ! ఈ డాక్టరు బాబూ, ఆ రాగాలమ్మా ఇద్దరూ కలిస్తే ఇక రోగాలు మన జోలికే రావు' ముగ్గురూ నవ్వుకున్నారు.

'ఏయ్ మంజూ ! ఏమిటలా మూంగిలా వున్నావ్ ! మాట్లాడవేం ?'

'నోరు మూసుకోమన్నావ్‌గా !' మూతి సున్నాలా చుట్టింది మంజా. రాధా మధు ఫక్కుమని నవ్వారు.

* * *

'మంజూ !'

ఏదో చదువుకుంటూన్నదల్లా తిరిగి చూసింది 'ఏమిటి?' అన్నట్టుగా.

'నీకు ఓ విషయం చెప్పాలి' మెల్లిగా అంది రాధ.

'ఏమిటో ?'

'నేను ఓ సమస్యలో చిక్కుకున్నాను. అదెలా పరిష్కరించాలో అర్థం కావడం లేదు.'

పుస్తకం పడేసి గిర్రున వెనక్కి తిరిగింది మంజా. 'నీకా! సమస్యా! నిజమా !! ఏదీ ఏదీ చెప్పు విందాం !' కుతూహలంగా అడిగింది.

'వేళాకోళం కాదుగానీ విను చెప్తున్నా. మా అమ్మా నాన్నా అందరూ మా మధుబావకి నన్నిచ్చి పెళ్ళిచేయ్యాలనుకుంటున్నారు. మరి నా కిష్టంలేదు. ఎలా ?'

ఆశ్చర్యంగా కొద్దిసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది మంజా. 'అదేమిటే ! నీ కిష్టం లేదూ ! ఏం ? ఎందుకని ?'

'చాలోయ్ ! నీ పాట. నీకు రవిగారు తెలుసుకదూ ?'

'రవిగారా! రవిగారంటె ఆ కవిగారేనా?'

'అవును. మే మిద్దరం పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాం. కాని మా యింట్లో అంతా చచ్చినా ఒప్పుకోరు అతన్ని చేసుకోవటం. రవికి కూడ వాళ్ళ వాళ్ళు వేరే సంబంధం చూస్తున్నారట!' దీనంగా అంది రాధ.

మామూలు కథే అన్నట్టు తేలిగ్గా నవ్వేస్తూ అంది మంజా. 'ఓస్! ఇదేనా ! అందుకని నేను చెప్పేదేమంటే వెంటనే మధును పెళ్ళిచేసుకో. సినీ హీరోయిన్‌లా ఎందుకొచ్చిన ప్రేమలూ, సఫలం కాకపోతే విషాద గీతాలూను.'

'చాల్లే ! ఏదో స్నేహితురాలవని చెప్తే బోడి సలహా చెప్పావు' కోపంగా వెను తిరిగింది రాధ 'ఆఁ ఆఁ నిలు నిలు నిలునిలూ నా కోసం. తగ్గించాలి నీ కోపం. హల్లో ! నిలు!!' పాడుతూ వెళ్ళి చేయిపట్టి ఆపింది మంజా. విసురుగా వచ్చి కూచుంది రాధ.

'అలిగితివా ! సఖీ ! ప్రియా కలత మానవా !'

'నీకుచెప్పటం శుద్ధ దండగ. ఎప్పుడూ సినిమా గోలేగాని మనుషుల్ని అర్థం చేసుకోలేవు' రోషంగా అంది రాధ.

'అది సరే ! మరి మధు ఏమంటున్నాడట !' మళ్ళీ అసలు విషయంలోకి వస్తూ సాలోచనగా అన్న మంజా మాటలకు కోపం ఎగిరిపోగా మళ్ళీ జాలిగా మొహం పెట్టి అంది రాధ — 'ఏమో! మధు మనసేమో నాకు తెలియదు. ఒకవేళ మధు మన పార్టీయే అయినా లాభం లేదు మంజూ ! మా వాళ్ళంతా నాకు వేరే ఎక్కడైనా మరో సంబంధం చూస్తారుగానీ ఆ రవిని మాత్రం చేసుకోనివ్వరు. రవీ వాళ్ళదీ మావూరే ! వాళ్ళకీ మాకూ ఏవో పార్టీ కక్షలూ అవీ వున్నాయి'

'ముందు మనం మధు అభిప్రాయం తెలుసుకొని తర్వాతేంచెయ్యాలో ఆలోచిద్దాం, ఏం ?'

* * *

ఆ రోజు రాధ ఎవరో ఫ్రెండ్ ఇంటికెళ్ళింది. ఏం తోచటం లేదు. 'గోదారీ గట్టుంది. గట్టుమీద చెట్టుంది'— పాడుకుంటూ కూచుంది మంజా.

'చెట్టుప్రక్కని పిట్టుంది. పిట్ట మనసులో ఏముందో' అంటూ వచ్చాడు మధు. మధు మంచితనం కలుపుగోరుతనం చూచి అతనితో చనువుగానే వుంటూంది మంజా. అతన్నిచూసి నవ్వుతూ అందామె—'ఆరునెలలు సహవాసం చేస్తే వారే వీరు వీరే వారు అవుతారుట. ఈ నెల రోజులకే డాక్టరుగారు నాలా రాగాలారంభిస్తున్నారే!'

'మరో నెలరోజులకు మీరు నాలా రోగాలు నయంచేస్తారేమో' కొంటెగా చూస్తూ అన్నాడు.

'ఉహూఁ నేను కాదుగానీ మీతో జీవితాంతం సహవాసం చేసే మీ కాబోయే శ్రీమతిగారే తమ రోగాలుకూడ నయం చేయవచ్చు.'

'అలాగా ! ఎవరబ్బా ! నాకే తెలియని నా కాబోయే శ్రీమతి' ఆలోచనా భంగిమలో ముఖంపెట్టి అన్నాడు మధు.

'ఎవరా ? నాతో చెప్పించుకోవాలనా ! సరే, చెబుతున్నా వినండి. కుమారి రా... కాదు కాదు. శ్రీమతి రాధా మధుబాబు. సరేనా !' క్రీగంట చూస్తూ చెప్పింది మంజా, అతని మనోభావాలు కనుక్కోవాలని ప్రయత్నిస్తూ.

కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది. అతనిముఖంలో చిలిపితనం పోయి గంభీరత చోటు చేసుకుంది. కానీ అతని ముఖంలో ఏ భావాలూ కనుగొనలేక పోయిందామె. తర్వాత గంభీరంగా అన్నాడు మధు 'పొరపడుతున్నారు మంజూ ! నేను రాధను పెళ్ళి చేసుకోవటం లేదు.'

'ఏమిటీ !' ఆశ్చర్యంగా చూసిందామె.

'అవును మంజూ ! నాకు తల్లిదండ్రులు చిన్నప్పుడే పోవటం వలన అత్తయ్యా, మామయ్యా చేరదీసి పెంచి చదివించేరు. రాధ, నేను చిన్నప్పటినుంచీ ఒక్కచోటే పెరిగాం. మాకు పెళ్ళంటే నాకు హాస్యాస్పదంగా కన్పిస్తూందెందుకనో. ఒకవేళ రాధకి ఆ వుద్దేశ్యం వుంటేమాత్రం కష్టమార్నాడిని.'

ఎగిరి గంతేసినంత పనిజేసింది మంజా. 'వ్వాట్ ! అయితే మీరు మా పార్టీయేనన్నమాట. హమ్మయ్య ఒకసమస్య తీరింది.'

'సమస్యేమిటీ' — ఈ సారి ఆశ్చర్యపోవటం మధు వంతయింది.

రాధ చెప్పినదంతా మధుతో చెప్పి, 'ఇప్పుడు మన నలుగురి అభిప్రాయాలూ ఒకటే కనుక ఒకపెద్ద ప్లాన్‌వేసి రవి వాళ్ళ వాళ్ళకూ, రాధ తల్లిదండ్రులకూ ఒకనాటకం ఆడించాలి. ఫలితం రాధా రవి

ణాబుల పెళ్ళికావాలి. ఏమంటారు?'

'మీరజాలగలనా తమ యానతి' ఆమె ననుకరిస్తూ, నవ్వుతూ లేచాడు మధు.

* * *

ఆ రోజు పార్కులో స్నేహ చతుష్టయం కలుసుకున్నారు. ప్రశాంతంగా వుంది వాతావరణం. ఎవరూ ఉత్సాహంగా వున్నట్టు లేరు.

'మంజూ !'

'ఏం రాధా !' మోకాళ్ళ చుట్టూ చేతులు పెనవేసి కూచుని తాపీగా ప్రశ్నించింది మంజు.

'రేపటి నుండి సెలవులిచ్చేస్తున్నారు. ఈ సెలవులలోనే నా పెళ్ళి చేసేస్తా వంటారో ఏమిటో ! మా వాళ్ళు. సెలవులకు వూరెళ్ళటానికే భయం వేస్తూంది. ఏంచేయాలో తోచటం లేదు. ఏంచేద్దాం?'

'నాకూ ఏం తోచటం లేదు.' నిర్లక్ష్యంగా అంది మంజు. కొంతసేపు నిశ్శబ్దంగా గడచింది. 'అంతా భ్రాంతియేనా. జీవితానా వెలుగింతేనా. ఆశా నిరాశేనా ! మిగిలేదీ చింతే...' శూన్యంలోకి చూస్తూ సినీ హీరోయిన్‌లా ముఖంపెట్టి, రాధను ఉడికించేలా పాడేస్తూంది మంజు.

కస్సుమంది రాధ 'ఏంచేయాలో తోచక నేనేడుస్తూంటే నీకు సంతోషంగా వుంది కాబోలు. రాగాలు తీస్తున్నావు.'

'ఎందుకలా కోప్పడతావూ ! ఇదేం కామెడీసాంగ్ కాదుకదా ! ఊఁ...' మూతి

ప్రేమ-పన్నాగం

సున్నాలా చుట్టి, ఒక్కొక్క అక్షరం వత్తి పలుకుతూ దీర్ఘంగా అన్న మంజు మాటలకు అందరితోపాటు రాధకూడ నవ్వేసింది.

'ఆఁ. ఐడియా!' ఉన్నట్టుండి గట్టిగా అంది మంజు.

'ఏమిటండీ! ఏమిటి ? ఏ కొంప మునిగింది ?' నవ్వులాపి ఆత్రంగా ప్రశ్నించేరు మిగిలిన శ్రోతలు.

'రవిగారూ ! మీ యింటి అడ్రస్ ఓసారి ఇస్తారా?' సీరియస్‌గా అడిగిందిమంజు.

'ఎందుకండీ ?' ఆమె కొచ్చిన ఐడియాకి అడ్రసేం చేస్తుందో అర్థం కాలేదతనికి.

'కావాలి.'

చెప్పాడు రవి. 'ఇప్పుడు మీరు చేయవలసిందేమిటీ అంటే' మెల్లిగా అందరికీ చెవిలో చెప్పింది మంజు. 'తర్వాత దీనివల్ల తాత్కాలికంగా కొందరు బాధపడ్డా ఇంతకు మించి చేసేదేం లేదు' అంది.

'క్వయిట్ ఓ. కె. మంజుగారూ' రవి అంగీకరిస్తూ తలవూపేడు.

'మీ బ్రెయిన్ బ్రహ్మాండమైనది'మధు ప్రశంసించాడు.

'బ్రహ్మాండం కాకపోయినా మీ చికిత్స అనవసరం లెండి' జవాబుగా అంది మంజు. నవ్వుతూ లేచారంతా.

* * *

సెలవులిచ్చినా రవి వాళ్ళవూరు వెళ్ళలేదు. చావడిలో కూచుని వున్నారు రవి తండ్రి వెంకట్రామయ్యగారు. 'కొడుకు శలవులకు రాకపోవడానికి కారణమేమిటా'ని ఆలోచిస్తున్నా రాయన.

'రవిగారి ల్లిదేనాండి ?' ఓ అమ్మాయి ప్రవేశిస్తూ అడిగింది.


'అవునూ. ఎవరమ్మా నీవు ?'

'నా పేరు మంజుల. రవి క్లాస్‌మేట్‌నండీ. రవిగారిప్పుడు హాస్పిటల్‌లో వున్నారు...' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా, కూచుని వున్నవారు కాస్త హఠాత్తుగా లేచినుంచుని ఆత్రంగా అడిగారాయన 'మా రవా ! హాస్పిటల్ లోనా ! ఏం జరిగిందీ ?'

'ఏం లేదండీ ! మీ అబ్బాయి కథలు రాస్తుంటారు కదండీ, పాపం రోడ్డుమీద నడుస్తూకూడ ఆలోచిస్తూంటారు కాబోలు. ఉన్నట్టుండి ఒక కారు పరధ్యానంగా నడుస్తున్న మీ అబ్బాయి ప్రక్కనుండే దూసుకు పోయింది. కారు తాలూకా ఆచూకీ దొరకలేదు. యాక్సిడెంట్ కాగానే రివ్వున దూసుకు పోయింది కారు, ఎక్కువ జన సంచారం లేని రోడ్డుమీద. అదే దారిలో మా స్నేహితురాలొకామె వెళ్తూ వెళ్తూ అతన్నిచూసి చుట్టుపక్కల కొందరి సాయంతో హాస్పిటల్‌లో జాయిన్ చేయించింది. ప్రమాదకరమైన దెబ్బలు తగల్లేదు కానీ శరీరంలోంచి చాలా రక్తం పోయినందువల్ల రక్తంఅవసరమన్నారు డాక్టర్లు. మా ఫ్రెండ్ పాపం తన రక్తంకూడ ధారపోసి మీ అబ్బాయిని బ్రతికించింది. ఇప్పుడు బాగానే వున్నారు. మా వాళ్ళిక్కడ వున్నారు. శలవులలో ఇక్కడికి నేను రావటం తెలిసి రవిగారు వారి ఇంటి అడ్రసిచ్చి మీకీ విషయం చెప్పమన్నారు. ఈ వుత్తరంకూడ యిమ్మన్నారు.'

అందుకున్నారు వెంకట్రామయ్యగారు. అప్పటికే ఆయన కంట్లోనుండి నీరుకారి పోతూంది. అవును పాపం. ఒక్కగా నొక్క కొడుకు మరి. అపరిమితమైన జాలి కలిగింది మంజుకి.

కన్నీటి పొరల్లోంచి అతనా కాగితాన్ని చదివేరు. 'నాన్నా ! అన్ని సంగతులూ గ్రహించేవుంటా రీపాటికి. ఈ సెలవులకి ఇంటికి రాకపోవడానికి కారణంకూడ అదే.



ఒకమ్మాయి నా ప్రాణాలు కాపాడింది. ఆమెకు ఏమిచ్చినా రుణం తీరదు. ఇక వుంటాను...మీ రవి.' 'అవును బాబూ! ఆమెకు ఏమిచ్చినా రుణం తీరదు. మన కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలి' స్వగతంగా అన్నట్టు పైకే అనేసా రాయన.

ఏదో చెప్పబోతూన్నట్లు ఇంకా నిల్చుని ఆయనవైపు పరిశీలనగా చూస్తూన్న ఆమెను ప్రశ్నార్థకంగా చూశారాయన. కొంచెం సందేహిస్తున్నట్లుగా అంది మంజు 'చూడండి! ఒకచిన్నకోరిక. మీ కృతజ్ఞత నెలా చూపాలో నేను చెప్తాను. దయచేసి వింటారా?'

'సందేహించకుండా చెప్పమ్మా!'

'మీ అబ్బాయి తన కృతజ్ఞత నింకోలా చూపాలని ప్రయత్నిస్తున్నారు'

కొంచెం ఆగి మళ్లీ అందామె 'మీరు... అంగీకరిస్తారా?'

'వివరంగా చెప్పమ్మా! భయపడుతున్నావేం?'

'రవిగారు మా ఫ్రెండ్‌ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు. మీరు...'

'తప్పకుండా అంగీకరిస్తానమ్మా' సంతోషంగా అందుకుని అన్నారాయన.

'ఆమె ఎవరైనా మీ కభ్యంతరం లేదా?' ఆమె సందేహం ఇంకా తీరలేదు.

'చనిపోవలసిన నా కొడుకును బ్రతికించిన దేవత ఎవరైతే ఏమమ్మా. ఆమెది ఏకులమైనా దేవుని సాక్షిగా తప్పకుండా నా రవి కిష్టమైతే ఈ పెళ్లి జరిపిస్తాను. సందేహం ఇప్పటికైనా తీరిందామ్మా?' నవ్వుతూ అన్నారాయన.

'చాలా సంతోషమండీ నే వెళ్లొస్తాను'

'మంచిదమ్మా' కళ్లొత్తుకుంటూ 'అంతా ఈశ్వరేచ్ఛ' అనుకున్నా రాయన.

* * *

రవి రూమ్‌లో మధు, రవి మాట్లాడుకుంటూండగా, వెంకట్రామయ్య గారు ఆదరా బాదరాగా రావడం చూసి త్రుళ్లిపడ్డాడు రవి. మధు ఆశ్చర్యంగా 'ఎవరండీ?' అన్నాడు.

'మా నాన్న'

వెనుతిరిగి వెంకట్రామయ్యగార్ని చూసి 'హో. నాటకం మొదలు పెట్టాలన్న మాట'

వెంటనే చేతులకీ, కాళ్లకీ రెండు మూడు కట్లు కట్టించుకుని మంచంమీద వాలిపోయాడు రవి. వెంకట్రామయ్యగారు ఆత్రంగా వచ్చి కూచుని 'ఎలా వుంది బాబూ!' అని ప్రశ్నించారు. 'హాస్పిటల్ నుండి నిన్ననే డిశ్చార్జి చేశారండి. ఇంకా రెండు మూడు రోజుల్లో కట్లుకూడా విప్పేయవచ్చు. అంతా పాపం ఆ అమ్మాయి దయవల్ల రవి బ్రతికారు.' గబ గబా కంఠతా పట్టినట్టు మధు జవాబుచెప్పాడు.

ప్రేమ-పన్నాగం

'అయితే బాబూ! అంతా విన్నావా' అన్నట్టు మీరు కూడ నా రవి ఫ్రెండ్ మేనా?'

'కాదు నాన్నా! నా ఫ్రెండ్. అతని పేరు మధు డాక్టరు మధు'

'అలాగా! అన్నట్టు నేను త్వరగా వెళ్ళిపోవాలి మళ్ళీ. బోల్డు పనులున్నాయి వాటన్నిటినీ వెనక్కినెట్టి నిన్ను చూసి పోదామని వచ్చాను.'

'అప్పుడేనా నాన్నా!' వెళ్ళిపోవాలని మన సులో కోరుకున్నా మాట వరుసకు అన్నాడు రవి. 'మళ్ళీ త్వరలోనే వస్తాను. నేను దూరంగావున్నా నిన్ను కనిపెట్టుకునే స్నేహితులున్నారు. అదే సంతోషం' మధును ఆప్యాయంగాచూస్తూ అన్నారు. ఆ సాయం త్రమే తిరుగు ప్రయాణం కట్టారాయన. రవి, మధు ఊపిరి పీల్చుకున్నారు.

* * *

సెలవులు గడిచాయి. కాలేజీలు తెరి చారు. సెలవులకు ఇంటికెళ్ళిన రాధ ఆ రోజే హాస్టల్‌కి వచ్చింది. అంతకు ముందు రోజునే వచ్చిన మంజుని అడిగింది. 'ఎంత వరకు వచ్చింది ప్లాన్'

'ఇంతవరకూ బ్రహ్మాండంగా సక్సెస్ అయింది. మరి నువ్వేం చేశావ్ ?'

'నో యూజ్. నీవు చెప్పటం చేయకపోవడ మూనా. సెలవులలో మధుకూడ ఇంటికి వచ్చి మూడు రోజులుండి వెళ్ళాడు. అప్పుడే పెళ్ళి ప్రస్తావన వచ్చింది. మధు మావాళ్ళతో తనకి పెళ్ళి చేసుకోవాలని లేదనీ, రాధకి వేరే సంబంధం చూసుకోమనీ నిక్క చ్చిగా చెప్పేశాడు. ఎన్నివిధాల చెప్పినా లాభంలేక పోయేసరికి వేరే సంబంధాల కోసం అన్వేషణ మొదలెట్టారు మా నాన్న. వచ్చిన వాళ్ళందరికీ ఏవో వంకలుపెట్టి పంపించాను. అన్నిసార్లూ ఇలాగే జరగడం చూసి విసుక్కుని నాన్నే ఒక సంబంధాన్ని నిశ్చయం చేశారు. అమ్మకికూడ చెప్పినా సంబంధం వద్దని. ఫలితం లేకపోగా, వాళ్ళకి 'నేను మంచిదాన్నికాదనీ, నామీద ఎన్నో వదంతు లున్నాయనీ, మీరు మోస పోతున్నారనీ' ఎవరో వ్రాసినట్టుగా ఓ ఆకాశ రామన్న ఉత్తరాన్ని సృష్టించేను. ఆ సం బంధం అలా ఫెయిల్ అయింది. మరో రెండుసార్లు రెండు సంబంధాల్ని అలాంటి ఆకాశరామన్న ఉత్తరాలతోనే వెడగొట్టేను. ఏం చేయను. నానోటితో నన ఎదిరిపార్టీ వాళ్ళబ్బాయిని చేసుకుంటానని ఎలా చెప్పడం? చెప్పినా ఫలితం జీరో. ఒక ఆడపిల్ల తనగూర్చి తనే అలా చెడుగా వ్రాసుకోవడం అదే ప్రథమమేమో! ఈ సెలవులలో ఇంటికెళ్ళి నేను చేసిన నిర్వాకం ఇది. నాకింక పెళ్ళి కాదేమోనని భయపడుతున్నారు మావాళ్ళు. ఇప్పుడింక ఎవరడిగినా ఇచ్చేసేటట్టున్నారు. వారి నిస్సహాయస్థితిని చూస్తే బాధ కలుగు తూంది' బాధగా అంది రాధ.

'భేష్ బావుంది. అంతా సవ్యంగా జరుగు తుందిలే' రాధ భుజం తడుతూ అంది మంజు సంతోషంగా.

'అయ్యింది అయ్యింది అనుకున్నది'... అనుకోనిదేదో మిగిలున్నది' అంటూ ప్రవే శించాడు మధు.

'అనుకోనిదేమిటో?' చిలిపిగా ప్రశ్నిం చింది మంజు.

'తమరు చాలా కష్టపడుతున్నారే! మీకేమిటి లాభం చెప్పండి?'

'తమకు లాభమేగా! ఇష్టంలేని పెళ్ళి నుండి తప్పించేను.'

'పోనీ! ఎలాగు శ్రమ పడ్డారు. ఇంకొంచెం శ్రమపడి ఇష్టమున్న పెళ్ళి జరిపించి పుణ్యం కట్టుకోకూడదూ!'

'మీ ఇష్టం ఏమిటో నాకేం తెలుసు' నిర్లక్ష్యంగా అంది మంజు.

'వాళ్ళిద్దరి పెళ్ళికోసం మనం తంటాలు పడుతున్నాం. వాళ్ళతో పాటు మన పెళ్ళి కూడ జరిగిపోతే కథ సుఖాంతం'—గబగబా అనేశాడు మధు.

'మన పెళ్ళా!' కోపంగా చూసింది మంజు. కొంచెం భయపడ్డాడు మధు. 'అంటే...అంటే మనిద్దరికీ పెళ్ళి అని కాదు నా ఉద్దేశ్యం. మీ పెళ్ళి; నా పెళ్ళి కూడ...అని అంటే... అంతే!' అతని తడబాటు చూసి నవ్వింది మంజు.

రాధ కూడ నవ్వేస్తూ, నాకు తెలుసులే బావా నీ ఉద్దేశం. కానీ మీ యిద్దరికీ పెళ్ళంటే, మంజు వాళ్ళ వాళ్ళని ఒప్పించ టానికి మరో నాటకం ఆడాలేమో అంది.

'[illegible] తల అడ్డంగా తిప్పుతూ మంజు, 'ఆ భయమేం లేదు. మా అన్నయ్యా, వదినా నేనెవర్ని పెళ్ళి చేసుకున్నా అడ్డు చెప్పరు. ఉత్తమ ఆదర్శాలు కలవారు. అందులోనూ డాక్టర్లు లాంటి పెద్ద పదవిలో వున్నవారైతే అసలు భయపడాల్సిన అవసరం లేదు. నా సుఖమే వారికి కావలసినది.'

వెంటనే అందుకుంది రాధ 'అంటే మా బావను చేసుకోవటం నీ కిష్టమేనన్న మాట!'

పెదవి కొరుక్కుంది మంజు నవ్వును దాచాలని ప్రయత్నిస్తూ, 'అది కాదు రాధా...' అని ఏదో అనబోయింది.

వినిపించుకోనటు గా అంది రాధ 'ఏది కాదు. నీ ముఖమే చెప్తోంది నీ మనసును విప్పి.' మూతి తిప్పుతూ వెక్కిరిస్తూ వెళ్ళిపోయింది మంజు.

'రెండో సమస్య తీరింది' ఊపిరి తేలిగ్గా పీల్చుతూ అంది రాధ. నవ్వుకుంటూ హాస్పిటల్‌కి వెళ్ళిపోయాడు మధు.

* * *

కాలేజీలో గర్ల్స్ వెయిటింగ్ రూమ్‌లో కూచుని వున్నారు రాధ, మంజు. ఆదరా బాదరాగా వచ్చాడు రవి. 'రాధా! మా నాన్న మళ్ళీ వస్తున్నట్టు వుత్తరం వ్రాసారు. మొన్న వొచ్చినప్పుడు పని తొందరలో అప్పటకప్పుడే వెళ్ళిపోయారు. నిన్ను పరిచయం చేయటానికి వీలు కాలేదు. మొన్న వొచ్చినప్పుడు మధును చూసినా, చిన్నప్పుడే పై చదువులకోసం దూరంగా వెళ్ళిపోయి డాక్టరుగా తిరిగి వచ్చిన మధును పోల్చుకో లేదు. నిన్ను పోల్చుకుంటారు. ఎలా?' నగరుస్తూ అన్నాడు రవి.

'అంటే కథ క్లైమాక్స్‌లో వుందన్న మాట!' మంజు సాలోచనగా అంది.

రాధ మాత్రం కంగారు పడుతూ అంది 'నాకేమిటో భయంగా వుంది. నన్ను చూస్తే ఆయనీపెళ్ళికి వప్పుకుంటారా' అని.

'ఓయస్. ధైర్యంగా వుండు' అభయమిచ్చింది మంజు.

ఆ సాయంత్రమే రాధను వెంకట్రామయ్యగార్కి పరిచయం చేశాడు రవి. త్రుళ్ళి పడ్డారాయన. 'ఈ అమ్మాయి గణపతిరావుగారమ్మాయి కదూ?'

'[illegible]' అన్నాడు రవి.

'ఆ అమ్మాయిని నీవు పెళ్ళిచేసుకుంటావా! వాళ్ళకీ మనకూ అసలు పడదే. వాళ్ళది వేరే...' మాట మధ్యలోనే మంజు అందుకుని అన్నది 'చూడండి వెంకట్రామయ్యగారూ! ఆనాడు రాధ మీ రవిని వేరే పార్టీ వ్యక్తని విడనాడివుంటె మీ రిప్పుడు మీ అబ్బాయిని మీ కళ్ళతో చూసుకునేవారేనా!'

'అది సరేగాని...'

విసురుగా తల ఎగరేసిఅంది 'ఏది సరే! నా కొడుకును బ్రతికించిన దేవత ఎవరైతే నేం? దైవసాక్షిగా ఈ పెళ్ళి జరిపిస్తానన్నారు. మాట తప్పుతారా? మీరు పెద్దవారు. మీకు చెప్పతగినదాన్ని కాదనుకోండి.'

వ్యంగ్యంగా వచ్చిన ఈ సమాధానికి చలించిపోతూ అన్నారాయన, 'లేదమ్మా లేదు. తప్పకుండా ఈ పెళ్ళి జరుగుతుంది' అనేసి వెను తిరిగా రాయన. తృప్తిగా ఒకరిముఖా లొకరు చూసుకున్నారు ముగ్గురూ. ఆ మరునాడే ఆయన తిరుగు ప్రయాణం కట్టారు స్వంతవూరికి.

* * *

'గణపతిరావుగారూ!'

గణపతి వీధిలోకివచ్చి తమ వాకిట నిలుచునివున్న వెంకట్రామయ్యగార్ని చూసి నిర్ఘాంతపోయేడు. 'ఆఁ మీరా!'

'అవును. నేనే మీతో పనివుండి వచ్చాను. మీ సహాయాన్ని కోరటానికి అన్ని అభిమానాలూ, పంతాలు వదిలి మరీ వచ్చాను. మా అబ్బాయికి మీ అమ్మాయి నిచ్చి పెళ్ళిచేయమని అడగటానికి వచ్చాను.' ఒకే వూపులో చెప్పుకు పోయాడాయన. ఆశ్చర్యపోయాడు గణపతి. ధన బలిమిలోనూ, ఫార్టీ బలంలోనూ [illegible] అధికుడు. పైగా [illegible] కూతుర్ని ఇంతవరకూ ఎవరూ పెళ్ళిచేసుకో లేదు. ఏవో పుకార్లతో వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి పోతున్నాయి. అలాంటి సమయంలో, తన ప్రతిపక్షి తనకు తావ్వరావటం మహదాశ్చర్యాన్నే కలిగించింది

'మీరు నాతో పరిహాసం చేస్తున్నారనుకుంటాను' సందేహంగా అన్నాడు.

'అబ్బెబ్బె. అలా ఎప్పటికీ అనుకోకండి' అని మిగిలిన, తనకు తెలిసిన వివరాలన్నీ చెప్పారు. గణపతి చిరునవ్వునవ్వి 'ఏది ఎలా జరగాలని రాసి వుంటే అలా జరుగుతుంది. పెద్దలు పంతాలు పట్టి వేరైనా, పిన్నలు వయ్యాన్ని వియ్యంగా మార్చారు' అన్నారు. తరువాత జరగబోయే ఏర్పాట్లను గూర్చి వారు సేపు చర్చించుకున్నారు మి (త్ర) త్రు (వు) లిద్దరూ.


* * *

'అల్‌సక్సెస్‌మంజూ! త్వరలోనే ముహూర్తాలు నిశ్చయించుకున్నట్టు నాన్నగారు వుత్తరం వ్రాసారు. నీ ఋణం ఎలా తీర్చుకోను?' మంజు చేతులు పట్టి గిర్రున తిప్పేస్తూ సంతోషంగా అంది రాధ.

'ఏముంది? మీ బావను త్యాగం చేసేయ్ రాధా' అన్నాడు రవి. అప్పుడే ప్రవేశించారు మధు, రవి కూడ.

'అవును. మా మధును నీ చేతుల్లో పెడుతున్నాను' అంది పెద్ద త్యాగమూర్తిలా ముఖం పెట్టి రాధ.

'ఓహో! పెద్ద త్యాగం.' మూతి తిప్పింది మంజు. అంతా నవ్వుకున్నారు. మంజు గొంతు సవరించుకుంది 'ప్రేమించుట పిల్లలవంతు, దీవించుట పెద్దలవంతు...' మంజు పాటను మిగిలినవారు అందుకున్నారు, 'పెద్దలు ఔనంటే అది ప్రణయం. కాదని విడదీస్తే అది ప్రళయం...'అని. ●





బులుసు వేంకటరమణయ్య

జ్ఞానసంపాదన చెయ్యలేనివారూ, కర్మలు ఆచరించలేనివారూ అయినవారు తరించ డానికి భక్తిమార్గం ఏర్పడింది. కొందరికి జ్ఞాన సంపాదనశక్తీ, కర్మాచరణ సామర్థ్యమూ ఉన్నా వారు భక్తిమార్గాన్నే అనుసరిస్తారు. ఈ విధంగా ఉన్న భక్తి పలువిధాలుగా ఉంటుంది. అన్నివిధాలూ అందరూ ఆచరించరు. మహాభక్తులయిన వారు కూడా ఏదో ఒక పద్ధతినే ప్రధానంగా ఎన్నుకుంటారు.

భక్తిపద్ధతులు తొమ్మిది. వాటినే నవవిధ భక్తిమార్గాలంటారు. అవి ఏవంటే—

'శ్రవణం కీర్తనం విష్ణోః
స్మరణం పాదసేవనమ్,
అర్చనం వందనం దాస్యం
సఖ్య మాత్మనివేదనమ్.'

భగవంతుని గురించి వినడమూ, విష్ణువును స్తుతించడమూ, తలచుకొంటూ వుండడమూ, భగవత్పాదాలను సేవించడమూ, దేవుని పూజించడమూ, భగవంతుడికి అభివందనం చెయ్యడమూ, దాస్యం చెయ్యడమూ, దేవునితోడి మైత్రీ, ఆత్మార్పణా — ఇవి.

వీటిలో ఎక్కువ తక్కువ భేదం లేదు. ఏమార్గాన్ని అనుసరించినా ముక్తిని పొందవచ్చును—

'శ్రీ విష్ణోః స్మరణే పరీక్షి దభవత్
వైయాసకిః కీర్తనే,
ప్రహ్లాదః స్మరణే, తదంఘ్రి భజనే
లక్ష్మీః, పృథుః పూజనే,
అక్రూర స్త్వభివందనే, కపిపతి
ర్దాస్యేచ, సఖ్యేఽర్జునః,
సర్వస్వాత్మనివేదనే బలిరభూత్
కైవల్యమేషాం ఫలమ్.'

ఎవ్వరు, ఏ మూలంగా భక్తులయి మోక్షాన్ని పొందారో యీ శ్లోకంలో స్పష్టంగావుంది. శృంగిశాపంవల్ల తక్షక సర్పదష్టుడై మరణింపనున్న పరీక్షిత్తు భగవంతుని గురించి విన్నమాత్రాన భక్తుడై ముక్తిపొందాడు. వ్యాసమహర్షి సంకీర్తన చేసి మోక్షాన్ని పొందాడు. బాలభక్తుడైన ప్రహ్లాదుడు సదా భగవన్నామాన్ని స్మరిస్తూ ముక్తుడైనాడు. లక్ష్మీదేవి యెల్లప్పుడూ ఆయన పాదాలను సేవిస్తూ తరించినది. పృథు చక్రవర్తి భగవంతుని పూజించి తన గొప్ప భక్తిని వెల్లడించాడు. బలరామ కృష్ణులను మథురకు తీసుకొని రావడంకోసం కంసుడు ప్రేపల్లెకు పంపించిన అక్రూరుడు శ్రీకృష్ణునికి శరణాగతుడై పాదాభివందనం చేసి ధన్యుడయ్యాడు. ఇక వానర నాయకుడైన హనుమంతుణ్ణి గురించి వేరే చెప్ప నక్కర్లేదు. అతడు శ్రీరామునికి సదా దాస్యం చేస్తూ జీవితాన్ని ధన్యం చేసుకున్నాడు. అర్జునుడో— శ్రీకృష్ణునికి మిత్రుడైనాడు. వారిద్దరికీ వుండే బాంధవ్యంకంటె మైత్రియే గొప్పది. ఆ స్నేహం కారణంగా అర్జునుడు తరించాడు. రాక్షసరాజైన బలిచక్రవర్తి వామనమూర్తి యొక్క మూడో అడుగును తన తలపైనే వుంచవలెనని కోరి తన సర్వస్వంతోపాటు ఆత్మార్పణ చేశాడు. ఆ హేతువుచేత అతడు తరించాడు.

ఈ విధంగా భక్తులైనవారు విభిన్న మార్గాలలో భగవదారాధనా తత్పరులై ఆయన అనుగ్రహానికి పాత్రులైనారు. అందువల్ల ముక్తి పొందగోరే భక్తులు ఏదో ఒక మార్గాన్ని అనుసరించినా చాలును. ●

డాక్టర్ కబుర్లు

చిన్న పిల్లలు ఊపిరి బిగపడితే?

చిన్న పిల్లలు తరచు వూపిరి బిగపెడితే వారి రక్తం పరీక్ష చెయ్యటం మంచిది. రక్తం పుష్కరం కాకపోతే వూపిరి బిగ



పట్టటం రావచ్చుట— ఎందుకో ఇంకా పరిశోధకులకి కూడా సరిగ్గా తెలియదు.

చిన్నపిల్లలు ఏడ్చినప్పుడు వూపిరి బిగపట్టవచ్చు; కొన్ని సమయాలలో తెలివి తప్పవచ్చు; కొన్ని సమయాలలో గిలగిల కొట్టుకోవచ్చు. చివరకి పూర్తిగా హాయిరావచ్చు.

శరీరానికీ, మనస్సుకీ— వీటి రెండిటిలో దేనికి దెబ్బతగిలినా వూపిరి బిగపట్టవచ్చు; దెబ్బలు, బాధ, నిరాశ, ఆవేశం చివరికి నవ్వు కూడా ఈ రకం ఇబ్బంది రావచ్చు.

రక్తం సరిగ్గాలేని పిల్లల నెత్తురులో ఇనుము తక్కువగా ఉంటుంది. ఈలోటు వున్న 580 మందిని పరీక్షించగా 32 పిల్లలకి వూపిరి బిగపట్టటం ఉందిట. రక్తంలోని లోటుకి చికిత్స చేయగా ఇబ్బందులు ఆగిపోయాయిట.

అందుకనే ముందు రక్తపరీక్ష అవసరం.

— హెచ్. ఎల్. హార్నెస్‌సోన్
(కాపీరయిటు)

1969లో మీ రాశిఫలం!

1. మేషం

ప్రతి సంవత్సరం మార్చి 22వ తేదీనుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు సాయన సూర్యుడు మేష రాశియందు ఉంటాడు. కాబట్టి యీ తేదీలమధ్యను జన్మించిన వారు మేషరాశియందు జన్మించిన వారుగా పరిగణింపబడుతున్నారు.

మేషరాశి యందు జన్మించిన వారికి యీ సంవత్సరం మొత్తం మీద బాగానే ఉంటుంది. అప్పుడప్పుడు కొద్ది చికాకులు కలిగినా సంవత్సరాంతానికి వృత్తివ్యాపారాల్లో తగినంత అభివృద్ధిని సాధించగలరు. సంవత్సరం మధ్యలో యెవరితోను వాదప్రతివాదాలకు దిగడం మంచిదికాదు. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటి కంటే బాగా ఉంటుంది.

ఉద్యోగాన్వేషణకులకు తాత్కాలికోద్యోగాలు లభిస్తాయి. అవివాహితులకు సంవత్సరాంతంలో వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులు శ్రమమీద కృతార్థులు కావచ్చును.

జనవరి

వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. ఇదివరకు మీయెడల ముభావంగా ఉన్నవారు కూడా యిప్పుడు మీ అభిప్రాయాలను గౌరవిస్తారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు.

ఫిబ్రవరి

ఇదివరకు మీరు సాధ్యంకావనుకొన్న వ్యవహారాలు కూడా యిప్పుడు సానుకూలపడతాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూల మార్పులు వస్తాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. బంధువుల వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. మీకు మున్ముందు ఉపయోగించగల పరిచయాలు యేర్పడతాయి.

మార్చి

మీరుకొన్ని మొగమాటాలకు లొంగిపోవడం వలన శ్రమకు గురికాగలరు. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వ్యాపారంలో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో మీ అభిప్రాయాలను అధికారులు ఆమోదించగలరు. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి.

ఏప్రిల్

ప్రారంభంలో ప్రతి వ్యవహారమూ ఆకర్షణీయంగానే కన్పిస్తుంది కాని ఆచరణలో లాభదాయకంగా ఉండదు. మీకు అంతగా సంబంధం లేని వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి.

మే

వృత్తిలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. వ్యాపారంలో ప్రయోజనం లేని శ్రమకు గురికాగలరు. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడం వలన ముఖ్యమైన వ్యవహారాలను కూడా వాయిదా వేయవలసి వస్తుంది. కుటుంబ వ్యవహారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలు రావచ్చును. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

జూన్

వ్యాపారంలో మీ ఆలోచనలు మీకే కాకుండా మీ మిత్రులకు కూడా లాభదాయకంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. పుణ్యకార్యాలు చేస్తారు. శుభ కార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

జూలై

వృత్తివ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి, జరిగేది మరొకటి కావచ్చును. కాని ఆదాయం బాగా ఉంటుంది. మీరు యిదివరకు జరిపిన ఆర్థిక వ్యవహారాలవల్ల యిప్పుడు యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురికాగలరు. అలంకార వస్తువులు కొంటారు. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాల్లో తొందరపాటు తగదు.

ఆగస్టు

వ్యాపారంలో శ్రమ మీద స్వల్పాభివృద్ధిని సాధించగలరు. ఇప్పుడు మీరు జరిపే ప్రయత్నాలవల్ల మున్ముందు ఉపయోగం ఉంటుంది. సాహిత్యకళా రంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. కుటుంబ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. అధిక వ్యయం జరుగుతుంది.

సెప్టెంబరు

వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. భవిష్యత్తులో మీకు ఉపయోగించగల వ్యవహారాల్లో చొరవ చూపించవలసిన సమయం. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరతాయి.

అక్టోబరు

ఈ నెల యే వ్యవహారంలోను విశేషమైన ఫలితాన్ని ఆశించడానికి అవకాశంలేదు. వృత్తివ్యాపారాల్లో సాటివారితో పోటీ పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాలల్లో మెప్పుకురాని బాధ్యతను వహించవలసి వస్తుంది. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయడం తగదు. దైవ కార్యాలు నెరవేరుతాయి.

నవంబరు

కొన్ని వ్యవహారాల్లో అనుకోని చికాకులు కలిగినా, సమయానికి మిత్రుల సహకారం లభిస్తుంది. వృత్తివ్యాపారాల్లో ప్రయోజనం లేని శ్రమకు తరుచుగా గురికాగలరు. స్థిరాస్తి వ్యవహిహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ఆరోగ్యం బాగాఉంటుంది. కుటుంబ సంతోషం లభిస్తుంది.

డిశంబరు

వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీకృషి రాణిస్తుంది. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. శుభ కార్యాల విషయంలో మీ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

2. వృషభం

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21వ తేదీ నుంచి మే 21వ తేదీవరకు సాయన సూర్యుడు వృషభ రాశి యందు ఉంటాడు కాబట్టి యీ తేదీలమధ్యన జన్మించినవారు వృషభరాశి యందు జన్మించిన వారుగా పరిగణింపబడుతున్నారు.

వృషభరాశి యందు జన్మించిన వారికి యీ సంవత్సరం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. వృత్తివ్యాపారాల్లో ప్రయోజనం కంటే ప్రయాస అధికంగా ఉంటుంది. ఏ వ్యవహారంలోను పెద్ద మార్పులు చేయడానికి యిది సమయంకాదు. ఉద్యోగంలో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. విశేషమైన అనుకూలతను ఆశించడానికి అవకాశం లేదు.

ఉద్యోగాన్వేషకులకు యీ సంవత్సరం బాగా ఉండదు. తాత్కాలికోద్యోగాలు లభించినా అవి యెంతో కాలం నిలవక పోవచ్చును. అవివాహితుల వివాహ ప్రయత్నాలు చాలా శ్రమమీద నెరవేరవచ్చును. విద్యార్థులుమొదటినుంచీ శ్రద్ధగా చదవడంఅవసరం.

... మీ రాశిఫలం

జనవరి

ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. వృత్తిలో మీకు ముందు ఉపయోగించగల వ్యక్తులను కల్సుకొంటారు. కొంతమంది వ్యక్తులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం వలన మీకు యిబ్బందిని కలుగుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

ఫిబ్రవరి

మీ ఆత్మవిశ్వాసమే అన్ని వ్యవహారాల్లోను అనుకూలతను సాధించగలదు. వృత్తి వాపారాల్లో యిదివరకు ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు లాభదాయకంగా పూర్తి చేయగలరు. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటి కంటే బాగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో నూతన గౌరవాన్ని పొందగలరు.

మార్చి

ఈ నెలలో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వృత్తిలో పోటీవారితో యేర్పడిన పోటీ తగ్గిపోతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. అవసరానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో నూతన పరిచయాలు యేర్పడతాయి. కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరుతాయి.

ఏప్రిల్

ఈ నెల అన్ని వ్యవహారాల్లోను జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. వ్యాపారంలో కొంతమంది వ్యక్తులు మీకు లేని ఆశలు చూపిస్తారు. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో యితరులు చేసిన పొరబాట్లవల్ల మీకు యిబ్బంది కలుగుతుంది. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడివస్తుంది.

మే


ఇదివరకు మీకు కొన్ని వ్యవహారాల్లో యేర్పడిన సందేహాలు తొలగిపోతాయి. మీకు యిష్టం లేకపోయినా, యితరుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసి వస్తుంది' వృత్తిరీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషికి స్వల్పఆటంకాలు వస్తాయి. బంధుమిత్రులను కల్సుకొంటాడు.

జూన్

వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరుతాయి. మీకు సహాయంచేస్తామన్న వారు సమయానికి తప్పుకొనే ప్రమాద ఉంది. వ్యాపారంలో కార్యసాధనకోసం అవాంఛనీయులైన వ్యక్తులతో సన్నిహితంగా ప్రవర్తించవలసి వస్తుంది. సమయానికి యేదోఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి.

జూలై

వ్యాపారంలో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు కార్యరూపాన్ని ధరిస్తాయి.వృత్తిలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. అధికారులవలన జరుగవలసిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. కోర్టు వ్యవహారాల్లో చికాకులు యేర్పడి సర్దుకొంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.



ఆగస్టు

క్షణంకూడా విశ్రాంతి లేకుండా మీరు యెంతో కృషి చేస్తేనేగాని యేవ్యవహారమూ సానుకూల పడదు. భారీ యెత్తున చేసే వ్యాపారాలు ప్రారంభించడానికి యిది సమయంకాదు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో అకారణంగా అపోహలకు గురికాగల ప్రమాదం ఉంది. పుణ్యకార్యాలు చేస్తారు.

సెప్టెంబరు

ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అనిశ్చిత పరిస్థితి తొలగిపోతుంది. వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు.వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

అక్టోబరు

కొన్ని వ్యవహారాల్లో మీరు ఉద్రేకానికి లొంగిపోవడం వలన చేజిక్కిన అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. వృత్తివ్యాపారాల్లో మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. విలాస వస్తువులు కొంటారు.

నవంబరు

ఈ నెల శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. కొంతమంది మిత్రులకు చికాకులు కలగడం వలన మీకు కూడా యిబ్బంది కలుగుతుంది. వ్యాపారరీత్యా చేసే ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. వృత్తిలో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

డిశంబరు

ఇంతవరకు అనుకూలంగా ఉన్న వ్యవహారాల్లోనే చికాకులు యేర్పడతాయి. వృత్తివ్యాపారాల్లో చేజిక్కిన అవకాశాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో ముఖ్యమైన వ్యవహారాలు మీరు స్వయంగా చూడడం మంచిది. స్వల్ప అనారోగ్యం చేస్తుంది. కుటుంబ వ్యవహారాల్లో స్వల్పభేదాభిప్రాయాలు యేర్పడి సర్దుకొంటాయి.

(వైవారం మిథునం, కర్కాటకం)

—మహేష్ ●

సినిమా

చాలాకాలం తర్వాత విజయా గార్డెన్స్‌కు వెళ్ళాను; అదృష్టంకొద్దీ ఆరోజు అక్కడ షూటింగు జరగడం, ఆ విశేషాన్ని మీకు తెలియచెయ్యడం కలిసి వచ్చినట్లయింది. ఏ చిత్రం తాలుకు షూటింగు జరిగిందో మీకు తెల్పాలిగా!

అది ఒక పబ్లిక్‌పార్కు; ఒక ఫౌంటెన్ ప్రక్కగా రాంమోహన్ దిగులుగ కూర్చుని వుంటాడు; ఆ సమయానికి గీతాంజలి అక్కడికివచ్చి తన మెత్తటి చేతితో రాంమోహన్‌ను తాకుతుంది. అప్పటికీ మౌనంగానే వుంటాడు రాంమోహన్.

గీతాంజలి: ఏమిటీ మౌనానికి అర్థం? మాట్లాడండి.

రాంమోహన్: మనం దూరమయ్యేరోజు దగ్గరికొచ్చింది.

గీతాంజలి: ఏం, యెందుకని?

రాము: దురదృష్టవంతులకు ఆనందం యెప్పుడూ దూరమవుతూనే వుంటుంది.

గీత: నాకర్థం కావడం లేదు.

రాము: మా అమ్మకు చాలా జబ్బుగా వుంది. హైద్రాబాదు తీసుకువెళ్ళాలి.

గీత: రాముా, నా సహాయాన్ని మీరు కాదనరుకదా?

రాము: ఏమిటది?

గీత: హైద్రాబాదు చాలాపెద్దపట్టణం. మీకు తెలుసున్నవాళ్ళు యెవ్వరూ లేరు. వైద్యానికి డబ్బుకూడా కావాలి, నేనుకొంత...

రాము: తల్లిదండ్రుల చాటు బిడ్డవు; నువ్వానాటు అనడంకూడా మంచిదికాదు... నేను ఎవ్వరికీ ఋణగ్రస్తుణ్ని కాలేను.

గీత: మరపురాని మనిషివి. మా అన్నయ్య అక్కడే వుంటున్నాడు. త్వరలో మేమంతా హైద్రాబాదు వస్తున్నాం, అడ్రస్‌యిస్తే...

రాము: థ్యాంక్స్. గుర్తించగలిగితే కలుసుకుందాం!— ఈ సన్నివేశం శ్రీదేవి కంబైన్స్ నిర్మిస్తున్న 'ఐతే అబ్బాయిలు' లోనిది; పేకేటి ఆర్టిస్టుల వద్దనుండి సహజమయిన నటనను రాబట్టగల్గారు; రాముగా రాంమోహన్, రాధగా గీతాంజలి నటిస్తున్న ఈ చిత్రానికి పినిసెట్టి సంభాషణలు పుష్టికరంగా వున్నాయి. తోట



'అగ్గిరవ్వ'లో కె. ఆర్. విజయ.

సుబ్బారావు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆంధ్రాలో జోతి ఫిలింస్ విడుదల చేస్తారు.

విభిన్న రాగాలతో మధురమైన పాటలు

షూటింగు చూచి రికార్డింగు థియేటరుకు వచ్చాను; రెండు ఖంజనీరు స్వామినాథన్, సంగీత దర్శకుడు టి. వి. రాజా రెండు పాట్యాములను బాటు యిటూ త్రిప్పుతున్నారు. లోపల మైకుముందు ఎల్. ఆర్. ఈశ్వరి, పిఠాపురం గొంతెత్తి పాడుతున్నారు; వారిపాట మనసోట వూరే విధంగా టి. వి. రాజా తన సంగీత బృందంచేత విభిన్నరాగాలతో మధురమయిన బాణీలను వినిపింప చేస్తున్నారు; ఈశ్వరి, పిఠాపురం పాడినపాట యెందులోది? అవి

సినిమా డైరీ

● వి. వి. పిం. స్టూడియోలో నవంబరు 11 నుండి 22 వరకు 'మూగనోము' షూటింగు నిర్విరామంగా జరిగింది. యోగానంద్ దర్శకత్వంలో నాగేశ్వరరావు, జమున, రంగారావు, పద్మనాభం, గీతాంజలి, రాజనాల, పాల్గొన్నారు.

● సురేష్‌పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రానికి 'బొమ్మలు చెప్పినకథ' అని పేరుపెట్టారు.

● పి. ఎస్. ఆర్. పిక్చర్స్ 'పేదరాశి పెద్దమ్మకథ' రీ—రికార్డింగు నవంబరు 20 లో వాహిని 'సి' థియేటర్లో పూర్తయింది. పింజల సుబ్బారావు నిర్మించిన యీ చిత్రం నవంబరు 29 న రాయల్‌ఫిలింస్‌ద్వారా ఆంధ్రాలో విడుదలౌతుంది.

● తారకరామాపిక్చర్స్ నిర్మిస్తున్న సాంఘిక చిత్రంలో ఎన్. టి. ఆర్. కు తల్లిగా జూనియర్ శ్రీరంజని నటిస్తోంది. పుండరీకాక్షయ్య నిర్మిస్తున్న యీ చిత్రం యొక్క షూటింగు నవంబరు 16 న వాహినిలో ప్రారంభమైంది. ఎన్. టి. ఆర్. ప్రభాకరరెడ్డి, రమాప్రభ, శివరాం, జయకృష్ణ పాల్గొన్న సన్నివేశాలను బి. ఎ. సుబ్బారావు చిత్రీకరించారు.

● హేమామూవీస్ జానపద చిత్రం యొక్క ఔట్‌డోర్ షూటింగు తిరుక్కోవిలూర్‌లో నవంబరు 17 నుండి 19 వరకు జరిగింది. కాంతారావు, సత్యనారాయణ, రాజబాబు, జగ్గారావులు పాల్గొన్న దృశ్యాలను వేదాంతం రాఘవయ్య డైరెక్టు చేశారు.

● ప్రసాద్ స్టుడియోలో ప్రొడ్యూసర్స్ ఫిలింస్ నిర్మించే 'సెభాష్ సత్యం' చిత్రానికి సంబంధించిన చేసింగ్ సీన్సులో ప్రభాకరరెడ్డి నటించగా, విశ్వనాథం డైరెక్టు చేసాడు.

మీకు తెలుసా?

ప్రముఖ నటుడు కృష్ణ గతవారం రోజులుగ జ్వరంతో బాధ పడుతున్నాడు.

విలన్ సత్యనారాయణకు 'తిరుక్కోయిలారు'లో బాత్‌రూంలో జారి క్రింద పడడం మూలాన గడ్డం క్రింది భాగానికి బాగా దెబ్బ తగిలింది; నవంబరు 23 న డాక్టర్లు కట్టు విప్పుతున్నారు.

సహాయనటుడు కాశీనాథ్ తాతా మిమిక్రీ చెయ్యడంలో సిద్ధహస్తుడు.

వాహిని పిక్చర్స్ నిర్మించిన 'వందేమాతరం' చిత్రంలో బి. ఎన్. రెడ్డి దర్శకత్వంలో మరొక ప్రముఖ దర్శకుడు కె. వి. రెడ్డి ఒక ముఖ్య భూమికను ధరించారు.

ఎల్. విజయలక్ష్మి నటించిన మొదటి తెలుగు చిత్రం డి. ఎల్. నారాయణ నిర్మించిన 'సిపాయి కూతురు.'

విశాలాచార్య యింటికి యే రోజు వెళ్ళినా, కనీసం పది మందయినా ఉదయం ఆరుగంటలకే తయారుగా వుంటారు.

పెద్ద దర్శకుల వద్ద నటిస్తేనే నటనకు రాణింపు వస్తుందనే నమ్మకం గల నటి షర్మిలా ఠాగూర్.

మీకు తెలియ చెప్పాలిగా.

ఎర్ర ఎర్రనిదాన ! బుర్రబుగ్గల దాన
బుర్రా బుగ్గలమీద బుద్దిపుట్టె నాకు
ఓ చిన్నదాన
జొస్కో...జొస్కో— అంటూ పిఠాపురం
పాడాడు.

ఎల్. ఆర్. ఈశ్వరి, ఓరయ్యో బంజారి వాడ! రొయ్యా మీసాలవాడ !

రొయ్యా మీసాలుచూసి నవ్వుపుట్టె
నాకూ, ఓ చిన్నవాడా
జొస్కో...జొస్కో— అంటూ అందుకుం
టుంది.

ఈ పాట శ్రీరాజ్ ఆర్టుఫిలింస్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం. 1 లోనిది. నారాయణరెడ్డి వ్రాసిన యీ పాటను రాజబాబు మీనాకుమారి తెరపై పాడారు. ముంకు వర్మ నిర్మించే యీ సాంఘిక చిత్రానికి కె. ఎస్. గోపాలకృష్ణన్ నిర్దేశకుడు.

* * *

విజయా గార్డెన్స్‌నుండి యెదురుగా వుండే వాహిని స్టుడియోలోకి వెళ్ళాను; ఆరోజు అక్కడ తారకరామా పిక్చర్స్ షూటింగు, సురేష్ పిక్చర్స్ షూటింగు మాత్రమే జరిగాయి. ఆ రెండు చిత్రాలకు సంబంధించిన షూటింగు వివరాల్ని మీకు అందచేస్తున్నాను.

ఎన్. టి. రామారావు మంచంపై పడుకొని మూల్గుతూ, మూలుగుతూ వున్నాడు; అయన్ను బోర్లా పండుకో బెట్టి డాక్టరు పరీక్ష చేస్తుంటాడు; ఆ సమయానికి సబ్‌యిన్‌స్పెక్టరు అక్కడికి వస్తాడు; వచ్చి యేంచేసాడో తెలుసా ?

ఇన్‌స్పెక్టరు: డాక్టర్, యివాళ్టి పరిస్థితి యెలా వుంది ?

డాక్టరు: పర్వాలేదు; తెలివి వచ్చింది; అయినా ట్రీట్‌మెంటు చాలా రోజు లవుతుంది.

ఇన్‌స్పెక్టరు 'మాట్లాడగలడా ?' అనడంతో కట్ అన్నాడు దర్శకుడు బి. ఎ. సుబ్బారావు; ఈ సన్నివేశంలో యిన్‌స్పెక్టరుగా జయకృష్ణ, డాక్టరుగా వల్లభజోస్యుల శివరాం, పేషెంటుగా ఎన్. టి. రామారావు నటించారు. అసలు ఎన్. టి. ఆర్. అక్కడికి యెలా వచ్చాడు ? ఇన్‌స్పెక్టరు రామారావునుగూర్చి తెల్సుకోవలసిన అవసరం యేమిటి ? అనే ప్రశ్నలకు జవాబు చిత్రం చూసినపుడు తెలుస్తుంది. ఈ చిత్రంలో రామారావు ద్విపాత్రాభినయం సరికొత్త పంథాలో వుంటుంది. 'కృష్ణావతారం' లాంటి ఉత్తమ చిత్రాన్ని నిర్మించిన పుండరీకాక్షయ్య తనకున్న మంచిపేరును, తన సంస్థకున్న గౌరవాన్ని యినుమడింప చేసుకునే పద్ధతిలోనే యీ చిత్రాన్నికూడ నిర్మించగలరని ఆశిస్తున్నాను.

చేతిమీద త్రిశూలం పచ్చబొట్టు

ఆ సెట్టునుండి సురేష్ సెట్టుకేసి వెళ్ళాను. సెట్టులోపల త్రిశూలం ఆకారంగల విగ్రహానికి మిక్కిలినేని దీపారాధన చేస్తుంటాడు; అప్పుడు విజయనిర్మల పరుగెత్తుకుంటూ వచ్చి యేదో చెప్పబోయి ఆగుతుంది; కర్పూరహారతి కాగానే మిక్కిలినేని, విజయనిర్మలతో ఊఁ అంటాడు. విజయనిర్మల యిలా చెప్పసాగింది 'ఊఁ లేదు, ఆఁ లేదు. పూచి ఒక లెంపకాయ కొట్టాను. కళ్ళుతేల వేసాను. నాలుక బయటపెట్టాను. నా చెయ్యి చెంప పంటుకుపోయింది. రాతిలా నిలబడిపోయాడు. నేను వచ్చేసాను' అంతే అంటూ గంతులేస్తుంది; ఇదంతా నా తప్పమ్మా, వయస్సువచ్చిన నీకు మూడు



'కథానాయకుడు'లో జయలలిత.

సినిమా

మొగలాయ్యి చెయ్యించి వుంటే సరిపోయేది. వాడు: మీ అన్నయ్య యెక్కడ వున్నాడో, యేమయ్యాడో అని వాపోతాడు; విజయ పీర్స్ ఒకవేళ అన్నయ్య కన్పడితే చాలా గుర్తు పట్టేటి వాన్ని అంటుంది; మీ అన్నయ్యకుకూడ చేతిమీద నీలాగే త్రిశూలం పచ్చబోసి వేటుంది అంటాడు మిక్కిలినేని; ఇక మువ్వు దిగులుపడొద్దు నాన్నా, అన్నయ్యను యెక్కడున్నా పట్టేస్తాను అని మిక్కిలినేనిని ఓదారుస్తుంది. ఈ సన్నివేశం సురేష్ పిక్చర్స్ 'బొమ్మలు చెప్పిన కథ' చిత్రంలోనిది; ఈ చిత్రంలో గొర్రెల కాపరిగా మిక్కిలినేని, ఆయన కుమారుడిగా కృష్ణ, కుమార్తెలుగా విజయనిర్మల, విజయలలిత నటిస్తున్నారు. సముద్రాల జూనియర్ సంభాషణలు వ్రాసిన యీ చిత్రానికి జి. విశ్వనాథం దర్శకుడు; డి. రామానాయుడు నిర్మిస్తున్న యీ జానపద చిత్రాన్ని ఆంధ్రాలో నవయుగ ఫిలింస్ విడుదల చేస్తారు.



'మంచిమిత్రులు'లో విజయనిర్మల, శోభన్ బాబు.

* * *

వాహిని స్టూడియోలో పని ముగించుకుని వాసూస్టూడియోకిపోయాను. రికార్డింగు థియేటరుముందు సురటి దుర్గారావు నిలబడి వున్నాను. నన్నుచూచి రండిరండి అని లోపలికి పిలిచాడు. లోపల సంగీత దర్శకుడు అశ్వత్థామ, గాయకి వసంతకు హార్మోనియం ట్యూనులో రిహార్సలు యిచ్చి టేక్‌కు రెడీ ఇమ్మన్నాడు; వసంత మైకు ముందుకు వెళ్ళడం; వాయిద్యాలు తమ పనిని ప్రారంభించడం ఒక్కుమ్మడిగా జరిగాయి! ఆమె పాడినపాట వివరాన్ని మీరూ తెల్సుకోండి.

అయ్యలార, అమ్మలార
తెలుగుజాతి బిడ్డలార
చేతులెత్తి మొక్కండి కనదుర్గకు
జేజేలు పల్కండి జగన్మాతకు.

ఈ పాటను వద్దాది వ్రాశాడు. శ్రీ ప్రభు పిక్చర్స్ నిర్మిస్తున్న 'కృష్ణా పుష్కర మహిమ' చిత్రంలో నాట్యతార రాధిక పాడుతుంది. ఈ చిత్రాన్ని జనవరిలో విడుదల చెయ్యాలనుకుంటున్నట్లు దుర్గారావు వెల్లడించాడు. ఈ చిత్రంలో అర్జునుడిగా హరనాథ్, శివుడిగ ప్రభాకరరెడ్డి నటిస్తున్నారు.

'కొడుకైనా కసాయివాడైనా ఒకటే...'

నాగేశ్వరరావు, జగ్గయ్య ఒకచోట పెరిగారు; రంగారావు వీళ్ళకు అన్ని విద్యలూ నేర్పుతాడు; యిద్దర్నీ ఒకే విధంగా ప్రేమించాడు. ఒకరోజు నాగేశ్వరరావు, జగ్గయ్యలమధ్య వాగ్వివాదం పెరిగింది; వాళ్ళిద్దరూ యీ క్రింది విధంగా రంగారావుతో చెప్పసాగారు.

జగ్గయ్య: ఇదీ జరిగింది! ఇది నిజం! ఇక చెప్పండి మీ న్యాయం ఏమిటో! తెయ్యాలి తేలిపోవల్సిందే తాడో పేడో! ఒక ముఠాలో వున్నవాళ్ళం. ఒకడు దోచుకుంటూవుంటే మరోడు అడ్డుపడి లవ్ మా నిప్పాడా! చెప్పు సర్దార్ నీ తీర్పువ్వాడు.

నాగేశ్వరరావు: చెప్పు సర్దార్! ఒంటరిగా వున్న ఒక ఆడదానిమీద చెయ్యేసి బలవంతం చెయ్యబోతుంటే తప్పని అడ్డడం అవమానం అయింది!

జగ్గయ్య: ఎవడ్రా బలవంతం చేసింది! దాన్నిపట్టి నాలుగురోజులిక్కడ కట్టిపడేస్తే, దానికావలసినవాళ్ళు కోరినంత డబ్బు గుమ్మరించి విడిపించుకుంటారు.

అక్కినేని: డబ్బుకోసం ఒక ఆడదాన్ని అడ్డం పెట్టుకుంటాడంట యీ మొనగాడు! గుండెబలం, కండబలం వున్నోళ్ళం!

జగ్గయ్య: ఓహో! గుండెబలంగల మొగాడిన్నాళ్ళకు పుట్టుకొచ్చాడంటి! రజాక్ నీరా, రావుడా చెప్పండ్రా ఆట్టా తెయ్యమ్మల్లా మూసిస్తేరంరా!

అక్కినేని: చెప్పండ్రా! ఎవరు చేసింది తప్పో చెప్పండి. ఈయాల యీడు చేసినట్టే రేపు మన ఆడకూతుర్ని మరోడొచ్చి పట్టుకెలితే మనం యేం చేస్తాం!

జగ్గయ్య: మనిషి మనిషిదగ్గరా చెప్పుకునేదిస్తే న్యాయం మారదు! చెప్పు సర్దార్! యిప్పుడు చెప్పు న్యాయం.

రంగారావు: ఆపు! ఆపు అక్కడికి.

జగ్గయ్య: సర్దార్! చెప్పవేం. కొడుకని పక్షపాతం చూపిస్తున్నావా?

రంగారావు: ఈ మల్లుదొరకి కొడుకయినా కసాయివాడైనా ఒక్కటే — న్యాయానికి న్యాయమే. ఊ వెళ్ళు' అని జగ్గయ్యను పంపించేసి నాగేశ్వరరావును తనతో తీసికెళ్తాడు. ఈ సన్నివేశం మాధవి పిక్చర్స్ 'బందిపోటు దొంగలు' చిత్రంలోనిది; నాగేశ్వరరావు, జగ్గయ్యల మధ్య వాదం యేర్పడడానికి కారకురాలయిన ఆ వనిత యెవరు? వీళ్ళిద్దరి దివవర్య లేమిటి? రంగారావు వీళ్ళకేమౌతాడు? అన్న ప్రశ్నలకు సమాధానం జనవరి 31న తెలుస్తుంది. ఎ. ఎస్. ఆర్. ఆంజనేయులు సమర్పించే యీ చిత్రానికి కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు. లక్ష్మీ ఫిలింస్ ద్వారా జనవరి 31 న విడుదలకానున్న

యీ చిత్రాన్ని సుబ్బారావు, ప్రసాద్‌లు నిర్మిస్తున్నారు.

పాపను పట్టిస్తే
వెయ్యి రూపాయలు బహుమతి

చలం అమాయకుడు; లోకం పోకడ తెలియనివాడు; నిజం తప్ప మరేది తెలియనివాడు; జీవితంలో మంచియేదో, చెడు యేదో తెలుసుకోలేనివాడు; అలాంటి వాని జీవితంలో ఒక విచిత్రమయిన సంఘటన అనుకోని విధంగా జరుగుతుంది. అదే రోజారమణి చలానికి దొరకడం. ఒక రోజు విస్సరలక్ష్మి తన కుమార్తె రోజాను తీసుకుని వెళ్తుంది. ఆ సందడిలో రోజారమణి దారి తప్పుతుంది; ఆ పాప వీధి వెంట పోతూ ఒక పూరిగుడిసెలోకి వెళ్తుంది; ఆ సమయానికి చలం జీవితంపై విరక్తి పుట్టి ఆత్మహత్యకు పూనుకోబోతుంటాడు. ఈ చిన్నారిపాపను చూడగానే అమాంతంగవచ్చి ఆ పాపను ముద్దెట్టుకుంటాడు; బిడ్డను పోగొట్టుకున్న విస్సరలక్ష్మి తన చిరంజీవిని పట్టి



'బందిపోటు దొంగలు'లో రాజసులోచన.

యిచ్చిన వాళ్ళకు వెయ్యి రూపాయలు బహుమతి యిస్తానని పత్రికల్లో ప్రకటన యిచ్చింది. ఆ ప్రకటనను రోజారమణి చూస్తుంది; తమ్ము యింటికి తీసికెళ్ళి అప్పచెప్పి వెయ్యి రూపాయలు బహుమతి పొందమని చలంతో చెప్తుంది. ఈ సన్నివేశం వెంకటేశ్వరా సినీటోన్ స్టూడియోలో చిత్రీకరించబడింది. కె. బాలచందర్ దర్శకత్వం వహించే యీ చిత్రాన్ని ప్రసాద్ నిర్మిస్తున్నాడు. చలం పాపను తీసుకెళ్ళి పరంధామికి అప్పగిస్తాడా? వెయ్యి రూపాయలను యేం చేస్తాడు? అన్న ప్రశ్నలకు సమాధానం 'సత్తెకాలపు సత్తెయ్య' చిత్రం చూస్తే తెలుస్తుంది.

షష్ఠి పూర్తి

ప్రముఖ దర్శకుడు, నిర్మాత బి. ఎన్. రెడ్డికి అరవై సంవత్సరాలు నిండాయి; కానీ ఆయన్నుచూస్తే యాభై పైన వుండదనిపిస్తుంది. తన షష్ఠి పూర్తిని బ్రహ్మాండంగా జరిపిస్తామని మిత్రులు అడిగారట. కానీ రెడ్డి దానికి ఒప్పుకొనక తనే నిరాడంబరంగా విజయా గార్డెన్స్‌లో ఒక అల్పాహార విందును

పరిచయం



సంగీత దర్శకుడు
కోదండపాణి

'కన్నకొడుకు' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన కోదండపాణి తన నేర్పుతో, ఓర్పుతో, చక్కటి కళా నైపుణ్యంతో దినదిన ప్రవర్ధమానుడవుతూ నేటికి మేటి సంగీతదర్శకుల్లో ఒకడు కాగల్గాడు.

శాస్త్రోక్తంగా సంగీతాన్ని నేర్చుకున్న యితగాడు మంచిగాయకుడు కూడ! పాటను కవిద్వారా తెలుసుకుని, దర్శకుడితో సన్నివేశ ఔచిత్యాన్ని చర్చించి, తదను గుణ్యంగా ఆపాటకు స్వరకల్పన చెయ్యడంవల్ల అతడు ట్యూనుచేసే ప్రతిపాట హిట్ కాగల్గుతుంది. గాయకుడి గొంతు కనుగుణ్యంగా వాల్యూమును సరిదిద్దుకొని, సరిగమలను సహజ ప్రతిపత్తితో రాగాల్లో యిరికించి, ఆరాగానికి గాయకుడి వాయిస్‌ను జోడించి ప్రేక్షకుల్ని మైమరిపించడమే యితనిలో ప్రత్యేకత.

వాయిద్యాలను యెంతవరకు యెక్కడ, యెలా వుపయోగిస్తే ఆపాట జనాదరణ పొందుతోందో యితనికి బాగాతెలుసు. చిత్రం యొక్క విజయానికి రీ—రికార్డింగు యెంతో వుపయోగ పడుతుంది అంటాడు పాణి, అందుకే ప్రతిబిట్టును సావధానంగావేసి, అదృశ్యానికి నిండుతనం తీసుకురావడంలో దిట్ట కోదండపాణి. ఏ రాగాన్నైనా సరే వినడానికి యింపుకల్గించే విధంగా ట్యూను చెయ్యగల సామర్థ్యంగల వారు కోదండపాణి

ఇంకా తెల్సుకోవలసింది చాలావుంది అనుకునే కోదండపాణికి ముమ్ముందు యింకామంచి భవిష్యత్తు ఉన్నదనటంలో సందేహంలేదు.

సినిమా

యేర్పాటుచేసి తన స్నేహితులను, ప్రాతికేయులను ఆహ్వానించి, తను మొట్ట మొదటిసారిగా దర్శకత్వం వహించిన 'వందేమాతరం', చిత్రాన్ని చూపించి ఆహూతులను ఆనందాబ్ధిలో ముంచెత్తారు.

బి. ఎన్. తీసిన ప్రతిచిత్రం అనితర సాధ్యమయినదీ; అనమానమయినదని నేను చెప్తే మీకు ఆక్షేపణ లేదనుకుంటా. 'వందేమాతరం', 'సుమంగళి', 'స్వర్గసీమ', 'మల్లీశ్వరి' 'బంగారుపాప', 'రంగులరాట్నం' చిత్రాలను చూసేటప్పుడు మనకు శ్రీ రెడ్డి యొక్క కళా నైపుణ్యం ద్యోతకమౌతుంది. ఇప్పుడు నిర్మిస్తున్న 'బంగారు పంజరం' కూడ బంగారు పంటను పండించి, బంగారు కలశాన్ని అందుకోగలదని ఆశించ వచ్చు. నానాటికీ దిగజారిపోతున్న నేటి చిత్ర పరిశ్రమను నిలబెట్టడానికి బి. ఎన్. రెడ్డిలాంటి ప్రముఖుల సేవ యెంతేని అవసరం.

*　　*　　*

ఆడిటర్ బ్రహ్మయ్యకు అరవై సంవత్సరాలు పూర్తయి అరవై ఒకటి ప్రారంభమయిన సందర్భాన్ని పురస్కరించుకొని నిర్మాతలు మల్లికార్జునరావు, పి. ఎం. పి. సుబ్బారావు, రాజేంద్ర ప్రసాద్, డూండీశ్వర రావులు ఒక సంఘంగా యేర్పడి హోటల్ సవేరాలో నవంబర్ 17 న షడ్రసోపేతమయిన విందునేర్పాటుచేసారు.

నవంబరు 17 రాత్రి 8 గంటల 30 నిమిషాలు ఎడ్వర్డ్ యెలియట్స్ రోడ్డులో వున్న సవేరా హోటల్ రంగు రంగుల విద్యుద్దీపాల కాంతితో శోభాయమానంగా విలసిల్లుతూ వుంది. వెండితెర ప్రముఖ కథానాయకులయిన నాగేశ్వరరావు, రామారావులు ఇద్దరు ప్రత్యక్షంగా సాక్షాత్కరించారు. గ్లామర్ తారలు కాంచన, విజయనిర్మల, కృష్ణకుమారి, వాణిశ్రీ, అందాలొలికే తమ చందాలతో విందుకు నిండుదనాన్ని యిచ్చారు. ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, ముఖ్యమయిన ప్రాతికేయులు విచ్చేసి సభను జయప్రదం చేసారు.

బ్రహ్మయ్యగారి జీవిత విశేషాలను వారు పరిశ్రమకు; ప్రభుత్వానికి చేస్తున్న సేవను, వారిపట్ల తమకుగల భక్తి భావాన్ని మన కథానాయకులిద్దరూ తేట తెలుగులో వ్యక్తపర్చారు. ఆ నాటి అభినందన సభకు సుందర్‌లాల్ నహతాగారు అధ్యక్షత వహించారు. ప్రముఖ నిర్మాత జెమిని స్టుడియో అధినేత ఎస్.ఎస్. వాసన్ బ్రహ్మయ్యగారితో తనకున్న పరిచయాన్ని క్లుప్తంగా వివరించారు. తన్ను యింతగా అభిమానించి, అభినందించిన సినిమా పారిశ్రామికులకు, నటీ నటులకు, దర్శకులకు తన మనఃపూర్వకమయిన కృతజ్ఞతలను వెల్లడిస్తూ, ముమ్ముందుకూడ తనకర్తవ్య నిర్వహణలో మంచిపేరును సంపాదించే రీతిగ ప్రవర్తించ గలమని శ్రీ బ్రహ్మయ్య హామీ యిచ్చారు.

— శ్రీనివాస్ ●



'విందుసంసారం'లో కృష్ణకుమారి.

ఆంధ్ర కళాసమితి

జె. కె. పేపర్ మిల్లులోని తెలుగు వారంతా యిటీవల సమావేశమై 'ఆంధ్ర కళాసమితిని ఏర్పాటు చేసుకున్నారు. ఉత్సాహం ఉన్న యితర సంస్థలు ఎక్కడ ఉన్నా ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రధానకార్యదర్శి, 'ఆంధ్ర కళాసమితి' జె. కె. పేపర్ మిల్, జె. కె. పూర్ (వయా) రాయగడ (ఒరిస్సా)కి వ్రాయవచ్చును.

సన్మానం

భీమవరం ఫిలిం ఫేన్స్ అసోసియేషన్‌వారు మున్సిపల్ ఛేర్మన్ శ్రీ పి. చంద్రశేఖరరావు అధ్యక్షతన దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావుకి ఘన సన్మానం చేశారు.

శ్రీ వెంకటేశ్వర కళానికేతన్

శ్రీవెంకటేశ్వరా కళానికేతన్ గుంటూరు వారు డిశంబరు 15వ తేదీన గుంటూరు నికా దండయ్య పంతులుగారి హాలులో శ్రీ ఆదివిష్ణు రాసిన అతిథి నాటిక, అశ్రయం నాటకం ప్రదర్శిస్తారు.

షష్టిపూర్తి

శ్రీ జె. వి. సుబ్బారావు షష్టిపూర్తి మహోత్సవం యిటీవల శ్రీకాకుళంలో ఘనంగా జరిగింది.

...బృహత్కథామంజరి

(1వ పేజీ తరువాయి)

పెళ్ళిమంతా వింటిపోయింది. రాజు మునుపటిలాగే అతనినుంచి ఉల్కం తీసుకొనడానికి దేవసేనుని అడుగును ఆపాడు.

కీర్తిసేన దేవసేనుడున్న చోటికి వెళ్ళింది. అతనిని చూచింది. చిరకాలానికి చూడడంవల్ల అమృత వర్షంతో తడిసినట్లయింది ఆమెకు. దేవసేనుడు మారురూపంలోవున్నప్పటికీ తన భార్యను గుర్తుపట్టాడు. కుతూహలం ఇనుమడించింది. ఆమెనుంచి వివరాలు విన్నాడు. కష్టాలు తొలగి మళ్లీ కలుసుకొన్నందుకు సంతోషించాడు.

వసుదత్తమహారాజు వారిద్దరి కథా విన్నాడు. "దేవసేనుడా, ఈమె నా ధర్మ భగిని. నీవు నా చెల్లెలి భర్తవు. వైద్యుని వేషంలో వచ్చి, ఈమె నాకు ప్రాణాలు ఇచ్చింది" అని అతనితో అంటూ, తన రాజ్యంలో అర్ధభాగం అతనికి సంతోషంతో ధార పోశాడు.

"చెడ్డ, అలాటి అత్తలుంటారు. పాపం కీర్తిసేన అత్తగారివల్ల శోకసాగరంలో పడిపోయి, తన ధైర్యంతో, ఆ శోకసముద్రం దాటి, ప్రియుణ్ణి కలుసుకొంది."

(ఇంకా ఉంది)

ఆటలు

అవసరమైన కొన్ని మార్పులు



మన దేశంలో జరిగే వివిధ అంతర్రాష్ట్ర పోటీలని పరిశీలిస్తే కొన్ని వింతలు తెలుస్తాయి. అసలు ఈ పోటీలు ఎందుకు? ప్రతి పెద్ద ఆటగాడికీ తన నైపుణ్యాన్ని చూపించటానికీ, అందరికీ కావలసినంత పోటీ అనుభవం రావటానికీ కదా! ఇంతకు ముందే రైల్వే, పోలీసు, ఇతర అంతర్జాతీయ సంస్థల జట్లవల్ల రాష్ట్రాల జట్ల స్థాయి పోతున్నదని చెప్పాను. పయిన చెప్పినటువంటి సంస్థల బృందాలు తమలో తామే పోటీలు జరిగేటట్లు ఏర్పరుచుకునే అవకాశం ఉంది. ఇటువంటి పోటీల వల్ల అనుభవమూ పెరుగుతుంది, రాష్ట్రాల స్థాయీ తగ్గదు. ఇప్పుడు మరొక విషయం గురించి రాస్తాను. అదేమిటంటే, దేశంలో అధికారులు ఏర్పరచిన ప్రదేశాలు లేక 'జోన్'లు, వీటిని సంస్కరించాలి.

రంజీట్రోఫీ క్రికెట్ పోటీలలో బొంబాయి, హైదరాబాదు అనే రెండు జట్లు ఆడాయి. ఇవి కాక మహారాష్ట్ర, ఆంధ్ర జట్లు వేరే ఆడాయి!

టెన్నిస్‌లో బొంబాయి హైదరాబాదుజట్లు వేరు కావు; ఫుట్‌బాల్‌లోనూ అంతే. అంటే ఒక్కొక్క ఆటకి సంబంధించిన అధికార సంఘం ఒక్కొక్క విధానాన్ని అనుసరిస్తున్నదన్న మాట.

బొంబాయి క్రికెట్ జట్టు ఎంతో చక్కగా ఆడి ఎన్నోసార్లు నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ని గెలుచుకుంది. అక్కడి ఐకమత్యం, ఏకాగ్రత, ఉత్సాహం దీనికి కారణాలవవచ్చు. కానీ, మహారాష్ట్ర సంగతివేరు. మహారాష్ట్ర క్రికెట్ జట్టు పరిస్థితి అంత బాగా లేదు. మహారాష్ట్ర రాజధాని బొంబాయినగరమే కదా? వీటిని రెంటినీ ఎందుకు కలిపివెయ్యరాదు?

కలిపితే మహారాష్ట్ర ఆటగాళ్ళకి అవకాశాలు తగ్గిపోతాయని కొందరంటారు. ఏమి చేస్తాము? కనీసం ఒక రాష్ట్రానికి ఒకజట్టు, అని మాత్రం ఉంటుంది.

అంతే కాదు, రాజధాని అయినా అక్కడ ఆటగాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. రాజధాని జట్టు బలంగా ఉంటుంది. మిగతా రాష్ట్రం జట్టు బలహీనంగా ఉంటుంది. రంజీట్రోఫీలో ఆంధ్రజట్టు పరిస్థితి మరీ జాలి పుట్టేట్టుగా ఉంటున్నది. హైదరాబాదుతో కలిపితే ఈ బాధ తగ్గుతుంది. టెన్నిస్, ఫుట్‌బాల్‌లకి పనికి వచ్చేది క్రికెట్‌కి పనికిరాదా?

అఖిలభారత స్థాయికల క్రీడా సంఘాలవారు ఈ సమస్యని వెంటనే పరిశీలించి కావలసిన మార్పులు తీసుకురావాలి. వారి శ్రద్ధ అంతా సంఘాల ఎన్నికలమీద ఉన్నది...

—కె. ఎస్. నరసింహావ్

ఇండియాగురించి మనకంటే బ్రిటిష్ ప్రభుత్వానికి బాగా తెలిసి ఉంటుంది. అన్నారు. అమెరికా సైనికాధికారులు.

కెన్నడీ అప్పుడు బ్రిటిష్ ప్రధానికి ఫోనుచేసి 'ధర్మ' గురించి చెప్పాడు. 'ధర్మ'గురించి మాకు కూడా యేమీ తెలియదు. ఈ విషయం చైర్మన్ మావోకు తెలియడానికి అవకాశం ఉంది. నేను ఆయనను యీ విషయం అడుగుతాను' అని బ్రిటిష్ ప్రధాని ప్రెసిడెంట్ కెన్నెడీకి సమాధానం యిచ్చాడు.

తరువాత బ్రిటిష్ ప్రధాని, చైర్మన్ మావోకు ఫోనుచేసి 'ధర్మ' గురించి చెప్పాడు.

వెంటనే మావో తన సైన్యాధిపతులను సమావేశపరచి 'ధర్మ' గురించి వారిని అడిగాడు

''ధర్మ' గురించి మాకేమీ తెలియద'ని వారు చైర్మన్ మావోతో చెప్పారు.

'ధర్మ' ఆయుధాన్ని బహుశా యిండియా కనిపెట్టి ఉండవచ్చు'నన్నాడు ఒక సైన్యాధిపతి.

'ఇది బాగా శక్తివంతమైన ఆయుధం' అయి ఉండవచ్చును. అందుచేతనే మిగిలిన ఆయుధాల మీద యిండియా శ్రద్ధ చూపించలేదు ఆఖరుకు తమ సైనికులకు సరియైన బూట్లను కూడా సప్లై చెయ్యలేదు' అన్నాడు యింకో సైన్యాధిపతి

'మన సైన్యాలను బాగా తమ దేశంలోనికి రానిచ్చి 'ధర్మ'ను ప్రయోగించడం యిండియా

ముగ్గురు మూర్ఖులు

(9-వ పేజీ తరువాయి)

యుద్ధతంత్రమై ఉండవచ్చును' అన్నాడు మరొక సైన్యాధిపతి.

'ధర్మ'ను గురించి మనకు యేమీ తెలియనప్పుడు ముందుకు చొచ్చుకొని వెళ్ళడం మంచిది కాద'న్నాడు మొదటి సైన్యాధిపతి.

మొత్తంమీద చైనా సైన్యాధిపతులందరూ 'ధర్మ'ను గురించి భయపడ్డారు. మావోకూడా వారితో యేకీభవించక తప్పలేదు. వెంటనే మావో యుద్ధ విరమణకు ఆజ్ఞ జారీచేశాడు. యుద్ధం ఆగిపోయింది. అంటూ చిదంబరం 'ధర్మ' ఉదంతాన్ని తెలియజేశాడు.

'కేవలం అర్థం తెలియక పోవడంవల్లనే కాదు. ఉచ్చారణలో పొరపాటు ఉన్నా యిబ్బంది కలుగుతుంది' అన్నాడు చంద్రరావు.

'ఏమిటి' యిబ్బంది? అని చిదంబరం ప్రశ్నించగా చంద్రరావు చెప్పడం ప్రారంభించాడు.

'జార్జి అనే అమెరికా దేశీయుడు యేదో వ్యాపారపు పని మీద ఆంధ్రప్రదేశంలో ఒక పట్టణానికి వచ్చాడు. ఆ పట్టణంలో తమ ఖాతాదారుల వద్దకు వెళ్ళి వ్యాపారం గురించి మాట్లాడాడు. బేరం కుదిరింది. ఆ బేరం తాలూకు షరతులను టైపు చేయడానికి టైపిస్టుకు యిచ్చారు.

ఇంతలో జార్జికి ఆ వూరు చూద్దామని బుద్ధి పుట్టింది. ఆ విషయం జార్జి తమ ఖాతాదారుడైన వర్తకుడితో చెప్పాడు. ఆ వర్తకుడు జార్జికి వూరు చూపించమని తమ గుమస్తా పాపారావును పంపించాడు. పాపారావుకు యింగ్లీషు కొంచెం వచ్చును. అతను జార్జికి బజార్లు, దేవాలయాలు చూపిస్తున్నాడు

దారిలో ఒకచోట జార్జి 'అయ్‌వాంట్ ది భరాటా' అన్నాడు.

'భరాటా' అంటే యేమిటో పాపారావుకు తెలియలేదు. అప్పుడు 'యేం చెయ్యాలా' అని పాపారావు యెదురుగా చూడగా 'అగ్గిబరాటా' పిక్చరు ఆడుతున్న సినిమాహాలు కన్పించింది జార్జి బహుశా యీ సినిమా చూద్దామనుకొని ఉంటాడు అని పాపారావు అనుకొన్నాడు. జార్జిని 'అగ్గిబరాటా' సినిమాకు తీసికొని వెళ్ళాడు. జార్జి అనుకొన్నది అది కాకపోవడం వలన కొంచెం సేపు అయిన తరువాత అతను సినిమాహాలు నుంచి బయటకు వచ్చి వేశాడు. పాపారావు కూడా అతనితో పాటు యివతలకు వచ్చాడు.

'అయ్ డోంట్ వాంట్ దిస్ పిక్చర్' అయ్‌వాంట్ ది భరాటా బుక్' అన్నాడు జార్జి.

వెంటనే పాపారావు అగ్గిబరాటా పాటల పుస్తకాన్ని కొని జార్జికి యిచ్చాడు.

'వాట్ యీజ్ యిన్ దిస్ బుక్'

'స్టోరీ అండ్ సాంగ్స్ ఆఫ్ దిస్ పిక్చర్.'

'అయ్‌డోంట్ వాంట్ దిస్ భరాటా. అయ్ వాంట్ ఒరిజినల్ భరాటా.'

'దిస్ ఆల్సో యీజ్ నాట్ యేనార్డినరీ భరాటా దిస్ యీజ్ అగ్గిభరాటా'

'నో, నో, అయ్‌వాంట్ ది భరాటా, మహాభరాటా' అన్నాడు జార్జి విసుక్కొంటూ.

'మహాభరాటా' అంటే యింకో సినిమా అనుకొన్నాడు పాపారావు.

'మహా భరాటా యీజ్ నాట్ యెట్ రిలీస్డ్. దిస్ యీజ్ ది న్యూ భరాటా వుయ్ హేవ్‌గాట్ యెట్ ప్రజంట్' అన్నాడు పాపారావు.


ఆ మాటలు విని జార్జి తనలో యిలాగ అనుకొన్నాడు 'మహాభరాటాలో పాండవులు కౌరవులు ఉండాలి గదా. దానికి బదులుగా యేదో సినిమాను చూపించి నన్ను మోసం చేద్దామని వీళ్ళు అనుకొంటున్నారు. ఇంత చిన్న విషయానికే వీళ్ళు, మోసం చేస్తున్నారు కదా! ముమ్ముందు వ్యాపారంలో యింకెంత మోసం చేస్తారో అని జార్జి భయపడి అగ్రిమెంటు మీద సంతకం చెయ్యకుండానే బండి యెక్కేశాడు.'

'ఇక మనం కూడా బయల్దేరవచ్చు' నంటూ చూడామణి లేవగానే మిగిలిన యిద్దరూ అతన్ని అనుసరించారు.


మహాభారతాన్నే జార్జి 'మహాభరాటా' అన్నాడని నేను మీకు వేరే చెప్పనక్కరలేదు.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

శక్తివల్ల నీరసమా ?




బిడ్డల వికాసములో లోటా ?



ఆకలి లేదా ?




ఆరోగ్య క్షీణతయా ?



—అయితే వింకోలా-12 ఎందుకు తీసుకోరు ?

...ఇదే మీ ఆనందమయమైన ఆరోగ్య జీవితానికి మార్గము

వింకోలా-12 అద్భుతమైనది. క్షణంలో ఎంత స్ఫూర్తినిస్తుందో !
మీరు శక్తివంతమైన అనుభూతిని పొందుతారు. మీరు
జీవితమాధుర్యాన్ని చవిజూడ గోరుతారు. వింకోలా-12
ఆనందదాయకమైనదేగాక; మీ రక్తములోని ఎఱ్ఱకణములను సృష్టించు
శక్తివంతమైన లోహ పదార్థమును సమకూర్చి, మీలో ఉత్తేజమును తిరిగి
ప్రసాదించును. విటమిన్ బి-12 ఆకలిని పెంచి, పటుత్వమును వృద్ధిచేయును.
ఆరోగ్యక్షీణతను నిర్మూలించుటకు ప్రఖ్యాతి చెందిన భారతీయ ఔషధము
ద్రాక్షారిష్టతో పాటు ఆరోగ్యమును ప్రసాదించి, బలము,
పటుత్వము, సౌష్ఠవమునకు కావలసిన ఖనిజ లవణములు, విటమినులు గలవు.




వింకోలా-12 సేవించి
ఆనందమయమైన ఆరోగ్యజీవితమును అనుభవించండి.

వింకోలా-12

[illegible] విటమిను - ఖనిజపు టానిక్

స్టాండర్డ్
ఫార్మస్యూటికల్స్
లిమిటెడ్, కలకత్తా


Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.



తీపియైన మిల్క్‌మెయిడ్ గడ్డ పాలు కాఫీ, టీలలో కలుపుటకు అనువైనవి...దివ్యమైనవి. వీటితో కాఫీ, టీల రుచి ఇతోధిక మవుతుంది. వీటితో మీరు పంచదారను పొదుపు చేయగలరు. ఎందుచేతనంటే మిల్క్‌మెయిడ్ గడ్డ పాలలో శుద్ధిచేయబడిన పంచదార చేర్చబడినది! ఈ రోజే రెండు డబ్బాలు మిల్క్‌మెయిడ్ గడ్డ పాలు కొనండి. వీటిని మీరు ఎన్నో విధములుగా వాడవచ్చును. మిల్క్‌మెయిడ్ అంటే శుద్ధమైన, తాజాయైన మరియు రుచియైన పాలు!

NPM 7401

ఇప్పుడు
విరివిగా
లభిస్తున్నాయి



వీటిని కలిపి తీపి వస్తువులను చేస్తే అవి ఎక్కువ రుచిగా వుంటాయి



ఇవి పండ్లతోను, 'పుడ్డింగ్'తోను తినుటకు దివ్యంగా వుంటాయి



ఇవి మీ బిడ్డకు సహజమైన పోషణ నిస్తాయి

తీపియైన మిల్క్‌మెయిడ గడ్డ పాలు—

ఇవి ఉత్కృష్టమైనవని మీకు తెలియును, ఎందుచేతనంటే ఇవి నెస్లేవారి తయారు!